
ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక
4 అణాలు
ANDHRA PATRIKA



గడ్డంతాత

—ఫొటో: శ్రీపాద వెంకన్న.



"కోపమేల రాధా!—దయ
చూపవేల నాపై"

చిత్రకారుడు:
సుందర్—మద్రాసు

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

Founder : K. NAGESWARA RAO


సంపుటము 50
సంచిక 51
22-8-56

దుర్ముఖ శ్రావణ బహుళ పాడ్యమి బుధవారం

విషయానుక్రమణిక

★

ముఖచిత్రం: పొన్నలూరి బ్రదర్స్‌వారి "భాగ్యరేఖ"లో జమున.



న్యూఢిల్లీ లేఖ

బొంబాయి సమస్య పరిష్కారం కావడం ఈ మధ్య జరిగిన పెద్ద విశేషం. చాలకాలంగా అందరినీ వేధించిన ఈ సమస్య అస్తవ్యస్తంగా పరిష్కారమైంది. ఈ పరిష్కారమార్గాన్ని ఇదివరలోనే మహారాష్ట్రులు ప్రతిపాదించడం, కాంగ్రెసు అధిష్ఠానవర్గం త్రోసిపుచ్చడం అందరికీ తెలిసిన విషయమే

అసలు ఫజులాలీ సంఘ నివేదిక విషయంలో అంతా అస్తవ్యస్తంగానే జరిగింది నివేదికలోని కొన్ని కొన్ని సూచనలు ఆశ్చర్యకరంగా ఉన్నాయని ప్రధాని నెహ్రూ లోగడ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణయాలనేవి లేవనే సిద్ధాంతాన్ని ఋజువు చేసేందుకు అహమ్మదాబాదులో గుజరాతీలు ఇప్పుడు ప్రయత్నిస్తున్నట్లు కనబడుతుంది.

ఈ సమస్యను ప్రజాస్వామిక మార్గంలో, అందరికీ ఆమోదయోగ్యంగా పరిష్కరించాలని ప్రతివారూ అనేవారే. అయితే యీ సూత్రాన్ని పంజాబుకి కూడా వర్తింపజెయ్యాలని ఎవరూ ఎందుకు ఒత్తిడి చెయ్యలేదో? పంజాబు పరిష్కారాన్ని కాదనడానికి కాదు గాని, ఉదాహరణగామాత్రమే ఈ ప్రశ్న వేస్తున్నాను.

బొంబాయి తగాదాలో మహారాష్ట్రులు గుజరాతీలు స్పర్ధించినట్లే, పంజాబు తగాదాలో హిందువులు, సిక్కులు స్పర్ధించారు. మహారాష్ట్రులకూ, సిక్కులకూ ఒక్క విషయంలో పోలిక ఉన్నది. ఇరువురిలోనూ గాఢమైన ఐకమత్యం ఉన్నది. పంజాబీ సుభా విషయంలో కాంగ్రెసు సిక్కులెవరైనా ఉంటే వారు కూడా అకాలీలతోనే ఏకీభవించారు. బొంబాయి సమస్యను ఏవిధంగా పరిష్కరించాలన్నా మహారాష్ట్రులకు, గుజరాతీలకు ఏకీభావం కుదరడం అత్యవసరం. ఇప్పుడు ద్విభాషా బొంబాయి రాష్ట్రాన్ని ఏర్పరచాలనే నిర్ణయాన్ని గుజరాతీలు అంగీకరించినతరువాతనే ప్రభుత్వం కూడా ప్రతిపాదించింది. మరి అకాలీలతో సమాధానానికి వచ్చేముందు పంజాబీ హిందువుల అంగీకారం పొందేందుకు ఎందుకు ప్రయత్నించలేదు? అంగీకారం పొందక పోవడమే కాదు పంజాబీ హిందువుల అభిప్రాయాన్ని తెలుసుకోడానికికూడా ఎట్టి ప్రయత్నమూ జరగలేదు. మత ప్రాతిపదిక పక్షాలతో సంప్రదించడానికి సిద్ధాంతరీత్యా ప్రభుత్వానికిష్టంలేకపోయి ఉండవచ్చునని వాదించవచ్చును. కాని హిందువులలాగానే అకాలీలు కూడా మత ప్రాతిపదిక పక్షం వారేకదా? మరి అకాలీలతో సంప్రతించడానికిష్టపడినప్పుడు హిందువులతో కూడా సంప్రదించవచ్చునే? బహుశా తాము హిందువులకు ప్రతినిధులము గనుక పంజాబీ హిందువులతో ప్రత్యేకంగా సంప్రదించవలసిన అవసరంలేదని ప్రభుత్వం భావించి ఉండవచ్చును. లేక "ప్రజాస్వామిక" పద్ధతిని దానిమానాన దాన్ని వదిలేసి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిద్దామని అనుకొని ఉండవచ్చును.

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

శ్రీ కృష్ణ

(ఆంధ్రపత్రిక విలేఖరి)

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

అకాలీలకూ, మహారాష్ట్రులకు మరొక విషయంలో కూడా పోలికఉంది గలభా చెయ్యడంలో ఇరువురూ దిట్టలే. ఇప్పుడు జరిగిన పరిష్కారాల్ని బట్టి మహారాష్ట్రులు, అకాలీలు గలభాచేసి గెలుచుకవచ్చారని విశదమవుతోంది.


* * *

ఒకసారి చెయ్యికాల్చుకున్న శిశువు మళ్ళీ దీపందగ్గిరికి పోదు. కాని రాజకుమారి అమృతకౌర్ వెడుతుంది ఎందుకంటే ఆమె శిశువుకాదు. పైగా ఆమెకు చేతులుకాల్చుకోవడం ఇష్టం.

గృహనిర్మాణ కర్మాగారాన్ని గూర్చి ఆమె చేసిన గొడవ ఇంకా ఎవరూ మరచిపోలేదు. తన సలహాదారును ఎవరైనా పల్లెత్తుమాట అంటే ఆమెముఖం కోపంతో కందగడ్డ అయిపోయేది. ఇప్పుడు గృహనిర్మాణ కర్మాగారం ఏమైంది? ఆమె సలహాదారు ఏమయ్యాడు? ఈలోగా ప్రజాధనం ఎంత నష్టమైందో? ఈ అనుభవం తరవాత, మళ్ళీ అటువంటిది జరగకుండా ఆమె జాగ్రత్తపడుతుందని అనుకున్నారు. కాని అలా అనుభవం నుండి నేర్చుకునే అలవాటు ఆమెకులేదని మరొకసారి ఋజువైంది. అఖిలభారత వైద్య విద్యాలయం ఇందుకు ఉదాహరణ.

ఈ విద్యాలయం నిర్మించాలని భోర్ కమిటీ సిఫార్సు చేసింది. ఈ ప్రతిపాదన ఎక్కరాకుండా చెయ్యాలని మొదట డా॥ జీవరాజ్ మెహతా ప్రయత్నించారు తగినంత డబ్బులేకపోవడం మరో అభ్యంతరంగా తయారైంది. చివరికి న్యూజీలండ్ ప్రభుత్వం సహాయం చేస్తామన్నది న్యూజీలండ్ మంత్రి ఒకాయన వచ్చి శంకుస్థాపన చేసి వెళ్ళారు. తరవాత ఢిల్లీలో కొంత ప్రాతికూల్యం బయలుదేరింది. ఢిల్లీ ఆరోగ్య మంత్రిణి డా॥ సుశీలానయ్యర్ ఈ విషయమై కేంద్ర ఆరోగ్య మంత్రిణి రాజకుమారి అమృత్ కౌర్‌తో మొదటిసారిగా పేచీ పడింది. చివరికి డా॥ నయ్యరే గెలిచింది. రాజకుమారి ఓడిపోయి మరోచోటికి మార్చడానికి నిర్ణయించింది. ఈ విధంగా ఒక ఏడాది వృధా అయింది తరవాత పరిశోధనాలయానికి నమూనాలు కావాలని ప్రకటించడానికి నిర్ణయించడంతో మరో ఏడాది వృథాగా గడిచిపోయింది. బోలెడంత జాగా లభ్యమవుతున్న ప్రదేశంలో ఈ విద్యాలయం కట్టడానికి నిరయించి, మళ్ళీ ఏ ఆలోచన మెరిసిందో, ఆజాగాలో ఎనిమిదంతస్తుల మేడ కట్టడానికి నిర్ణయించారు. ఒక బ్రిటిష్ కంపెనీ ఈ కట్టడం పని స్వీకరించింది. మూడు లక్షల రూ॥లు ఈ కంపెనీకి బయానా ఇచ్చారు. ఇంతవరకూ పనేమీ జరగలేదు. ఎందుకంటే ఆకంపెనీ వారు సిమెంటు, కాంక్రీటు నిపుణులను విదేశాలనుంచి దిగుమతి చేసుకోవాలని ఆలోచిస్తున్నారట.

సరే ఈ సంస్థకు సిబ్బంది నియామకం విషయం వచ్చింది. తిట్లూ దీవెనల సంగతి కూడా వచ్చింది. విమర్శలకు ఆస్కారం ఇవ్వకుండా ఉండాలనుకోవడం వలనైతేనేమి, అవేవో అప్పటికే తగిలిఉండడంవల్ల



భారత ప్రభుత్వం ట్రాంబేలో నెలకొల్పిన అణుశక్తి ఉత్పాదకయంత్రం. ఇది ఆగస్టు 4 నుంచీ పని ప్రారంభించింది.

★ న్యూఢిల్లీ లేఖ ★

ఐతేనేమి, మొత్తానికి, ఒక ప్రవీణుల సంఘాన్ని వేశారు. ప్రమాదవశాత్తు కావచ్చు. ఈ సంఘంలో మూడు స్థానాలు ఒకే రాష్ట్రానికి చెందినవారికి ఇచ్చారు. ఫజ్లుల్ హక్ ఫక్కీలో ఆ ముగ్గురూ తమ రాష్ట్రీయులకే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చారు. పూర్వం ఐక్య బెంగాల్‌కు ఫజ్లుల్ హక్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు, ఇటువంటి వేమైనా వచ్చినపుడు వాళ్ళకీ వీళ్ళకీ ఎందుకని, ఆయన మేనల్లుళ్ళకే అవకాశాలు ఇచ్చేవారు. ఏ వరవడిలో అయితే నేం, మొత్తంమీద, ఈ సంస్థ నిర్వహణాధికారి (అడ్మినిస్ట్రేటర్) గా ఒక ప్రముఖుడిని నియమించారు. ఆయనకి, ఈ రకం పనుల్లో అనుభవం లేదని తెలిసింది. అలాగే, బోధనలో అనుభవంలేని ఒకాయనకి బోధకుడి ఉద్యోగం ఒప్పగించారు. సంగతి సందర్భాలు ఇలా ఉన్నా, ఈ సంస్థ ఆసియా మొత్తం మీద గొప్పదవుతుం దనుకుంటున్నారు, అంటున్నారు.

ఇదంతా ఇలా ఉండగా, అసలు ఈ విద్యాలయానికి సంస్థకు రూపం ఇచ్చినవాడు మూలపురుషుడు అయిన డా॥ కె. సి. కె. ఇ. రాజా భారత ప్రభుత్వం కింద కొలువుకు ఉద్వాసన చెప్పి తప్పుకుంటున్నారు. కేంద్ర సర్వీస్ కమిషన్‌కు, రాజకుమారి అమృతకౌర్‌కు జరిగిన హోరాహోరీ పోరాటాలకు డా॥ రాజా "కథానాయకుడు" వంటివారు. ఆయన పదవీకాలం పొడిగించడం వల్ల కాదంటుంది సర్వీస్ కమిషన్. అది కుదరదనేది శ్రీమతి అమృతకౌర్.

దేశంలో యావన్మందికీ ఉద్యోగాలు ఉండడం అవసరం, చూపించడం ప్రభుత్వ విధి అన్న సుహృదాభిప్రాయంగల ఆరోగ్య మంత్రిణి, చివరకు డా॥ రాజాను ఈ సంస్థకు 'స్పెషల్ ఆఫీసర్'గా నియమించింది.

కొంతకాలం సాగిపోయింది.

"మన దేశంలో జనాభా పెరుగుదల తీరుతెన్నులు తెలుసుకోవడానికి వివరాలు సేకరించి పరిశీలన జరపాలి" అంటూ డా॥ జాన్ మత్తయ్ హఠాత్తుగా ఒకరోజున ఒకసూచన చేశారు. టాటా సంస్థ తక్షణమే అందుకు సంసిద్ధత తెలిపింది. భారత ప్రభుత్వం ఉత్తర క్షణాన దీనికై మూడులక్ష

రూపాయలు మంజూరు చేసింది.

అంతా బాగానే ఉందికాని, ఈమంజూరుతో పాటు చిన్న షరతుల లాంటివి కూడా కొన్ని జారీఅయినట్లు దరిమిలా తేలింది. ఈపరిశీలన తతంగం నడపడానికి డా॥ రాజాను నియమించి, నెలకు పదహారు వందలు జీతం (పెక్ షక్ మామూలుగా ఇస్తూ) ఇవ్వాలన్నది వాటిలో ఒకటి అట.

తీరా ఇంతా జరిగాక డా॥ రాజా దీనికి ఇంకో చిన్న హంసపాదం వంటిది ప్రతిపాదించారు. అమెరికా పంపించి కొన్నాళ్లు తరిఫీదు ఇప్పిస్తేగాని ఈపని తన వల కాదని ఆయన నిష్కర్షగా నిజం ఒప్పుకున్నారట.

అందుకని రాజకుమారి అమృతకౌర్ ఈ విషయం అమెరికాలోని ఫోర్డు సంస్థ పాలకవర్గంతో ప్రస్తావించగా, వారుకూడా వెంటనే సూచనను హర్షించి అరవైనాలుగేళ్ల యువజనుడు డా॥ రాజాకు జనాభా శాస్త్రంలో తరిఫీదుకై అమెరికా పంపడానికి అంగీకరించారు: నిరుద్యోగ నివారణ సమస్య ఈవంక ఇలా ఉండగా మరో చెంపన, అన్నివిధాలా అర్హులయిన మెరికలాంటి యువకులు, ఈపూటా అపూటా, నోటికి చెయ్యి వెళ్ళేచాలునన్న ధోరణిలో నానా అవస్థలూ పడుతున్నారు. చాలా మందికి అవస్థలేమిగులుతున్నాయి. ఈదృష్ట్యా అందరికీ చేతనిండా పనిచూపాలన్న సిద్ధాంతానికి అర్థ నిర్వచనం కొంచెం విపులంగా చెప్పుకోవడం అవసరమని పిస్తుంది.

* * *


ఢిల్లీ నీటిసరఫరా, మురుగు పారుదల వ్యవహారాలసంఘం ఇంజనీరూ కార్యదర్శి అయిన ఆర్. ఎస్. మెహతాకి "ప్రమోషన్" లభిస్తుందని తెలుస్తోంది. ఈయన, మంచి పలుకుబడిగల మంత్రికెవరికో దగ్గరివాడనీ, ఒకానొకప్పుడు, కృష్ణమీనన్ ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న రోజులలో అంతటివాడుకూడా ఈయనమీద అవసరం వచ్చినపుడు చర్య తీసుకోలేకపోయాడనీ చెబుతారు.

గత ఏప్రిల్ నెలలో ఢిల్లీ నగరం అంతా అల్లకల్లోలం అయినకథ విదితమే. మంచినీటి సరఫరా చెడిసందువల, అప్పట్లో స్త్రీ పురుషులూ, పిల్లలూ మొత్తం ఎనభైముగ్గురు నిష్కారణంగా ప్రాణాలు కోల్పోయారని అధికారుల లెక్కలే తేల్చాయి. అపుడు నియమించిన దర్యాప్తుసంఘం తమ నివేదికలో కొంతమంది తమ విధ్యుక్త ధర్మాలను నిర్లక్ష్యం చేశారనీ, అదే ఈ దారుణానికి కారణమనీ పేర్కొన్నారు.


ఈ నీటిసరఫరా వ్యవహారాల సంఘం స్వతంత్ర ప్రతిపత్తిగలదికాబట్టి, దర్యాప్తు

(56-వ పేజీ చూడండి)






పోలవరం, కొవ్వూరు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరంతాలూకాల్లో ప్రవహించే ఎర్రకాలువ—(వాయ్యేరు, ఎనమదురు డ్రైన్ అనికూడా అంటారు) పొంగినది. ప్రజలు చూస్తున్నారు



కొల్లేరు ముంపు :
చినసింగికొలను గ్రామంవద్ద దృశ్యం.

ఏటేటా కృష్ణా గోదావరీ నదుల వరదలు, బుడమేరులాంటి ఏరుల వరదలు అనేక వేల ఎకరాలను ముంచెత్తి, పంటలు పాడు చేసి ప్రజల పొట్టకొట్టి పోతున్నాయి. రిజర్వాయర్లు, వరద కట్టలలాంటి సౌకర్యాలు లేనికారణాన ఈ ఏడు కూడా ప్రజలగోడు తప్పలేదు.



బుడమేరు వరదలలో చిక్కుకున్న ప్రాంతాల్లో శ్రీ గోపాలరెడ్డి.



పోలవరంలో గోదావరి వరద

గీర్వాణ భాషాభ్యాసం

౧౪

[గత సంచిక తరవాయి]

శర్వవర్మ వింధ్యాటవికి వచ్చేవరకు గుణాఢ్యుని జీవితం బహు ప్రశాంతంగా సాగిపోయింది. బృహత్కథాకావ్య పరిసమాప్తితో అతని శోక పత్రయాగం నిర్విఘ్నంగా, సమగ్రంగా కొనసాగించినంత సంతోషం కలిగింది.

కాని శర్వవర్మ తెలియజేసిన నందివర్మ వృత్తాంతం వినగానే అతని హృదయంలో దావానలం చెలరేగింది. బృహత్కథా వ్యాప్తికోసం నందివర్మకు శర్వవర్మామాత్యుని ప్రార్థింపవలసినంత అవసరం ఏమి కలిగిందో తెలియలేదు. ఆ విషయంలో గుణాఢ్యుడెన్నడు నందివర్మతో ప్రసంగించనైనా ప్రసంగించలేదు. అలాంటప్పుడు నందివర్మ పనిగట్టుకుని శర్వవర్మామాత్యుని దగ్గిరికి వెళ్లి, ఆవిధంగా ప్రాధేయపడవలసినంత అవసరం ఏమివచ్చింది?

శర్వవర్మ ప్రతిష్ఠాన నగరానికి ప్రయాణమయ్యేసరికి బాగా చీకటిపడింది. వింధ్యాటవిలో కీచురాళ్లు మోత గింగురుమని మారుమోగింది. గుణాఢ్యుడగ్నిహోత్రం గృహంలో కూర్చుని హోమజ్వాలలపై పవలోకిస్తూ వెంటనే నందివర్మను తీసుకురావలసిందని గుణసేనుని కాజ్ఞాపించాడు. ఆ సమయంలో ఆచార్యుని ముఖం గుణసేనుని కింకొక అగ్ని జ్వాలలా భాసించింది!

వెంటనే అతడు నందివర్మకోసం అరణ్యంలోనికి వెళ్లిపోయాడు. అంతవరకు నందివర్మకు శర్వవర్మ వింధ్యారణ్యానికి వచ్చిన వృత్తాంతమే తెలియలేదు. అతడానాటి మధ్యాహ్నంనించీ ఆచార్యుని క్షేత్రసస్య సంరక్షణలో పడి సతమతమవుతున్నాడు. గుణసేను డతని కాచార్యుని ఆజ్ఞ తెలియబరిచాడు. శర్వవర్మామాత్యునికీ, గుణాఢ్యునికీ మధ్య నడిచిన ప్రసంగం కూడా సంగ్రహంగా తెలియజేశాడు.

చక్రవర్తి ఆజ్ఞానుసారంగానే శర్వవర్మామాత్యు డావిధంగా వింధ్యాటవికి వచ్చి ఉండవచ్చునని నందివర్మ ఊహించాడు. బహుశః విదూషకుని ప్రేరణవల్లనే చక్రవర్తితను అభిప్రాయం మార్చుకొని ఉండవచ్చునని అనుకొన్నాడు.

అంతేగాని విదూషకుడు విశ్వంభర శర్మ నడిపించిన గ్రంథం కొంచెమైనా అతనికి తెలియలేదు. అతని ఊహాంచాలాలలోకూడా అది స్ఫురించలేదు. ఏది ఏమైనా వ్యవహారం అంతా పూర్తిగా విషమించిపోయినదని నందివర్మకు భయం వేసింది. ఆ తరుణంలో జరిగినదంతా ఆచార్యునికి పూసగుచ్చినట్లు చెప్పడంకంటె గత్యంతర మేమీ లేదని నిశ్చయించుకొన్నాడు. తొందర తొందరగా ఆచార్యుని సన్నిధికివెళ్ళి తాను చేసినదంతా ఆచార్యునికి విన్నవించి బృహత్కథావ్యాప్తికోసమే తానా విధంగా ప్రయత్నించాననీ తన తప్పిదం మన్నించవలసిందనీ ప్రార్థించాడు. గుణాఢ్యుడు కొంతసే పతనివైపు నిశితంగా చూశాడు:

"నేను సమస్తము విడిచిపెట్టి ఈ వింధ్యాటవి కెందుకు వచ్చానో నీకు కొంచెమైనా తెలియలేదన్నమాట!"

"కొంచెం తెలియకపోలేదు"

"నీ కేమీ తెలియలేదు! తెలిసి ఉంటే నీవావిధంగా శర్వవర్మామాత్యులను ప్రాధేయపడి ఉండవు!" నందివర్మ ఆమాటతో బాగా దిగులుపడిపోయాడు.

"ఈ రాజాస్థానాల గాలి కూడా సోకని వింధ్యాటవిలో నా హార్ధక్యం వెళ్ళబుచ్చుకుందామని అనుకొన్నాను. గాని ఇక్కడకూడా నాకా కల్లోలం తప్పలేదు." నందివర్మ కిక ఏమనడానికీ పాలుపోలేదు. గుణాఢ్యుడు కొంతసేపటివరకు మాట్లాడలేదు. అలాగ కొంతసేపూరుకొని ఒక్క వేడి నిట్టూర్పు విడిచిపెట్టాడు:

"చివరికి కన్నకొడుకులవంటి శిష్యులను కూడా నేనిక విశ్వసించడానికి వీలు లేదన్నమాట!"

ఆచార్యు డామాట ఎందుకన్నాడో నందివర్మకు తెలియలేదు. ఒక్కొక్క మాట అంటున్నకొద్దీ ఆచార్యుని ముఖం హోమజ్వాలలా వెలిగిపోయింది. నందివర్మకిక ఏమనడానికీ ఏమి చెయ్యడానికీ పాలుపోలేదు. కొంచెంసే పూరుకుని నెమ్మదిగా వన్నాడు: "చక్రవర్తి ప్రార్థనపై శర్వవర్మామాత్యులే మిమ్మల్ని అంతగా ప్రాధేయపడినప్పుడిక దీనిలో మనకు తలవం పేముంది?"

"అవును! తలవంపేమున్నది! శర్వవర్మామాత్యులిప్పుడు గుణాఢ్యుని మహాకావ్యం స్వయంగా సముద్ధరించిన మహామహులుని ప్రతిష్ఠాన నగరంలో అంతటా ఊరేగుతారు! దానిలో మనకు తలవంపేమున్నది! తలెత్తుకొని తిరిగేవారికే తలవంపులు గాని అడవులు పట్టిపోయినవారి కిక తలవంపులేమున్నాయిలే! నీ వన్నది నిజమే!"

ఆచార్యుని వాక్కులోని నిశితవ్యంగ్యం నందివర్మ హృదయంలో శూలాగ్రంలా వేధించింది. తరవాత నందివర్మ మరింక దించిన తల పైకెత్తకుండా చల్లచల్లగా అక్కడనించి జారిపోయాడు.

అటుపిమ్మట గుణాఢ్యుడు నాలుగైదు రోజులవరకు శిష్యులతో ప్రసంగించనే లేదు. దానికి కారణమేమో శిష్యులిద్దరికీ బోధపడలేదు. ఆవిధమైన దీర్ఘక్రోధం వారెన్నడు చవిచూడలేదు. ఆ పరిస్థితిలో వారిద్దరు గుణాఢ్యున్ని అగ్నిహోత్ర గృహ సమీపానికి వెళ్ళడానికికూడా సాహసించలేదు. ఆచార్యు డా నాలుగైదురోజులు అగ్నిహోత్రగృహంలోనే ఉండిపోయాడు. ఎప్పుడోగాని ఇవతలకు వచ్చేవాడుకాడు.

ఒకనాడు నందివర్మ సాహసించి గుణాఢ్యుని అగ్నిహోత్రగృహద్వారంలో నిలబడి కనురెప్పపాటులేకుండా ఆచార్యుని ధోరణి పరిశీలించాడు.

అంతే! నందివర్మ కా దారుణం చూస్తూనే నాలుక పిడచగట్టుకుపోయింది. నోట మాటరాలేదు. కాళ్ళాడలేదు!

ప్రాచీన గాథాలహరి

వి. గణపతి శాస్త్రి

గుణాఢ్యుడు తా నిన్నాళ్లుగా రచించిన బృహత్కథ అంతా ఒక్కొక్క పత్రమే చదివి అగ్నిహోత్రంలో ఆహుతి చేస్తున్నాడు. ఆ తాళపత్రాహుతితో ఆహవనీయాగ్నిహోత్రం జాజ్వల్యమానంగా వెలిగిపోతూంది. అలాగలాగ వందలాది తాళపత్రా లగ్నిహోత్రంలో ఆహుతి అయిపోతున్నాయి. గుణాఢ్యు డెంతోకాలం నించి సంకల్పించి సంకల్పించి వార్ధక్య దౌర్బల్యావస్థలో కూడా దైవందిన దీక్షలో సమాప్తి చేసిన మహాకావ్యమది! అదంతా నేటికీవిధంగా అగ్నిహోత్రజ్వాల కాహుతి అయిపోతున్నది!

నందివర్మ ఇక నిలవలేక తొందర తొందరగా లోపలికి వెళ్ళి ఆచార్యుని పాదాలపై వ్రాలి ఆ గ్రంథం ఆ విధంగా ఆహుతి చెయ్యవద్దని అనేకవిధాలుగా ప్రాధేయపడ్డాడు. తాను చేసిన అపరాధం మన్నించవలసినదనీ అనుమతిలేనిదే ఇంకెన్నడు అటువంటి పని చెయ్యననీ కాళ్ళా వేళ్ళా పడి ప్రతిమాలుకొన్నాడు.

గుణాఢ్యుడంతటితో ఆహోమం ముగించి వేశాడు. అతనిలో జాజ్వల్యమానంగా ప్రజ్వలించిన క్రోధాగ్నిజ్వాల అంతా అంతటితో చాలా వరకు ఉపశమించింది. ఒక్క దీర్ఘనిశ్వాసం విడిచి నిశితంగా నందివర్మకేసి చూచాడు.

“నేను జీవించినంతకాలము ఇటువంటి పొరబాటిక జరగకపోవచ్చును. కాని ఆపైన జరగదనే నమ్మకం ఏమి ఉంది?”

ఆచార్యుని అనంతరంకూడా ఆ మహాకావ్యం రాజన్యులెవరికీ అర్పించనని నందివర్మ వింధ్యవాసినీదేవి సాక్షిగా ఘోరశపథం పట్టాడు. ఆ శపథంతో గుణాఢ్యుని హృదయానికి బాగా ఊరట కలిగింది.

అయితే ఏమి ప్రయోజనం? అప్పటికప్పుడే గుణాఢ్యమహాకవి రచించిన ౭ లక్షల గ్రంథంలోను ఆరులక్షల గ్రంథం ఆహవనీయాగ్నిజ్వాలలో ఆహుతి అయిపోయింది. ఆ గ్రంథం అంతా ఆహుతి అయిపోగానే గుణాఢ్యుని హృదయంలోని ఉత్సాహానందాలన్నీ ఒక్కమారుగా నశించిపోయాయి. జవసత్వాలన్నీ హఠాత్తుగా హరించుకుపోయినట్లయింది.

మొదలు నరికిన తరువులోని జీవచైతన్యం కొంతకాలంవరకు ఎక్కడా చెక్కు చెదరకుండా అలాగే నిలిచి సంచలిస్తున్నట్టు కనిపిస్తుంది. ఆచార్యునికి కూడా అదే అవస్థ పట్టింది.

గుణాఢ్యు డానాటినించీ శిష్యులతోను, అటవికులతోను, ఎంతో ఆప్యాయంగా ప్రసంగిస్తూనే ఉన్నాడు. అయినా అతని హృదయం ఎందుచేతనో అంతర్ముఖమై అనుక్షణము వింధ్యవాసినిచరణధ్యా

★ గీర్వాణ భాషాభ్యాసం ★

సంలో లీనమైపోయింది.. బృహత్కథాదహనంతో అతని హృదయంలోని లౌకికరాగద్వేషాలు, ఈర్ష్యాసూయలు అన్నీ ఒక్కమారుగా అంతరించి పోయాయి. పిమ్మట ఒక విచిత్రమైన నిర్లిప్తస్థితి ఏర్పడింది.

అప్పటినించీ ఆచార్యుని హృదయంలో అనిదంపూర్వమైన ఆధ్యాత్మిక పరిణతి ఏదో కలిగించని శిష్యులిద్దరు అనుకొన్నారు. నానాటికీ కృశించిపోతున్న ఆచార్యుని కొంటురాకుండా అత్యంతభక్తిశ్రద్ధలతో పరిచర్యలు చేశారు. అయినా ఆచార్యుని ముఖభంగిమ వారికి కేవలం నివురుగప్పిన హోమాగ్నిలా కనిపించింది.

౧౫

శర్వవర్మ వింధ్యాటవికి రాగానే మొట్టమొదటగా ఎలాగైనా నందివర్మను కలుసుకొని సంప్రతించవలెననీ అనంతరమే గుణాఢ్యునితో సంప్రతించవలెననీ అనుకొన్నాడు. కాని అనుకొన్నట్టుగా మొట్టమొదట నందివర్మ కనిపించలేదు. అయినా బృహత్కథాకావ్యం సంపాదించలేకపోతామా అనే ధైర్యంతో, గుణాఢ్యుని సందర్శించాడు. శర్వవర్మ సంకల్పం నెరవేరలేదు. సరిగదా గుణాఢ్యుని క్రోధం ఆ ప్రార్థనతో మరింత రెచ్చిపోయినట్లు కనబడింది. ఇక చేసేదేమీ లేక వెంటనే ప్రతిష్ఠాన నగరానికి వెళ్లి చక్రవర్తికి జరిగినదంతా విన్నవించాడు. ఆవార్త వినగానే చక్రవర్తిముఖంలో ధూమరేఖ ధుమధుమ లాడింది :

"చివరికి ఆ మహాకావ్యం మనకర్పించడానికి కూడా వారంగీకరించలేదా?"

"అంతకన్న ఆ కావ్యం ఆహవనీయాగ్నిలో హోమం చెయ్యడమే సముచితమని వారి భావన!"

అని శర్వవర్మ చక్రవర్తి ముఖంవైపు పరిశీలనగా చూచాడు. ఆ మాటతోనైనా చక్రవర్తి గుణాఢ్యునియెడల విరక్తి కలగకపోతుందా అని అతని ధైర్యం!

కాని ఆమాట వినిచక్రవర్తి పకపకా నవ్వాడు :

"అంతమాత్రంచేతనే మీరు చేతులు ముడుచుకొని తిరిగి వచ్చివేశారన్నమాట! అంతేనా?"

శర్వవర్మ చక్రవర్తి మాటలలోని అధిక్షేపం గ్రహించి తెల్లబోయాడు.

"శాతవాహన సామ్రాజ్య మహామాత్యులైనా తామీమాత్రం స్వల్పకార్యం నెరవేర్చుకొని రాలేకపోతారా! అని అనుకొన్నాను నేనే కొంచెం భ్రమప్రమాదాలకు లోనయినాను!" అన్నాడు చక్రవర్తి హేళగా నిట్టూర్చి.

శర్వవర్మ చేతులుజోడించి నిలబడ్డాడు!

"మహాప్రభూ! తమకు భ్రమ ప్రమాదాలేమిటి! నేనే ఆమాత్రం స్వల్పకార్యం సాధించుకు రాలేకపోతానా? అని అహంకరించాను. నావల్ల పెద్ద తప్పిదమే జరిగిపోయింది." అని నెమ్మదిగా కూర్చున్నాడు.

శర్వవర్మ ప్రభువులాగ్రహోదగ్రులైఉన్న ప్పుడవలంబించవలసిన మెలకువలన్నీ బాగా తెలిసినవాడు. అందుచేతనే మరింక క్షమాపణ

కంటె ఉపాయాంతరమేమీ లేదను కొన్నాడు. కాని చక్రవర్తి ఆ వ్యవహారం అంతటితో విడిచిపెట్టలేదు.

"విశ్వంభరశర్మ విజ్ఞప్తికూడా వారు పెడచెవిని పెట్టారన్నమాట!" అన్నాడు కొంచెం పరీక్షగా శర్వవర్మవెపు చూచి.

"విశ్వంభరశర్మను నేను వెంటబెట్టుకు పోలేదు!" అన్నాడు శర్వవర్మ కొంచెం తలవంచి.

"ఎందుచేత!"

"ఆమాత్రం స్వల్పకార్యం నేను సాధించుకు రాలేకపోతానా! అని అహంకరించానని తమకిదివరకే మనవిచేసుకున్నాను అదే పెద్ద పొరబాటైపోయింది."

"లేకపోతే విదూషకుడేమైనా మీ అమాత్యాధికారం అపహరించగలడని అనుమానించారేమో!" అన్నాడు చక్రవర్తి ఒక చిరునవ్వు చిలకరించి. శర్వవర్మ కామాటతో నిలుచున్న పాటుగా గండ్రగొడ్డలితో తల నరికివేసినట్లయింది:

"మహాప్రభూ! ఈ మహామాత్యాధికారం నిర్వహించడానికి నేను కేవలం అసమర్థుణ్ణి! దీనికి గుణాఢ్యామాత్యులే సర్వసమర్థులు!" అన్నాడు.

ఆపైన శర్వవర్మ దించినతల తిరిగీ పైకెత్తలేదు. చక్రవర్తి అంతటితో విడిచిపెటలేదు:

"అయితే వింధ్యాటవికివెళ్ళినా గుణాఢ్యుల విధంగా సిద్ధసంకల్పులైనవారు చాలా అనుదుగా ఉంటారు!" అన్నాడు.

"తమ సెలవైతే వింధ్యాటవి కింకొకమారు వెళ్ళి వారిని తిరిగీ ప్రార్థింతామని అనుకుంటున్నాను." అన్నాడు శర్వవర్మ ప్రభు హృదయం గ్రహించి.

"మీరు వెళ్ళితే వ్యవహారం మరి విషమిస్తుంది. ఆ విషయం నాకింతకు ముందే తెలుసును!"

అని చక్రవర్తి అలాగే ఔదాసీన్యం వహించాడు. చక్రవర్తికి ముందే తెలిసి నప్పుడు నన్నెందుకు పంపించారో! అని శర్వవర్మ కొంచెం మథనపడ్డాడు. ప్రభువు హృదయ గాంభీర్యం ఇంతవరకు శర్వవర్మకు పూర్తిగా అవగాహన కానేలేదు. అయినదనుకొని భ్రమప్రమాదాలలో పడ్డానని శర్వవర్మ చాలా పశ్చాత్తాపపడ్డాడు. ఆపైన మరి చేసేదేమీ లేక చక్రవర్తిదగ్గర సెలవుతీసుకొని వెళ్ళిపోయాడు.

అటుపిమ్మట కొంతసేపటికి విదూషకుడు విశ్వంభరశర్మ అక్కడికి వచ్చి చక్రవర్తి సన్నిహితంగా కూర్చున్నాడు:

"వ్యవహారం అంతా చెయ్యి దాటిపోయింది! మహాప్రభూ!" అన్నాడెంతో వ్యథిత హృదయంతో.

"ఏమి జరిగింది?" అన్నాడు చక్రవర్తి.

"గుణాఢ్యామాత్యులు తమ మహాకావ్యం ఆహవనీయాగ్ని జ్వాలలలో ఆహుతి చేసివేశారట! "ఇదిగో నందివర్మ అంచీల మీద పంపిన భూర్జపత్రలేఖ! తమరే చిత్తగించండి." అన్నాడు విదూషకుడు కంగారుగా అది అందించి. చక్రవర్తికది చదివినా ఆ హఠాత్సంఘటనకు కారణం తెలియలేదు.

"ఇంతకీ ఈ దుస్సంఘటనకు కారణం?" అన్నాడు చక్రవర్తి ఇంకా ఆ లేఖవైపు చూస్తూ.

"కారణం వేరే అన్వేషించాలా! మన శర్వవర్మమాత్యుల రాజకార్య ధౌరంధర్యమే దానికి కారణమై ఉండాలి! అయితే ఇంకా ఒకలక్షగ్రంథం మిగిలి ఉండడం కొంచెం గుడ్డిలో మెల్లగా కనిపిస్తోంది."

హాలశాతవాహనునికీ మహాకావ్య దహన వృత్తాంతం వినగానే నవనాడులుకుంగిపోయినట్లయింది. ఇంతటి వైపరీత్యం జరగగలదని చక్రవర్తి ఎన్నడు ఊహించిఉండలేదు.

ఆంధ్ర శాతవాహన సామ్రాజ్యంలో అంతటా హాల చక్రవర్తి కవివత్సలుడనే బిరుదు వహించాడు. అపూర్వమైన కవి కార్యాదరణవల్లనే చక్రవర్తికా బిరుదేర్పడి అతనిసామ్రాజ్యంలోఅంతటా పేరుమోసింది.

అవిధంగా కీర్తి వహించిన చక్రవర్తికా వృత్తాంతం విపరీతంగా మనోవేదన కలిగించింది పరీక్షగా విదూషకునివైపు చూచాడు:

'మరిక మన కర్తవ్యం?" విదూషకుడేమీ మాటలాడలేదు.

"నీవొకసారి వెళ్ళి గుణాఢ్యులను సందర్శిస్తే?"

"నాకీవిషయంలో శర్వవర్మామాత్యులకున్న అహంభావమేమీ లేదు." అన్నాడు విదూషకుడు కొంచెం సంకోచిస్తూ. "నాకది తెలియకపోలేదు! ఇది వినయంతో సాధించవలసిన విషయం." అన్నాడు చక్రవర్తి.

"మేమంతా కొద్దో గొప్పో అహంభావ దూషితులమే. నిజానికి తమరొక్కరే సహజ వినయ సంపన్నులు!"

చక్రవర్తి పక్కున నవ్వాడు: "దానికేమి గాని నీవొక్కసారి వింధ్యాటవికి వెళ్ళి వస్తే సర్వం సానుకూలపడవచ్చును!"

"ఇది నా ఒక్కడివల్ల సాధ్యం కాదేమోనని భయపడుతున్నాను. ఆపైన తమచిత్తం"

"అది నాకు తెలియక పోలేదు."

"అయితే వింధ్యాటవిలో మృగయోత్సవం చాటింపించండి!"

"సరే!" అని చక్రవర్తి ఒక దీర్ఘ నిశ్వాసం విడిచిపెట్టాడు. ★

స్కెచ్:

కాకిపిల్ల కాకికి....

ఆ మధ్య మా యింటికి ఓ పేరుపడ్డ రచయిత వచ్చాడు మా మామయ్య కోసం. ఆ రోజున హాల్లో బల్లమీద, నాకథ పడిన పత్రిక ఒకటి ఉండటం సంభవించింది. దాన్ని చూశాడతను. సంగతి, సందర్భము కనుక్కున్నాడు మా మామయ్యని. వెళ్ళిపోయేటప్పుడు నన్ను పిలిచాడు.

"ఏమమ్మా, నీ కథలన్నీ ఫైలులో ఉంచావా?" అన్నాడు.

నేను కొద్దిగా సిగ్గుపడ్డాను. మెడకాయ మీద తలకాయ ఉన్నవాడెవడూ అంతవరకూ నన్ను రచయిత్రిగా గుర్తించి మాట్లాడలేదు. అందులోనూ నా రచనలు చదవాలన్న కుతూహలం చూపిస్తున్నాడీ పెద్ద మనిషి. అందువల్ల నాకు సహజంగా అతనంటే గౌరవం కలిగింది.

"ఆ. వుంచాను." అన్నాను.

"రేపు వస్తాను. తీసి వుంచు" అన్నాడు. ఆ తర్వాత మేము ఏవో మాట్లాడుకున్నాము. అతను నా కథ పడ్డ పత్రిక పేజీలు తిరగేశాడు. నా కథ వున్న పేజీ చూస్తాడేమో ఏమన్నా రిమార్కు చేస్తాడేమో అని నేను కుతూహలంతో చూస్తునే వున్నాను. కానీ ఆ ధ్యాసే లేదతనికి. ఏవో కాలేజీలు, తెలుగు లెక్చరర్లు, ట్యూటర్లు, పిల్లలు— అన్నీ మాట్లాడాం. హఠాత్తుగా విషయం మార్చాడతను.

"ఇంతకీ—వీళ్లు డబ్బిస్తున్నారా. రేషెంటి?"



ఒక చిరునవ్వుతో అన్నాడీ ముక్కలు ఆ పత్రిక నుద్దేశించి.

"ఆ. ఇస్తారట" అన్నాను నేను డిటో ముఖంతో.

"హహహ! నీ కథకి ఇస్తారన్న మాట," అని నవ్వాడు. ఆ నవ్వు చూస్తే "నీ మొహానికి తోడు నీ కథ బాగుండడం కూడానా" అన్నట్టు నా కనిపించింది.

"నీ పేరు అప్పుడప్పుడు చూస్తూనే వున్నాను. చాలానే పడ్డాయి," అన్నాడు.

ఎమ్. జానకీరాణి

"ఊఁ. చాలావరకు అనువాదాలే," అన్నాను ఏమీ తోచక. పేరు చూశానంటాడేమిటి, బాగున్నాయని ఒక కాంప్లిమెంటు పారేయకూడదా, ఎంతైనా ఆడపిల్లను కాదా అనుకున్నాను.

"ఆ. ఆ. అందుకే. ఒరిజినల్సు చదివేసి వుండడం వల్ల అనువాదాలే కాదా అని చదవలేదు. పేరు చూశానంతే. హి హిహి" అన్నాడు.

నాకు ఒళ్లు మండింది. ఇంతోటి మాట నాతో చెప్పకపోతేనేం అనుకున్నాను.

"నీ స్వంత రచనలన్నీ తీసి వుంచు. రేపు వస్తాను," అని లేచాడు. కానీ—అతని ముఖం చూస్తే 'నీ బ్రతుక్కి నీకు స్వంతం కూడానా' అని అనిపించింది.

గుమ్మం దాకా వెళ్ళి "నావి చదివావు కాదూ?" అన్నాడు. అతగాడి నవల ఒకటి సీరియల్ గా పడింది ఆ మధ్య. నిజానికి నేను చదవలేదు. కానీ లోకాచారం ప్రకారమైతే నేనా మాట చెప్పకూడదు.

కానీ—"ఉహు. నే చెప్పటూ సీరియల్సు చదవను. నాకు విసుగు" అన్నాను ఏమన్నా అనుకోనీగాక అని.

"పుస్తకం అచ్చయింది. రేపిస్తాను" అన్నాడు.

"సరే," అన్నాను మూలిగినట్టుగా.

మర్నాడు నా కథలన్నీ తీశాను. అబ్బో చాలానే వున్నాయి, నేనూ రచయిత్రినే, అనుకున్నాను. అన్నీ కట్టకట్టి ఒక కవరులో పెట్టాను. అతనికిచ్చాను మర్నాడు. అతను "రచయిత అభినందనలతో" ఒక పుస్తకం ఇచ్చాడు. నవల నా చేతికిచ్చేప్పుడు అతని ముఖం చూడలేదు కానీ, నా రచనల కట్ట అందించేప్పుడు నా ముఖం ఎల్లావుందో నే నెఱుగుదును—ఓహ్! గర్వంగా, నిర్లక్ష్యంగా, ఇమాజినేటివ్ గా.

ఆ తర్వాత ఓ నాల్గురోజులికి నిక్కి, నీల్గి ఆ నవల చదివాను. అడుగడుక్కీ లోపాలు కనిపించాయి. అబ్బ, ఏమిటీశైలి అనుకున్నాను. మరీ పాత తరహాగా వుంది. అబ్బెబ్బె, ఆడవాళ్లను గురించి భయంకరమైన అభిప్రాయాలున్నాయి ఇతనికి అనుకున్నాను. ఇలాగే ఎన్నెన్నో! అన్నీ ఘోరంగానే కనిపించాయి నాకు, ఆ నవలకి సంబంధించి నంతవరకు.

మరి యింతకీ—నా కథలు నచ్చే వుంటాయి అతనికి. ఐనా అతనికి తనని గురించి చాలా సదభిప్రాయం ఉన్నట్లుంది. దాన్ని చెదరగొట్టేయాలనుకున్నాను.

అతనికి పుస్తకం తిరిగి ఇచ్చేస్తూ ఒక చవట నవ్వు నవ్వాను. "బాగుంది" అని ఆ చిరునవ్వు భావంగా అతను అనుకోవాలని నా అభిమతం. మరి అదెంతవరకు అర్థమైందో అతనికి, అతనూ అల్లాగే నవ్వాడు. నా కథలు ఇచ్చేసి, "హి హి హి చదివాను" అన్నాడు. ఘనకార్యం చేశావు అనుకున్నాను. ఐనా నా కథల్లో ఎంత భావనాశక్తి, శిల్పము, మానవత్వం అనుకున్నాను. కానీ—ఆ క్షణంలోనే అతనూ అల్లాగే అనుకుంటాడు తన నవలని గురించి—అని ఛాయామాత్రంగా నా కనిపించక పోలేదు.

★



35

జ్యేష్ఠ మాసం మధ్యలో సర్వజయ ఆలోచన చేసి, ఎలాగో అపూ ఉపనయనపు ఏర్పాట్లు చేసింది. పరాయి ఇలు; పూజా మందిరం వసారాలో ఓ మూల భయభయంగా అది ముగించుకోవలసి వచ్చింది బామ్మని పిన్ని లడ్లూ అవీ వండటంలో సహాయం చేసింది ఇద్దరు ముగ్గురు వంట బ్రాహ్మణ్నీ వాళ్ళనీ భోజనానికి పిలిచింది. గొప్పవాళ్ళలో వీరూ గుమాస్తా, దీనూ ఖాతాంజీ ఇద్దరు మాత్రమే వచ్చారు

ఉపనయనం అయిన కొన్నాళ్ళకు—ఓ రోజున అపూ లీల యిచ్చిన 'ముకుల్' చదువుతూ కూర్చున్నాడు తన గదిలో.. తలుపు తెరచి ఉంచటంతో ఎవరో లోపలికి వచ్చారు.

అపూ తన కళ్ళను నమ్మలేక పోయాడు. "అరె! ఇకమిటి? ఎప్పుడు—?" అని అడిగాడు విస్తుపోతూ.

లీల కౌతుక దృష్టితో, నవ్వు మొహంతో నుంచుని వుంది.

"వాహ్! భలేదానివి నువ్వు—కలకత్తా నుంచి సోమవారమే వస్తానని చెప్పివెళ్ళావు. ఎన్ని సోమవారాలు గడిచాయి? ఎక్కడా అయిపులేక పోతివి!..." అన్నాడు అపూ.

లీల నవ్వుతూ క్రింద కూర్చుంది. "ఎలా వచ్చేది? స్కూల్లో చేరానుగా! మా నాన్న చేర్పించాడు. నాన్నకి సుస్తీగా ఉంటోంది, ప్రస్తుతం మేము కలకత్తాలో నేగా ఉండటం? కాసిని సెలవలు వచ్చేసరికి అమ్మతో కూడా వచ్చాను - మళ్ళీ బుధవారం వెళ్ళిపోతాను" అన్నది లీల.

అపూ ముఖంలో నవ్వు మాయమైంది. "మీరిహ ఇక్కడ ఉండరా?'

"నాన్నకు నయమయినాక వస్తా మళ్లీ-" అని మళ్లీ నవ్వుతూ

"కళ్లు మూసుకో ఓసారి" అన్నది లీల.

"ఎందుకు?" అని అడిగాడు అపూ.

"మూసుకో మరి"

అపూ కళ్లు మూసుకున్నాడు. మూసుకోగానే చేతి కేదో బరువైన స్పర్శతగిలింది. కళ్లు తెరవగానే లీల కిలకిలా నవ్వింది. ఓ కార్డుబోర్డుపెట్టె వాడి ఒడిలో ఉంది. ఆ పెట్టె మూత తీసి చూపించింది లీల. అందులో ఒక ధోవతి, ఉత్తరీయం, రంగు సిల్కులాల్చీ ఉన్నాయి. లీల నవ్వు ముఖంతో — "అమ్మ ఇచ్చింది. ఎలా ఉన్నాయి? నీ వడుగుకోసం—"అన్నది.

> **అనువాదం:**
> **మద్దిపట్ల సూరి**

ధోవతి ఉత్తరీయం పంజాబీ తరహావి. అవి కట్టుకుని ఉండటం మాట దేవుడెరుగు- అపూ ఈ ఇంట్లో అడుగుపెట్టక పూర్వం అలాంటివాటిని ఎప్పుడూ కళ్లతో చూసి కూడా యెరుగడు.

లీల అపూ ముఖం కేసి చూసి, "ఒక్క నెలలో నీ ముఖంలో చాలా మార్పు వచ్చింది. పెద్దవాడివైనట్లు కన్పిస్తున్నావ్. ఏదీ క్రొత్తగా వేసుకున్న జందెం చూడనియ్. చెవులు కుడుతూంటే నొప్పిపుట్టలా? మా మామయ్యగారి చిన్నకొడుక్కి కూడా వడుగయిందిగా, వాడు ఏడ్చాడు" అన్నది.

అపూ చటుక్కున 'ముకుల్' సంచిక ఒకటి చూపిస్తూ—

"ఈ కథ చదివావా?" అని అడిగాడు.

"ఏదీ చూడనియ్."

అపూ చదివి వినిపించాడు. సముద్రంలో ఎక్కడో స్పెయిన్ దేశపు నౌక ధనరాసులతోసహా మునిగిపోయింది. ఇప్పటివరకు దానికోసమై చాలా వెతికారు. సరిగా అదెక్కడ మునిగిందీ ఎవరూ చెప్పలేకపోయారు. కథ అంతవరకు చదివి, చాలా ఆనందపడ్డాడు.

"ఎవ్వరూ దాన్ని బయటికి తీయలేకపోయారు. అందులో ఎంత ధనం ఉందో తెలుసా? యాభై లక్షుల పౌన్ల విలువగల బంగారం, వెండి ఉన్నాయి. పౌను అంటే పదమూడు రూపాయలు. లెఖ్ఖ వేసి చూడు? అన్నాడు. తర్వాత వాడే ఒక కాగితంమీద లెఖ్ఖ వేసిచూపిస్తూ "ఇదుగో ఇన్నిరూపాయలు." అన్నాడు. అంతకు ముందుకూడా లెఖ్ఖచేసి చూశాడొకసారి. ఉజ్వల ముఖంతో- "నేను పెద్దవాడినయాక వెళ్ళి గాలించి, తప్పకుండా బయటికి తీస్తాను చూడు - ఎవళ్ళూ కనుక్కోలేక పోయారింతవరకు-" అన్నాడు.

లీలసందేహిస్తూ, "నువ్వు వెడతావా? సరిగ్గా ఎక్కడున్నదీ! ఎలా తెలుసుకుని బయటికి తీయగలవ్?" అని అడిగింది.

"ఇదుగో చూడు రాసి ఉంది- 'పోర్టో ప్లాటా' దగ్గరలో సముద్రగర్భంలో'-అని- అక్కడ వెతికి బయటికి తీస్తాను."

ఆ కథ చదవగానే, ఎవరూ కనుక్కోలేకపోవటం మంచిదే అయిందనుకున్నాడు. అందరూ అన్నీ కనుక్కుంటే తనవంతు ఏం మిగులుంది హా? తాను పెద్దవాడయినాక మరి ఏం కనిపెడతాడు" ఇప్పుడిహ తాను వెళ్ళేదాకా ఉండాలి మరి—

లీల వయస్సుకు చిన్నదైనా చాలా తెలివిగలది. ఆలోచించి, ఆలోచించి,"వాళ్లకి ఉన్న ఓడలాంటి ఓడ నీకెక్కడ దొరుకుతుంది? నీకు ప్రత్యేకంగా ఒక ఓడ ఉండాలి, వాళ్లకి ఉన్న ఓడలాంటిది-" అన్నది.

"ఉంటుంది పెద్దవాడి నయాక కొనటానికి నాకు డబ్బు ఉండదాయేం?"

జరిగిన కథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాలు, కావ్యాలు చదివి పండితుడై, పదేళ్ళకి తిరిగివచ్చి కాపరంపెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లల కిదేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో ఆడుకుంటూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రతిదీ కొత్తే. ప్రతిదీవింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది. బడి చదువుకూడా వాడికి ఏమీ అంటలేదు. ఇంట్లోనే తండ్రితాలూకు పుస్తకాలన్నీ చదివేస్తూ ఉండేవాడు. ఒకసారి వాళ్ల ఊళ్లోకి ఒకనాటక సమాజం వచ్చింది. వాళ్లువేసిన నాటకాలు చూసి అపూ తన్మయుడైపోయాడు. తనుకూడా పెద్దయ్యాక నాటక సమాజాల్లో చేరి నటుడైపోవాని కలలు కన్నాడు. తను చూసిన నాటకం కథ ఆధారంగా స్వయంగా ఒక నాటకంకూడా రాసేలశాడు. మొత్తానికి వాడి ఆదర్శాలకు ఆకాశమే అవధి. దుర్గకి మంచి సంబంధం ఏదన్నా చెయ్యాలని తల్లి ఆవేదన పడేది. కాని మంచిసంబంధాలనేవి హరిహరరాయ్ కుటుంబానికి ఎన్నటికీ అందని ద్రాక్షపండ్లే. ఎప్పుడో ఏదో అదృష్టం కలిసివచ్చి తమ సంసారం బాగుపడుతుందనీ, దుర్గ గొప్ప ఇంటి కోడలైపోతుందనీ, అపూ పెద్దవాడై ప్రయోజకుడై తమ కష్టాలు గట్టెక్కిస్తాడనీ ఆమె కలలు కనేది. కాని ఆ కలలు కల్లలుగానే మిగిలిపోయాయి.

ఒకసారి దుర్గకి జ్వరం పట్టుకుని ఎన్నాళ్ళకీ తగ్గలేదు. హరిహరుడు ఊళ్ళోలేడు. తల్లీ, పిల్లలూ తిండికికూడా మొహం వాచిపోయారు. ఆఖరుకి ఒక భయంకరమైన రాత్రివేళ, వర్షం ప్రళయంగా కురుస్తున్నవేళ దుర్గ ప్రాణవాయువులు అనంతంలో లీనమైనాయి. ఆమె జనన మరణ, సుఖదుఃఖ ద్వంద్వాతీతమైన ఏదో అజ్ఞాతలోకానికి వెళ్లిపోయింది. హరిహరుడు ఊరినుంచి తిరిగి వచ్చినతరవాతగాని దుర్గ మరణం వార్త అతనికి తెలియలేదు. పిమ్మట హరిహరుని కుటుంబం అంతా నిశ్చిందిపురం విడిచిపెట్టి కాశీ చేరుకున్నారు. హరిహరుడు కాశీలో హరికథా కాలక్షేపాలతో జీవయాత్ర సాగిస్తూ కొంతకాలానికి జబ్బుచేసి చనిపోతాడు. సర్వజయకు కాశీలో జీవనం సాగక ఒక ధనిక కుటుంబంలో వంటగత్తెగా కుదురుకుంటుంది. కాశీ విడిచిపెట్టి ఆ కుటుంబంతో వెళ్లిపోతుంది. అపూ మళ్లీ కొత్తపరిసరాల్లో, కొత్తజీవితం ప్రారంభిస్తాడు. యజమానిగృహంలో అందరూ సర్వజయ, అపూలయెడ బీదవారిపట్ల ధనికులవలంబించేసహజధోరణినే అనుసరిస్తారు చిన్నకోడలుగారికూతురు లీలమాత్రం అపూ అంటే ఎక్కడలేనిస్నేహం చూపిస్తుంది. శిశు సహజమైన ఆమె స్నిగ్ధ ప్రవర్తన అవ్యక్తమధురసంగీతంలాగ వాణ్ణి ముగ్ధుణ్ణి చేస్తుంది.

★ పథేర్ పాంచాలి ★

ఈసారి లీలకి బాగా నమ్మకం కుదిరినట్టుంది. ఇంక ఆ విషయాన్ని గురించి ఏమీ తర్కించలేదు.

కాసేపయాక "నువ్వు కలకత్తా వెళ్లావా?" అని అడిగింది.

అపూ తల ఊగిస్తూ "నే నెప్పుడూ చూడలేదు. చాలా పెద్ద బస్తీయా? ఈ ఊరికంటే?" అని అడిగాడు.

లీల నవ్వుతూ "—చాలా పెద్దది" అన్నది.

"కాశీ కంటె కూడా పెద్దదా?"

"కాశీ నేను చూడలేదు"

తర్వాత అపూని తన చదువుల గదిలోకి తీసుకువెళ్ళింది. ఒక పుస్తకం చూపిస్తూ "మాడు ఎలాంటి పూలబొమ్మ వేశానో! ఎలా ఉంది డ్రాయింగు?" అని అడిగింది.

అపూ కాసేపయాక, "నేను పడుకుంటాను, చాలా తల నొప్పిగా ఉంది" అన్నాడు.

"ఉండు. తలనొప్పి పోగొట్టే మంత్రం ఒకటుంది నా దగ్గర, పెట్టనా మంత్రం?" అని రెండు చేతులతో తలనొక్కటం మొద

వెళ్తే సరికి అప్పూ నవ్వుతూ— "చాలు చాల్లే. దిమ్మెక్కి పోతోంది" అన్నాడు. లీల నవ్వుతూ—"మా పెద్ద మామయ్య కొడుక్కి కుస్తీ నేర్పే పైల్వాన్ ఒకడుండే వాడు. అతడిదగ్గిర నేర్చుకున్నాను. చాలా బాగుంది కదూ? తగ్గిందా?" అని అడిగింది.

కొద్ది రోజులు పోయాక లీల మళ్లీకలకత్తా వెళ్లిపోయింది.

* * *

అప్పూ తల్లిని ఒప్పించి ఓ స్కూల్లో చేరాడు. వీళ్లియిల్లున్న వీధినుంచి కొంచెం దూరం అలా వెళ్ళి కుడిచేతి వైపు సందు లోకి తిరిగితే అక్కడొక డాబాలో ఉన్నది స్కూలు. అయిదు కురు పేపరు విరిగిపోయిన బెంచీలు చేతులు విరిగిన కుర్చీలు, రంగు పోయిన బ్లాక్ బోర్డు, కొన్ని పాతమ్యాపులు— ఇదీ స్కూలు సరంజామా. స్కూల్ ముందరే మురుగు కాలువ. అప్పూ వాళ్ళ క్లాసు లోంచి కిటికీ గుండా చూస్తే ప్రక్క యింటి సున్నపు బెత్తికలు ఊడిపోయినఇటిక గోడకన్పిస్తూవుంటుంది. పాకీవాళ్లు కాలువలు తుడుస్తూ మురుగుతీసి అక్కడక్కడ కుప్పలుగా పెడుతూ ఉంచటం అప్పూ స్కూల్ కి వెడుతూ చూస్తుండేవాడు. రోజల్లా స్కూల్లోకి ఉక్కిరిబిక్కిరయ్యేంతగా వాసనవస్తూఉంటుంది. ప్రక్కన ఓ హిందూస్తానీ వంటవాడు మధ్యాహ్నమయి వాక బొగులు పొగపెట్టేవాడు కాలికాలని బొగ్గులు ఓ విచిత్రమైన వాసవేస్తుంటాయి. అప్పూ తల దిమ్మెత్తిపోతున్నట్టుంటుంది స్కూల్లోనుంచి బయటికివచ్చినా తగ్గేది కాదది

వాడికి బాగుండటంలేదు, ఏమీ బాగుండ టంలేదు బస్తీలోని ఈ సిమెంట్ కాంక్రీట్ ప్రదేశాలు చూస్తూంటే వాడికి నెక్కట్టిన ట్టుంటోంది. ఏదో లేకపోవటంవల్ల వాడి ప్రాణం కొట్టుకుంటోంది. ఆ లేకపోయిన దేదో తెలియటంలేదు వాడికి......

పచ్చగరిక పెరిగిఉండేచోట్లే తక్కువ. చెట్లుకూడా అక్కడొకటి అక్కడొకటి తప్ప అట్టేఉండవు. ఎర్రగుమ్మరోడ్లు, మురుగుకాల్వలు, ఇళ్ళకీ ఇళ్ళకీ మధ్య ఖాళీల్లో పెంటపోగులు, మురుగునీరు, కుళ్ళినేలికలు, చింపిపోసిన కాగితమ్ముక్కలు. ఒకరోజున ఓ సహపాఠితో అప్పూ వాళ్ళ యింటికి వెళ్ళాడు. డాబాఇల్లది. చుట్టూ ఖాళీస్థలం లేకుండాఉన్న చిన్న చిన్న యిళ్లలో చాలా సంసారాలవాళ్లు అద్దెలకున్నారు. గుమ్మాలకి గోనెగుడ్డల తెరలు. ఇళ్ళక్రింద నేలకి అడుగుఎత్తునయినా లేవు నేలబారుగా ఉన్నాయి. కనుక చెమ్మ ఆరటం అంటూ ఉండదు. గదుల్లో గాలివెలుతురూ అనేవి లేనేలేవు. మెల్లా అంతా కళ్లలంగా

★ పథేర్ పాంచాలీ ★

ఉంటుంది. అందరూ పాయిలో బూడిద ఒకచోటే పోస్తారు. అదంతా వాసన. మొత్తానికదంతా అపూ కసహ్యంగా కన్పించింది. ఆరోజునవాళ్లు ఉండమనిఅంటున్నా ఆట్టేసేపు ఉండలేక పోయాడక్కడ. పెద్ద వీధిలోకి వచ్చాక కాస్త తేరుకున్నాడు... ఇంటికివచ్చినా మళ్లీ అదే ఇరకాటం. అంతకంటె ఓ పిసరు ఎక్కువ. ఇక్కడ మెల్లాతోసహా అంతా గచ్చుమయం. మట్టి కన్పిస్తూ ఉండకపోతే అపూ ఉండలేడు ఇక్కడ ఉన్న ఈ మట్టివేరు. తనకు ఇది వరకు పరిచయం ఉన్న మట్టిలాంటిది కాదు ఈ మట్టి. అదీకాక ఈ యింట్లో ఇష్టం వచ్చినట్లు తిరగటానికి స్వతంత్రం ఏదీ? దొంగలాగా భయపడుతూ పడి ఉండాలి. ఎవరేమంటారో, బిగ్గరగా మాట్లాడటానికి వీల్లేదు, భయం!

ఒకొకరోజున అపూ కచేరీలోకి వెళ్ళి చూస్తూండేవాడు. ముసలి ఖాతాంజి, ఓ బోనులాంటి చీకటిగదిలో కూర్చుంటూ ఉంటాడు. గుడ్డబైండ్ చేసిన లెఖ్ఖల పుస్తకాలు అటూ యిటూ గుట్టగా పెట్టి ఉంటాయి. చిన్న వ్రాతబల్ల ఒకటి ముందు పెట్టుకుని, ఓ మాసిపోయిన బాలీసుకు ఆనుకుని, రోజలా కూర్చుంటాడు ఆ వృద్ధుడు. ఆ గది ఎంత చీకటిగా ఉంటుందంటే పగలు కూడా ఒకొక్కప్పుడు ఆముదం దీపం వెలిగించుకోవలసి వస్తుంది. గిరీశ్ సర్కార్ ఖజానాదగ్గిర కూర్చుంటాడు. ఆట్టె రొంతులేని బల్లమీద ఓ మాసిన గుడ్డ పరచి ఉంటుంది. చుట్టూ-పైన గుడ్డచుట్టిన దస్తరాలు. ఈ గది ఖాతాంజీగది అంత చీకటిగా ఉండదు. రెండుమూడు పెద్ద కిటికీలుకూడా ఉన్నాయి. కాని ఆ బల్లక్రింద చుట్టపీకలు, కాగితమ్ముక్కలు, పాలీదు గూళ్లు, కిరసనాయిల్ దీపపు మసి...ఎకౌంటెంట్ వీరూ "ఇదుగో రామదయాళ్! పోయిన శిస్తు తాలూకు బకాయి ఫలానా వాళ్లకాతాను ఎంత రాసి ఉందో చూడు" అని బిగ్గరగా అడుగుతూంటే—ఎందుకనో అపూ మనస్సుకి అప్పటికప్పుడే వెలపరం పుట్టుకొచ్చేది.

ప్రొద్దునపూట—అపూ దేవిడీ దగ్గరకు వచ్చేసరికి, అక్కడి పిల్లలంతా త్రోపుడు బండి త్రోసుకుంటూ ఆడుకుంటున్నారు. క్రొత్తబండి తళతళ లాడుతోంది. అపూ దగ్గరకువచ్చి చూస్తూ నుంచున్నాడు. "ఇదిగో ఇలారా. మేము కూర్చుంటాంకాని, నువ్వు త్రోస్తావా ఒకసారి" అని అడిగాడు రమేన్.

ఆ బండి దేవిడీలోకి వచ్చినప్పట్నించీ అపూ మనస్సంతా దానిమీదే ఉంది. వాడు సంబరపడుతూ-"ఓ అలాగే త్రోస్తాను-నన్ను కూడా ఒకసారి ఎక్కనిస్తారామరి?" అని అడిగాడు.

"సరే" అలాగే. తొయ్యిబాగా జోరుగా తొయ్యాలి. అన్నాడు రమేన్. కాసేపు అలా ఆడుకోటం అయినాక రమేన్ హఠాత్తుగా "సరే. చాల్లే ఇవాళకి. ఇంక వద్దు" అని, ఆ బండి తీసుకుని అందరూ వెళ్ళిపోబోతూంటే "నేనొకసారి ఎక్కద్దూ?" అని అడిగాడు అపూ.

"అహఁ ఇవాల్టికి ఇంక ఎక్కవద్దు, వెళ్ళు అదే పనిగా ఎక్కితే పాడైపోతుంది. సాయంత్రం చూద్దాంలే-" అన్నాడు రమేన్. అభిమానంతో అపూ కళ్ళళ్ళ వెంబడి నీళ్ళొచ్చాయి. వాడింతసేపూ తనని ఎక్కనిస్తారనే ఆశతోనే వాళ్లందరూ ఎక్కితే త్రోశాడు.

"అరె! వంతు ప్రకారం నన్నొకసారి ఎక్కనిస్తామని చెప్పలేదూ మీరు? అందర్నీ ఎక్కించి త్రోశాను నేను-బాగా త్రోయలా? అప్పుడొకమాటుకూడా ఇలాగే ఎక్కనియ్యలేదు నన్ను" అన్నాడు అపూ.

"ఎందుకు త్రోశావ్ నువ్వు. ఊరుకోలేక పోయావా పోనీ. ఎవరన్నారు నిన్ను ఎక్కమని" డబ్బుపెట్టి కొనందే వస్తుందా బండి?" అన్నాడు రమేన్.

"మరి ఎందుకన్నారు మొదట్లో? ఈ సంతూకూడా అన్నాడు. త్రోసి త్రోసి నా చేతులు నొప్పిపుట్టాయి. నేనొక్కసారైనా-పోనీ మీరే-"

రమేన్ కోపం తెచ్చుకుని, "నేను అనలేదు, పో" అన్నాడు.

"టుర్ ర్! లేవిడీ...ఆ ముఖం చూడు" అన్నాడు సంతూ.

ఊరికే నే-ఉత్థపుణ్యానికే పెదబాబుగారి అబ్బాయ్ టేబూవచ్చి, వాడ్ని మెడ పట్టుకుని ఒక త్రోపుత్రోసి, "పో, పో. మేము ఎక్కనీయం, మా ఇష్టం. మీ యింటికి పో నువ్వు. అసలిక్కడికి ఎందుకు వచ్చావ్ ఆడుకోటానికి?" అన్నాడు.

టేబూ వయసుకి అపూకంటె చిన్నవాడవటంవల్ల, వాడు అవమానం చెయ్యటంవల్ల నయితేయేం, అందరూ కలిసి గేలి చెయ్యటంవల్ల నయితేయేం-అపూ తల తిరిగిపోయినట్లయింది. వాడు ఒక్క విసురుతో తన మెడ వదిలించుకుని టేబూని ఒక్క త్రోపు త్రోసేసరికి, వాడు గిర్రున గోడదగ్గిరకు పోయి పడ్డాడు. తల గోడకి కొట్టుకుని, కాస్త గీరుకుపోయి నెత్తురుకూడా రావడంతో టేబూ 'అమ్మో' అని ఓవెర్రి కేక వేసి ఏడవటం మొదలెట్టాడు.

నౌకర్లూ, దాసీలూ పరుగెత్తుకు వచ్చారు. వంటవాడూ, దర్వానూ వచ్చారు. పైన కచేరీలో పని చూసుకుంటూ కూర్చున్న పెదబాబుగారు సపరివారంగా క్రిందికి దిగి వచ్చారు. పదివైపులనుంచి పదిబిందెల నీళ్ళు, పది విసనకర్రలు, నీళ్లపట్టీలు-ఓహ్, ఒకటే గందరగోళం...

ఆ గందరగోళం కాస్త తగ్గాక, "ఏది ఎవరు కొట్టారో చూడనివ్వండి" అన్నాడు పెదబాబుగారు. దర్వాన్ రామనీహార్ సింగ్ అపూను వెనకనుంచి త్రోసి, పెదబాబుగారి యెదుట నిలబెట్టాడు "వీడేవడు? ఆకాశీనుంచి వచ్చిన వంటావిడ కొడుకు కదూ?" అన్నారు పెదబాబు.

గిరీశ్ సర్కార్ ముందుకువచ్చి, "మా పెద్దవాడు. వాడి పొగరు చూశారా బాబూ! ఆ నాటకం రోజున అందరికంటె ముందుకువచ్చి, బాబుగార్లు కూచునేచోటు లోకి వచ్చి కూర్చున్నాడు. ఇక్కడనుంచి లేచివెళ్లాలి అన్నాను. దాంతో ఎంతఎంత తిర్కాం వేసుకొన్నాడని! మొన్న ఓ రోజున చూద్దునుకదా, శేర్‌గారి వీధి మొగని, ఎర్రలాల్చీ ఒకటి తొడుక్కుని సిగరెట్ కాల్చుకుంటూ వస్తున్నాడు. ఈ యీడుకే యిలా తయారైనవాడు-" అని చెప్పటం మొదలెట్టాడు.

"ఇవాళ ప్రొద్దున మీమాష్టారురా లేదూ? చదువూ అదీ ఏంలేదా? ఇదిగో నా పేం బెత్తం తినకురండి ఎవరైనా! వాడితో కలసి ఎవరు ఆడుకోమన్నారు మిమ్మల్ని?" అన్నారు పెదబాబు రమేన్‌తో.

రమేన్ ఏడుపుముఖం పెట్టి, "మేము ఆడుకుంటూండగా వాడే వచ్చాడు. మేము ఎందుకు పిలుస్తాం. ఇంకా సంతూని అడగండి కావలిస్తే...మీ ఇంగ్లీషు బొమ్మల పత్రిక తీసి చూడబోయాడు, హాల్లోకివచ్చి అవీ ఇవీ తీసి చూస్తూవుంటాడు ఇంకా-" అన్నాడు.

"వాడి సరదాలు చూడండి పైగా-" అన్నాడు గిరీశ్ సర్కార్. ఇప్పుడిహ అపూ వంతు వచ్చింది "ఇలా రా నువ్వు, శేబూని ఎందుకు కొట్టావ్?" అనిఅడిగారు పెదబాబు.

భయంతో ఇప్పటికే అపూ ప్రాణాలు పైన ఎగిరిపోయాయి వాడు కోపం కొద్దీ తల గోడకి కొట్టుకునేట్టు తోసినమాట నిజమే. కాని ఇంత జరుగుతుందని అనుకోలేదు. పిడచకట్టుకుపోయిన నాలికతో ఎలాగో - "శేబూయే నన్ను ముందు-" అనిమాత్రం అనగలిగాడు అపూ.


పెదబాబు వాడిని పూర్తిగా చెప్పనీయకుండానే-"శేబూ వయస్సెంత? నీ వయస్సెంత?" అని అడిగారు.

ఆరిందాగా చెప్పటం చేతనయితే - శేబూ వయస్సుకి చిన్నవాడైనా పనిలో మాత్రం తన పెత్తండ్రి నీలమణిరాయ్ కంటెకూడా ఘటికుడని అపూకూడా చెప్పవచ్చు. శేబూ, ఈ యింట్లో తక్కిన పిల్లలంతా కలసి తనని ఊరికేనే గేలిచేస్తూ ఉంటారని, వెనక నుంచి మొట్టికాయలు వేస్తూవుంటారని కూడా చెప్పవచ్చు నిజానికి! అలాంటప్పుడు తాను ఊరికే ఆడుకోటానికి వెళ్లటమే నా మహాపరాధం! కాని మెల్లా నిండా మూగిన జనం అందరి యెదుట, ముఖ్యంగా పెదబాబుగారి ఎదుటపడి, మాట్లాడటం అనేసరికి అపూ నాలిక అంగిలి కతుక్కుపోయింది. "శేబూ కూడా ఉత్త పుణ్యానికి—నా దగ్గరకు వచ్చి—" అని మాత్రం అన్నాడు.

"స్టుపిడ్! పొగరుబోతా! నిన్ను ఇటు వచ్చి వీళ్ళతో కలిసి తిరగమని ఎవరన్నారు? ఆ బెత్తం ఇలా ఇవ్వండిరా. రా, ఇలా రా—" అని గర్జించాడు పెదబాబు.

తపీనుని ఒక్క దెబ్బ గట్టిగా వీపుమీద తగిలేసరికి అపూ విస్తుపోతూ పెదబాబు ముఖంకేసి, మళ్ళీ ఆయన ఎత్తిన బెత్తంకేసీ చూశాడు. పుట్టాక వాడింతవరకూ ఎప్పుడూ దెబ్బలు తిని యెరుగడు. తండ్రిచేత కూడా తినలేదు. వాడి విభ్రాంత మనస్సు మొదట్లో తాను దెబ్బలు తింటున్నానన్న వాస్తవాన్ని గ్రహించలేక పోయింది. తర్వాత వాడు తనకు తెలియకుండానే దెబ్బల కోసమె రెండు చేతులూ చాచాడు. ఇప్పుడూ వాడు దుఃఖించటానికి కారణమేమీ లేదు. తనవంతు వచ్చినప్పుడే అవకాశం వృథా చేసుకున్నాడు. ఆ దెబ్బలకు శేబూ కూడా తన తలమీది దెబ్బ మరిచిపోయి గుడ్లప్పగించి చూస్తూ నుంచున్నాడు... మరో బెత్తమయితే విరిగి పోయేదే. ఇది బహుశా ఖరీదుగల బెత్తమయి వుంటుంది.

పెదబాబు అలుపు తీర్చుకుని, "అన్నిటికీ తెగించిన మొండివాడివి ఎక్కడో! ఇప్పుడే చెపుతున్నాను నీకు. మళ్ళీ ఎప్పుడయినా ఈ యింట్లో పిల్లలతో కలిశావని విన్నానో, గూబ లెక్కతీసి, మళ్ళీ గుమ్మంలో అడుగుపెట్టకుండా గెంటేస్తాను," అని, మళ్లీ ఎవరివైపుకో తిరిగి, "చూశారా ధీరన్ బాబూ! తల్లి విధవ; మేనేజరు



★ పథేర్ పాంచాలి ★

సతీశ్ బాబు కాశీనుంచి తీసుకువచ్చాడు వీళ్లని. పరువు కల ఇంటివాళ్లు కదా, పోనీ ఉంటారులే అనుకున్నాను. చూడండి తీరు, తల్లి వంటలు చేస్తూ వుంటుంది. వీడు రంగు లాల్చీలు తొడుక్కుని సిగరెట్లు కాలుస్తూ తిరుగుతూ ఉంటాడు" అన్నారు.

అవి అన్నీ మామూలేనండి. కొన్నాళ్లు పోయాక 'కొకైన్' త్రాగుతా డివాం. తల్లి పెట్టె పగలకొడతాడు. వాళ్ల వరుసే అంత! పైగా కాశీపిండం!–" అన్నాడు ధీరేన్ బాబు.

ఇంట్లో వాళ్ళకివన్నీ తెలియలేదు. కాని అపూ దెబ్బలు తిన్నాడన్న సంగతి సర్వజయవిన్నది. కొంచెం వివరంగానే విన్నది యజమానురాలు "అలాంటి గూండాపిల్లవాడయినాక, అమ్మాయీ—" అంటూ ఏమిటేమిటో అన్నది. రొట్టెల గదిలోంచి వచ్చి చూసేసరికి అపూ స్కూలుకు వెళ్ళిపోయాడు. తల్లితో ఏం చెప్పలేదు. ఇలాంటి సంగతులు అపూ ఆసలెప్పుడూ తల్లితో చెప్పడు. క్రోధంతో, దుఃఖంతో, అభిమానంతో సర్వజయకి ఒళ్లు దహించుకుపోతోంది. ఒంట్లోంచి ఆవిర్లు వస్తున్నట్టున్నాయి ఇంట్లో ఉండలేక బయట వసారాలోకి వచ్చి నుంచుంది సర్వజయ.

తన అపూ ఒంటిమీద చెయ్యిచేసుకోవటం! "అమ్మా! నువ్వు మెట్ల గది పొడుగా వెడుతుంటే వంటింట్లోంచి ఉరికే నేను చూస్తాను నిన్ను" అని ఇప్పటికీ అంటూ ఉంటాడు. ఒరిపసివాడు! తనకేమైనా మతి ఉందా? ఎంతెంత దెబ్బలు తగిలాయో! అక్కడ వాడిని ఎవరు ఓదార్చారు! వాడి యేడుపు ఎవరు పట్టించుకుని ఉంటారు!

సర్వజయకి గుండె పగిలేటంత ఏడుపు వచ్చింది. చీకటి రాత్రి ... ఆకాశంలో ఒకటి రెండు నక్షత్రాలు మిలమిల లాడుతున్నాయి— కుక్రపు నావడిపైని ఉసిరి చెట్టు ఆకులు అలాడటంలేదు గాలి బంధించింది. వసారాలో మూలగా నీళ్ళకుండ దగ్గిర కూర్చుని ఆలోచించుకుంటున్న కొద్దీ, దుఃఖంతో సర్వజయ శరీరం కంపించసాగింది...

"భగవాన్, భగవాన్! వాడు నా గారాబుబిడ్డ. వాడు ఒక్క క్షణం కనుచాటయితే నేను ఓటవుగా కూర్చోలేనన్న సంగతి నీకు తెలుసు. శాస్తి ఏదయినా ఉంటే అది నామీదుగా పోనియ్ భగవాన్! వాడినేమీ చేయవద్దు. నా గుండె బ్రద్దలై పోతుంది. నే నది సహించలేను.—"

అపూ స్కూలు పెందరాళే వదిలిపెట్టేశారు. వాడి క్లాసులో పిల్లలంతా కలిసి అపూని 'ఫుట్ బాల్' ఆటలో 'రిఫరీ'గా ఉండమని పట్టుపట్టారు. వాడికి చాలా సంతోషమయింది. వాడీ బస్తీకి రాకమునుపు ఫుట్ బాల్ ఆట ఎన్నడూ చూసికూడా యెరుగడు. వాడంత బాగా ఆడను కూడా లేడు. అయినా క్లాసులో పిల్లలందరికంటె వాడంటే నే ఇష్టం. ఆటలో 'రిఫరీగా' ఉండమని తరుచు వాడికే పిలుపు వస్తూ ఉంటుంది.

"పెద్ద విజిల్ ఇంటిదగ్గర నుంచి వేసే తెచ్చుకుంటాను భాయీ! పెట్టెలో ఊరికే పడివుంది. నేను సరిగా నాలుగింటికల్లా అక్కడికి వచ్చేస్తాను" అన్నాడు అపూ.

దారే వస్తూంటే అపూకి ప్రొద్దుటి సంగతులన్నీ గుర్తుకొచ్చాయి. ఇవాళల్లా వాటిని గురించే ఆలోచించాడు. సిగరెట్ త్రాగుతూ తానారోజున గిరీశ్ సర్కార్ కంట పడినమాట నిజమే. కాని తాను రోజూ త్రాగుతున్నాడా? ఆనాడు చిన్నకోడలుగారిచ్చిన రంగు లాల్చీతొడుక్కుని స్కూలునుంచి తిరిగి వస్తూంటే, దారిలో చటుక్కున వాడికి సరదా పుట్టుకొచ్చింది. పెద్ద పెద్ద బాబులంతా ఇలాంటి లాల్చీలే తొడుక్కుని త్రాగుతూంటారు. తానూ ఓసారి కాల్చి చూద్దాం అనుకున్నాడు. అంచేత చిరుతిండి డబ్బులు పెట్టి సిగరెట్ కొని కాల్చాడు. కాని వెనుక నిశ్చింతిపురంలో చాటుగా కాల్చినప్పుడూ బాగుండలేదు. మొన్ననూ బాగుండలేదు. పోనీ, వది! ఇంతికంటె ఓకానీ మురమురాలు కొనుక్కుతింటే బాగుండేది అనిపించింది. వీటెందుకు కొని చాటుగా త్రాగటం! కాని గిరీశ్ సర్కార్ ఏమీ తెలుసుకోకుండా, నోటికి వచ్చినట్లల్లా చెప్పాడు దేనికి?

అదృష్టం మంచిది, లీల యిక్కడ లేదు. ఉంటే, ఆ అమ్మాయి చూసినట్లయితే చాలా తలవంపులయ్యేవి! అమ్మకి కూడా బహుశా తెలిసి ఉండదు. అమ్మకి ఎక్కడ తెలిసిపోతుందో అన్న భయంతోనే అసలుఆదరాబాదరా స్కూలుకి పరుగెత్తుకు వచ్చింది.

లీల చాలా రోజుల్నుంచి రావటంలేదు! ఏడాది క్రితం రావటం నల్నీ రానేలేదు. ఇహ వస్తేమాత్రం వాళ్లు తనని లీలతో మాట్లాడనిస్తారా?

ఇంటికి తిరిగివస్తూ దేవిడీ దగ్గరకు వచ్చేసరికి పైన గ్రాంఫోన్ మోగుతోంది. ఆ సంగీతం చెవిని పడేసరికి వాడెంతో ఉల్లా

వంలో తలపైకెత్తి చూస్తూ పై అంతస్తు కిటికీ క్రిందుగా వీధిలో నిలబడ్డాడు. వీధిలోకి ఆ పాటల్లోని మాటలు సరిగా వినపడటం లేదు. అయినా ఆపాట ఫణితిబాగుంది. అది వింటూంటే స్కూలు, ఆటలు, "రిఫరీ గిరి" ప్రొద్దున దెబ్బలు తిన్న సంగతి అన్నీ మనసులోంచి మాయమైనాయి.

ఆ రాగం వాడి మనస్సును ఎక్కడికో లాక్కుపోతోంది—నిశ్చింది పురం ఏటి ఒడ్డుకి తిరగటానికి వెళ్ళినప్పుడుయెప్పుడూ చూసే అవతలి గట్టున రంగు రంగులపూలతో బూరుగుచెట్లతో నిండి ఉండే ఆ మైదానం, దాని వెనుక నీలాకాశం, చిత్రించి నట్లున్నాయి. ఎండు కొమ్మమీద ఏదో పిట్ట వ్రాలింది అదీ చిత్తరువులో గీసినట్లుంది... వాటి అన్నిటికి వెనుక ఆ దేశం, బహుదూర దేశం— అది ఏ దేశమో తెలియదు— ఉల్లాస భరితమైన మనస్సుకిమాత్రం ఏదో తెలిసినట్లుంటుంది...

ఎవరోపిలుస్తున్నట్లుంది. ఎంతో దూరాన్నుంచి ఆనందోన్మత్తకంఠంతో పిలుస్తున్న పిలుపు విన్పిస్తోంది— 'అప్పూ!!!' మనస్సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతూ 'ఓ—హో—య్'అని మారుపలుకుతోంది.

ఇంటికి రాగానే వాళ్ళ అమ్మ "ఇంత పెందరాళే వచ్చావేంరా?" అని అడిగింది. "పై క్లాసు పిలలు బంతి ఆటలో గెలిచారు అందుకని ఒక పూట స్కూలు ఇవాళ" అని చెప్పాడు అప్పూ.

"ఇలారా, కూర్చో" అని తల్లి, వాడి శరీరం నిమురుతూ ఒక్కక్షణంఆగి, కొంచెం సంకోచిస్తూ "ఇవాళ నాకెందుకునిన్ను పిలుచుకు వెళ్లినట్లున్నారు? కేక లేశారా ఏమైనా?" అని అడిగింది.

"ఎబ్బేలేదు. వాళ్ళకే బాకీ కాస్త దెబ్బతగిలింది. అందుకే పెదబాబుగారు ఏం జరిగిందో అడగటానికని పిలిచారు—" అంతే"

"కేకలూ – గీకలూ ఏమీ చెయ్యలేదు కదా!"

"ఉహూఁ"

సర్వజయ కాసేపు మెదలకుండా ఊరుకుని—"ఓ, సంగతి ఆలోచిస్తున్నాను. ఇక్కడినుంచి వెళ్ళిపోదాం?" అని అడిగింది.

అప్పూ ఆశ్చర్యపోతూ తల్లిముఖంకేసి చూశాడు.. తర్వాత చటుక్కున సంబరపడుతూ– "ఎక్కడికి అమ్మా? నిశ్చింది పూరా? అదే హాయి, పద. నేనక్కడ పూజలూ అవీ చేయిస్తూ ఉంటాను చదువు అయిపోయిందిగా ఏమైనా మన ఊరు, అదే హాయి. ఇక్కడ ఉండొద్దు" అన్నాడు.

"రెండేళ్లనుంచీ ఆలోచిస్తున్నదదే. అక్కడికి వెడదామంటున్నావ్ కాని వెడితే అక్కడ ఏముందో చెప్పు? ఒక యిల్లుంది. కాని అదయినా ఈ మూడేళ్ళనుంచీ ఈ వర్షాలకీ వీటికీ ఇంకా ఉండిఉంటుందా! ఇక్ష్వాకుల నాటి పాత కొంప. కాస్త కొంపడయినా ఉందా ఏమన్నానా?— వెడితే తలదాచుకునే ఇరవయినా లేదు— నవ్వేవాళ్ళకు నవ్వసందు"—

కొంచెంసేపు ఆగి, "అంతకంటె ఇంకొక పని చేస్తే నయమేమో—పోనీ కాశీకి వెడదాం?" అన్నది.

ఏమీ నిర్ణయంకాలేదు. అప్పటికింకా వాళ్ళమ్మ భోజనం కాలేదు. స్నానంచేసి మళ్లీ వంటయింటికి వెళ్లింది. అప్పూకొక్క సంగతి గుర్తొచ్చింది. తన కంఠం బావుంటుంది. అక్కా అనేదామాట! నాటకానికి వచ్చిన ఆ నేస్తమూ అన్నాడదేమాట. ఏ నాటకాల జట్టులోనయినా చేరాలనుకుంటే తీసుకోరా తనని! అమ్మ చాలా కష్టపడుతోందిక్కడ. తానెలాగయినాసరే అమ్మని ఇక్కడినుంచి తీసుకెళ్ళాలి!

అబ్బ! ఎంత వేడిగాఉంది! వంటింటిపొగ గొట్టంలోంచిపొగ మెలికలు మెలికలుగా పైకి పోతోంది...మారుమీద ఎండ! గదిలో అప్పుడేచీకటిగాఉంది...గుర్రపు చావిడిలో మాలీసుచేసే హిందీవాడు ఏమిటో పాడుతున్నాడు. గచ్చునేలమీద గుర్రపు గిట్టల చప్పుడు టక్ టక్ మని విన్పిస్తోంది...ముగ్గు కొల్వ వాసన....తల బద్దలైపోయేట్లుంది "కాసేపు పడుకుని లేచి, 'ఫుట్ బాల్ గ్రౌండ్'కి వెళ్ళొచ్చు. మూడేగా అయిందిప్పుడు. ఇంకా చాలా ఎండగాఉంది" అనుకున్నాడు.

పక్కమీద పడుకుంటే ఎంతసేపటికీ ఒకే సంగతి ఆలోచన రాసాగింది. ఈ సంగతి ఇదివర కెప్పుడూ ఇలా ఆలోచించి చూడలేదు. ఇన్నాళ్ళనుంచీ తన మనస్సులో ఏ మూలో–'చివరికి తనకోసం తన ఊరు ఎదురు చూస్తూ ఉంటుం'దన్న సంగతి స్పష్టంగా జాగృతమయే ఉంది. అక్కడినుంచి వచ్చేటప్పుడు–మళ్లీ తిరిగివస్తామన్న ప్రసక్తే రాలేదప్పుడు–వాడికి తెలుసు. అయినా తన కీవ్యామోహం మాత్రం సాంతం వదిలి పోలేదు...కాని ఇవాళ జరిగిన వాటివన్నిటినీ–ముఖ్యంగా పెదబాబుగారు, అమ్మా వాళ్ళ మాటల్ని ఆలోచించి చూస్తే తన నిరాశ్రయత్వం, తనకి ఇల్లూ వాకిలీ లేకపోవడం కొట్టొచ్చినట్లు కన్పించాయి. ఇంక ఎప్పటికీ తను ఊరు వెళటం అంటూ ఉండదా? ఎప్పటికీ? ఎప్పటికీ?

ఈ పరాయిదేశం, ఈ గిరీశ్ సర్కార్, ఇలా దొంగలా జంకుతూ పడిఉండటం–ఇంతకంటె అమ్మా–తాను చెయ్యిచెయ్యీ పట్టుకుని ఊరికే ఏడాగాలవెంట, దారులవెంట ఎప్పుడూ తిరగటమయినా మేలే!... వీళ్లే శాశ్వతమా తనకు?

గుర్రపుచావిడిలో మాలీసులిద్దరు పోట్లాడుకుంటున్నారు...వంట యింటి కప్పుమీద–కాకులు మూకగావచ్చి వ్రాలాయి అన్నం మెతుకులమీద ఆశకొద్దీ...! రవంతసేపయాక తానొకేసంగతి, చాలాసేపు ఆలోచించిన సంగతి గుర్తొచ్చింది. గుర్రపు చావిడిలో గచ్చుమీద గుర్రాల డెక్కల చప్పుడు ఇంకా విన్పిస్తూనే ఉంది...తాను మట్టిలోకెక్కడికో దిగిపోతున్నాడు...బాగా మట్టిలోకి...క్రిందినుంచి ఎవరోలాగుతున్నట్లుంది ...భలేహాయిగా ఉంది...చికాకేమీ లేదు, చాలా హాయిగాఉంది...అబ్బ...ఎండ విం పెట్లిపోతోంది... అక్క పనులన్నీ ఇంతే ....ఇంత ఎండలో వనభోజనం. 'అక్కా! ఇంత ఎండలో వనభోజనం ఏమిటి? పడుకో' అన్నాడు తాను

రాణూది చెవిదగర కూర్చుని ఎన్నెన్నో సంగతులు చెపుతోంది: జలజల లాడుతున్న రాణూదీ కళ్ళలో అభిమానం వ్యక్తమవుతోంది. తానేం చేస్తాడు? నిశ్చిందిపురంలో తనకు జరుగుబాటు తక్కువ మరి! రాణూదీయా? లీలా?

పిల్లంగ్రోవులు అమ్మటానికని వచ్చిన హారాన్ చక్కగా వాయిస్తున్నాడు— పిల్లంగ్రోవి—చాలా అద్భుతంగా వాయిస్తున్నాడు. 'ఒక కానీపెట్టి పిల్లంగ్రోవి కొనుక్కుంటా నాన్నా! కానీ ఇస్తావా?' అని. అడుగుతున్నాడు తాను తండ్రిని.

తండ్రి తన పెద్దపెద్ద జులపాలను అటూయిటూ సవరిస్తూ, ఆపేక్షగా 'నీ కథ చాలా బావుందినాయనా! అచ్చు అయివచ్చాక చూపిస్తావా నాకు?' అంటున్నాడు!

'కొకెయిన్ ఏమిటి నాన్నా? నేను పెద్దయాక కొకెయిన్ తాగుతానని, గిరీశ్ సర్కార్ అన్నాడు' అని తండ్రిని అడుగుతున్నాడు తాను. తండ్రి మెడలో తామర పూసలదండ! ఆ హరిదాసు మెడలోలాగా.

తను మార్కేఖ్ పాడాసేవన్! కొయ్య

బోర్డుమీద రాసిఉంది. 'మాఝేర్ పాడా' అని. వీపున పెద్ద బరువైన మూట వ్రేలాడేసుకుని. ముందు తాను, వెనుక అమ్మ!...తాను రంగులాల్చీ తొడుక్కున్నాడు. దారిపొడుగునా చల్లనినీడ...ఆకాశంలో సాంధ్య తారక తళుక్కుమంటోంది. పండిన మ్రి పళ్ళ వాసన గాలి!...

నిశ్చిందిపురం త్రోవ తరగటం లేదు... నడుస్తున్నాడు, నడుస్తున్నాడు, నడుస్తున్నాడు...తానూ, అమ్మా. తానీత్రోవను ఒక్కడూ ఎప్పుడూ రాలేదు. దారిగుర్తుపట్ట లేకపోతున్నాడు తాను...ఓకొడవలి చేతి పట్టుకున్న కక్కాయ్!...ఇగుగో! నిశ్చిందిపురం వెళ్ళేదారి చూపిస్తావ్ కాస్త నాకు? యశ్ దా-నిశ్చిందిపురం! వేత్రవతికి అవతలి ప్రక్కన ఉన్నదే అది!

వాళ్ళఅమ్మ ఇంట్లోకి వచ్చి "ఒరేయ్; లేవరా యింక, ప్రొద్దుక్రుంకిపోతోంది. ఆడుకోటానికి ఎక్కడికో వెడతానన్నావ్! లే, లే" అని పిలిచింది.

తల్లి పిలుపుకు ఆదరాబాదరా లేచి, కూర్చుని, చుటూ కలయచూశాడు. అరె! ఎంత ప్రొద్దుక్రుంకిపోయింది. ఎండ అంతా ఎక్కడికి పోయింది!—"ఎక్కడికో ఆడుకోటానికి వెడతానన్నావుగా! వెళ్లలేదేం? ఎటూ కాని వేళ పడుకుని నిద్దరోయావా? నీ ఈల తీసి ఇవ్వనా పెట్టెలోంచి?" అన్నది తల్లి.

తల్లి పెట్టెలోంచి ఈలతీసి, పక్కమీద ఓ ప్రక్కగా పెట్టింది. కాని లిఫరీగా వెడదామనుకున్న వాడి ఉత్సాహమంతా చప్పబడింది. గదిలో అప్పుడే చీకటిగా ఉంది. లేచి, కిటికీ దగ్గరకు వచ్చి, పరధ్యాన్నంగా బయట వైపు చూస్తూ నుంచున్నాడు. ఇంక ప్రొద్దేమీ లేదు. అబ్బ! ఎంత ఉక్కగా ఉంది. గుర్రపు చావిడి దగ్గర మురుగు కాల్వ మరీ కంపు కొడుతోంది. బయట గేట్ దగ్గర గోడ గడియారం ఆరుగంటలు కొబోలు కొడుతున్నది!

ఆ గుర్రపు చావిడి పైగా ఆకాశం కన్పిస్తున్నదే—దానికి తూర్పుగా అటువైపున చాలా దూరాన ఉన్నది తమ నిశ్చిందిపురం...

నిశ్చిందిపురం చూసి యెన్నాళ్ళయిందిప్పటికి! మూడు సంవత్సరాలు ఎంత కాలం!

నిశ్చిందిపురం పగలూ రాత్రీ ఎప్పుడూ తనని పిలుస్తూనే ఉంటుంది; శంఖాల చెరువు పిలుస్తుంది; వెదురుతోపు పిలుస్తుంది. సోనాడాంగా మైదానం పిలుస్తూ ఉంటుంది, కడిమిచెట్టు సులాబీ రేవు పిలుస్తూ ఉంటుంది; దేవి విశాలాక్షి పిలుస్తూ ఉంటుంది!

పాడుబడ్డ నివేశనంలోని నిమ్మపూల వాసనల మధ్య మునగచెట్ల క్రింద మళ్ళీ తిరగటం యెప్పుడు? మళ్ళీ తమ యింటిప్రక్క శిరీష, కర్ణికార వనంలోని పక్షుల రొద లెప్పుడు విన్పిస్తాయి?

ఇప్పటికక్కడ ఇచ్ఛామతిలోకి వర్షపు మురుగు వచ్చి పడుతూ ఉంటుంది. దారిలో బూరుగు చెట్ల క్రిందికి నీరు ఎక్కి ఉంటుంది. పొదలమీది కరంజ, కలమ్బ్రా లతలు పూసి ఉంటాయి. అడవి విష్ణుక్రాంత పువ్వులతో అడవి అంతా, కప్పబడి ఉంటుంది!

వాళ్ళ ఊరి రేవులో గరివింద పొదప్రక్కగా రాజా బాబాయ్ బహుశా ఈపాటికి అలవాటు ప్రకారం స్నానానికి దిగి ఉంటాడు. 'చాల్తా' చెట్లమలుపులో క్రొత్త రెల్లు పొదలదగ్గరగా బెస్త అక్రూర్ చేపలు పడే గంప పెట్టిఉంటాడు. ఇవాళ అక్కడ సంతరోజు. ముసలమ్మ చెరువుగట్టున, ఆ మ్రిచెట్టుచాటున దిగంతంలో ఎర్రని అగ్నిగోళంలాంటి సూర్యుడు అస్తమిస్తూ ఉంటాడు. తాను వదిలిపెట్టివచ్చిన మైదానం దారినే ఊళ్లో పిల్లలు పటూ, నీల్, తినూ. భోలా - అందరూ సంతకు వెళ్ళి వస్తూ ఉంటారు.

ఇప్పటికి - చుట్టూ అడవి ఉన్న తమ యింటి మెల్లాలోకి బాగా నీడ వచ్చేస్తుంది. పక్షులు కలరవాలు చేస్తూ ఉంటాయి. ఆ మధుర - నిశ్శబ్ద - ప్రశాంత సాయం సమయం! ఆ పచ్చపిట్ట ఇవాళకూడా వచ్చి ఆ గోడమీదికి వచ్చిన పెనురు చువ్వమీద వ్రాలి కూర్చుని ఉంటుంది తల్లి వేసిన నిమ్మ మొక్కలు కాపుకు వచ్చిఉంటాయి

ఇంకాసేపుఉంటే తమ ఆ యింట్లో సంజెచీకట్లు అలముకుంటాయి. కాని ఆ సంజవేళ అక్కడెవరూ సంజెదీపం వెలిగించరు...పుక్కిటి పురాణపు కథలు చెప్పరు. నిర్జనంగా ఉన్న ఇంటివాకిట్లో అడవిలా పెరిగిన గచ్చపొదల్లో మిణుగురు పురుగులు రొదచేస్తూ ఉంటాయి...ఎవరూ అటుకేసి అడుగుపెట్టరు. దట్టమైన అడవి మధ్య పడిపోయిన తల్లి వేసిన నిమ్మచెట్లని ఎవ్వరూ కనుక్కోలేరు. అడవి బచ్చలి పూలుపూసి వాటంతటవే రాలిపోతాయి. రేగిపళ్లు, సీతాఫలాలు ఊరికే పండిపోతాయి. పచ్చ ఈకల పిట్టవచ్చి ఏడుస్తూ వెనక్కి తిరిగిపోతుంది.

అడవి అంచున ఆ అపూర్వ - మాయామయ సంధ్యలు ఊరికనే వచ్చిపోతూంటాయి ఎప్పుడూ ఇహ.

ప్రొద్దున మెల్లానిండా ఉన్న జనం అందరియెదుటా దెబ్బలు తిన్నా, వాడు ఒక్క కన్నీటిచుక్క రాల్చలేదు. కాని ఇప్పుడు నిర్జనంగా ఉన్న గదిలో కిటికీదగ్గర ఒక్కడూ నుంచుని, హఠాత్తుగా కుమిలి కుమిలి ఏడ్చాడు. పొంగి పొర్లిన కన్నీళ్లు తన సుందర కపోలాలమీదికి జారగానే, వాటిని తుడుచుకోటానికై చేతులెత్తి,— "మేము మా నిశ్చిందిపురానికి వెళ్లాలి మళ్లీ. భగవాన్! నువ్వు మమ్మల్ని నిశ్చిందిపురం వెళ్లేటు చెయ్యి. లేకపోతే బ్రతకలేను. నీ పాదాలుపట్టుకుంటాను," అంటూ తనలో తాను గుజగుజలాడాడు.

పథదేవత ప్రసన్నంగా నవ్వి, "ఓయి వెర్రివాడా, మీ ఊరిలోని వెదురుతోపుతో కాని, బందిపోటయిన వీరురాయ్ వటవృక్షం దగ్గిరతో కాని, 'ఠల్ చిత్' కాల్వ రేవు దగ్గిరతోగాని ఈ నాపథం అంతమయేది కాదు. మీ 'సోనాడాంగా' మైదానాన్ని, ఇచ్ఛామతి నదిని దాటి, పద్మాలతో నిండి ఉండే మధుఖాలి తటాకం ప్రక్కనుంచి పోయి, వేత్రవతి రేవును దాటి, నూటిగా, కేవలంసూటిగా— దేశాన్ని వదిలి దేశాంతరాలవైపు సూర్యోదయాన్ని విడిచి సూర్యాస్తమయం వైపూ, పరిచితములైన పరిధులన్నీ

పథేర్ పాంచాలీ:

"పాంచాలీ" గీతాలనబడేవి బెంగాలీ పల్లెపదాలు. రాగతాళాలతో నిమిత్తంలేకుండా, సహజ మధుర గాత్రంతో బెంగాల్ పల్లెపట్టుల తరుణీ తరుణులు పొలాలలో, తోటలలో, నదీతటాల వద్ద పాంచాలీ గీతాలు పాడుకుంటారు. సుఖదుఃఖాల, ఆశానిరాశల సమ్మేళనమైన జీవయాత్ర ఛందోబద్ధం, నియమబద్ధం కాని సహజ విచిత్ర సరళిలో, అనంత కాలాల నుంచి అనంత దూరాలవైపు సాగిపోతుంది. ఈ నవల పేరు ("పథగీతం") ఈ అర్థాన్నే సూచిస్తుంది.

అధిగమించి, అపరిచితములైన పరిధులవైపు సాగిపోతున్నది పథం.

దివారాత్రాల్నీ, జననమరణాల్నీ, మాసాల్నీ, సంవత్సరాల్నీ, మన్వంతరాల్నీ, మహాయుగాల్నీ దాటిపోతూనే ఉంటుంది. మాజీవితస్వప్నాలు కుక్కగొడుగుల్లా గుంపులు గుంపులుగా తలలెత్తుతాయి. నా పథం అంతటితోనూ ముగియదు, పోతూనే ఉంటుంది — పోతూనే ఉంటుంది. ముందుకు సాగిపోతూనే ఉంటుంది.

నిదా అనిర్వాణ వీణానిక్వాణం అనంతాకాశంలో అనంతకాలం ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది...

ఈ విచిత్ర ఆనందయాత్రా తిలకాన్ని నీ నుదుట ధరింపచేసి, నిన్ను గృహవిముక్తుణ్ణిచేసితీసుకువచ్చాను.

పద, ముందుకు పద..."అన్నది. ★

(అయిపోయింది)



మండూకసంతతి

మాధవరావు ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ ఇంట్లోనుంచి బయటికొచ్చాడు మళ్లా వెనక్కు తిరిగి చూచాడు! తనస్వహస్తాలతో ఎంతో అందంగా, ముచ్చటగా రాసిన మూడుబోర్డులూ మూడు వేపుల వేలాడుతున్నాయి! 'డాక్టర్, మాష్టర్, టైపిస్టు!' ఆ అక్షరాల కుదిరికకు మాధవరావు మరీమరీ మురిసిపోతున్నాడు ఫర్లాంగు దూరంలోవున్న బస్‌స్టాప్‌కు వెళ్లేలోపల పదిపర్యాయాలైనా వెనక్కు తిరిగి చూచుకున్నాడు. బస్‌స్టాప్ చేరుకునేలోగా మాధవరావుకు మరో సంకల్పం కలగడం, అది మరల వికల్పం కావడంకూడా జరిగిపోయింది! అదేమిటంటే 'ఆర్టిస్ట్' అనే బోర్డుకూడా ఒకటి వేలాడకడితే కనీసం సైన్‌బోర్డులు రాయించుకునేందుకైనా జనం రాకపోరని! కాని ఇలాచేస్తే మిత్రుడు ఆర్టిస్టు నారాయణ్ణి అవమానపరచినట్లే అవుతుందని ఆ భావనకు స్వస్తిచెప్పాడు!

ఇంతలోకే మాధవరావుకు కావలసిన బస్సువచ్చి స్టాప్‌లో ఆగింది. తన ఆలోచనల్ని కట్టిపెట్టి బస్‌లోఎక్కి కూచున్నాడు! స్టూడియోకు టికెట్ కొనుక్కొని మళ్ళీ ఆలోచనల్లో మగ్నమైపోయాడు మాధవరావు! కండక్టరిచ్చిన చిల్లర లెక్కచూచుకొని జేబులో వేసుకున్నాడు. చిల్లర అంటే ఎంతోగాదు-అణాన్నర మాత్రం! ఆ సినిమావాళ్లు రెండు వారాలక్రితం టైప్ చేసిందానికి డబ్బిస్తే మాధవరావు మళ్ళా గూటికి చేరుకోగలడు, లేకపోతే ఐదుమైళ్లు "నటరాజ సర్వీస్"మీద ఆధారపడాల్సిందే! మాధవరావు దీనికీ సంసిద్ధమే. ఎన్ని పర్యాయాలిలా చేయలేదు? ఉద్యోగం కోసం ప్రయత్నించే రోజుల్లో నలుగురు మిత్రులుకలిసిఒకగదితీసుకొని వరసగామూడు మాసాలు 'పాదయాత్ర' చేశారు. 'ఉద్యోగదాన్' చేసినవాడే కన్పించలేదు! ఎన్ని రోజులు నిరాహారవ్రతం అవలంబించలేదు? కరుణించినవాళ్లు కన్పించలేదు. ఆ ముగ్గురు మిత్రులు ఏమయ్యారో మాధవరావు కింతవరకు తెలీదు! 'నోమోర్ హిరోషిమాస్!' అనే బొమ్మగీచిన నారాయణ 'నోమోర్' యాక్టర్‌గా బతుకుదామని ఈ నగరం చేరిన కోటీశ్వరరావు ఉరఫ్ కోటి గాయబ్! ఇక కథలు రాసుకునే ముకుందం పతా బతాయించిన వాడూ కన్పించ లేదు. ఏమయ్యారు, ఏమిటో ఎవరికీ తెలీదు! పోతే మిగిలింది తనొక్కడే! ఆ ఒక్కడూ మూడేసి వృత్తులు అవలంబిస్తున్నా పొట్ట గడవటమే దుర్భరంగా వుంది.

'హోమియో పతి డాక్టర్ కూడా ఒక డాక్టరేనా' అని జనం పెదవి విరిచారు! ఆ డాక్టర్ పదవికూడా పోస్టల్ ట్యూషన్ చదువుకొని ఆర్జించాడు! ఈ విషయం తెలిస్తే ఆ వచ్చేవాళ్లు కూడా రారేమో? ప్రస్తుతం ఏదో బీదా బిక్కా రావటం, వాళ్లు ఓపినంత ఇవ్వటం జరుగుతోంది! వాళ్ళిచ్చే పావలా, బేడలే ఎన్నో పర్యాయాలు ఆదుకున్నాయి!

ఆ తరువాత కొద్దికాలానికే మాధవరావు మాష్టరుగ కూడా మారాడు, ఇంటింటికీ తిరిగి పిల్లలకు చదువు చెప్పటం ప్రారంభించాడు. తనంతట తాను వెళ్ళి 'మీ పిల్లలకు చదువు చెప్పించుకుంటారా!' అని అడిగినందుకు వాళ్లిచ్చినంత జీతం పుచ్చుకోక తప్పింది కాదు! అయితే ఆ ఇచ్చే జీతం కూడా ప్రతి నెలా నియమంగా ఇవ్వరు! ఎప్పుడైనా అవసరమై అడిగితే- 'ఇదుగో పంతులూ! ముష్టి రెండురూపాయల కోసం పదే పదే అడగాలా? మాకు తెలీదూ ఆ మాత్రం?' అని కసురుకోవడం కూడా కద్దు! ఏదో వేడి నీళ్లకు చన్నీళ్లు తోడుగావుంటాయని చివరకు టైపిస్టుబోర్డుకూడా తగిలించాడు, ఇంటి ముందర! ఈ విద్య ఎప్పుడో పదేళ్లక్రితం శెలవల్లో ఖాళీగా వుండటం ఎందుకు లెమ్మని నేర్చుకున్న బాపతు! అది ఈనాటికి ఉపయోగపడింది!

మాధవరావు టైపిస్టుగా మారిన తరువాత మొదటగా తగిలిన బేరం ఈ సినిమా వాళ్లదే కాని వీళ్లేమో పనిచేయించుకొని పదిహేను రోజులు గడిచినా డబ్బివ్వక తిప్పి చంపేస్తున్నారు! మాధవరావు సినిమాలు తీసేవాళ్లను లోలోపల తిట్టుకున్నాడు — 'వీళ్లేమో లక్షలు ఖర్చుపెట్టి సినిమాలు తీస్తారు! కాని స్క్రిప్ట్ టైప్ చేసిన టైపిస్టుకు పాతిక రూపాయిలివ్వటానికి అల్లల్లాడతారు!"

మాధవరావు బస్‌లో కూర్చున్న మనుషుల వేపు తేరి పారజూచాడు! వెనక సీట్లో కూర్చున్న చిల్లరపాత్రధారిణీమణులు కాగితపు పూలకుమల్లే కన్పించారు! మధ్య భాగంలో కూర్చున్న ఒకళ్లిద్దరు సినిమాలను గురించి చర్చించుకుంటూ బిగ్గరగా నవ్వుతున్నారు! కండక్టర్ టికెట్లు ఇస్తూ మధ్య మధ్యన స్టాపింగ్ పేర్లు కేకేసి చెబుతున్నాడు! మధ్య సీట్లో కూర్చున్న వ్యక్తులు మాత్రం మాటిమాటికీ నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. మాధవరావుకు ఆశ్చర్యం వేసింది—'వాళ్లకు మల్లే నేనెందుకు నవ్వలేకపోతున్నాను? వాళ్ళు వేసుకున్న గుడ్డల్లాంటివి తన వంటిమీదలేవేం?' ఇట్లాఆలోచించి మాధవరావు తనలాగా ఎవరైనా ఆబస్‌లో వున్నారేమోనని అందరిమీదికీ దృష్టి సారించాడు! చివరకు తన ముందు సీటులో ఇద్దరు యువకులు కూర్చున్నారు! వాళ్లి మొహంలో ఏదో దైన్యం తొంగి చూస్తోంది. వాళ్లిద్దరూ దేనిమీదనో వాదులాడుకుంటున్నారు. మాధవరావు శ్రద్ధగా విన్నాడు—

—'అంతా అయిపోయింది బ్రదర్! జీతంలో ఒక్క కానీ మిగల్లేదు! మళ్ళీ అప్పుకు బయలుదేరాల్సిందే!'

—నాస్థితీ అలాగే వుంది. రాత్రి సరిగా తిండి తినలేదు! ఇవ్వాళ్ళ ఉదయంనుంచి కాఫీ తాగిసెట్టుకొచ్చాను. ఇప్పటిదాకా!"

మాధవరావు వాళ్ళ మాటలు వినలేకపోయాడు! ఒక్క నిమిషంపాటు కళ్లు మూసుకున్నాడు. ఆ తరువాత బయటికి చూడసాగాడు. బయటున్న చెట్లూ-చేమలూ, ఇళ్ళూ-షాపులూ, ఫుట్‌పాత్ మీద నడిచివెళ్లే మనుషులూ గిర్రున తిరిగి వెనక్కు జరిగిపోతున్నారు. ఎన్నో గుర్తు

పట్టడానికి వీలులేని మొహాలు గిరగిరతిరిగి పోతున్నాయి! అకస్మాత్తుగా మాధవరావుకు ఆ మొహాల్లో తనభార్య, కూతురూ కన్పించారు! నిన్నటి ఒక సంఘటనకూడా ఆయన కళ్లెదుట తారట్లాడింది!

—"నాన్నా! ఒక్క కానీవుంటే ఇవ్వవూ? మధ్యాహ్నంపూట అందరూ ఇళ్లదగ్గర్నుంచి ఏదో ఒకటి తెచ్చుకుంటారు, తింటానికి! నేను వేరుశనక్కాయలైనా కొనుక్కుంటా!......ఏం నాన్నా. కానీకూడా లేదూ నీదగ్గర?"

'ఏం? ఒక్కరోజు తినకపోతేనేమిటట? రోజులతరబడి తిండిలేకుండా బతికేవాళ్లు లేరూ? ఆకలయినప్పుడు పొట్టనిండా మంచినీళ్లు తాగు! మీ స్కూల్లో మంచినీళ్ల పంపు లేదూ?'

ఇల్లంతా వెదికి చివరకు మాధవరావు భార్య ఎక్కడో పెట్టె అడుగున దొరికిన అర్థణా తీసుకొచ్చి స్కూలుకు ప్రయాణమై వెళ్ళే ఎనిమిదేళ్ళ కూతురి చేతిలో పెట్టింది......

బస్ టెర్మినస్‌లో ఆగింది! మాధవరావు దిగి నాలుగువేపులా కలియజూశాడు! దగ్గర్లో వున్న టీషాపుకెళ్లి అణా టీ తాగాడు! అర్థణా బెటె సిగరెట్లు కొనుక్కున్నాడు! సిగరెట్ వెలిగించుకుని అట్లా నిల్చున్నాడో లేదో-ఏదో ఒక కారు దుమ్మురేపుకుంటూ వెళ్ళింది! దుమ్ముతోపాటు ఏవో సువాసనలు ఆ చుట్టుపక్కలా వ్యాపించాయి! పక్కగా నిల్చున్న కుర్రాడొకడు......'సినిమా స్టారోయ్' అన్నాడు, ఇంకొకడితో.

అడుగులో అడుగేసుకుంటూ సినిమా కంపెనీవేపు బయలుదేరాడు! ఇంకో పాతికగజాలదూరం ఉందనగా మాధవరావు రెండు చేతులతో తల నున్నగా దిద్దుకున్నాడు! కొంచెం డాబుగా కన్పించకపోతే... గూర్ఖా సైతం లోనికి వెళ్లనీయడు! ఇక లోనికెళ్తే ప్రతి ఒక్కరూ మనిషి తొడుక్కున్న బట్టలవేపే చూస్తారు! అందుకే ఇవాళ ఉన్నవాటిలో మంచిబట్ట తీసుకున్నాడు!

మాధవరావు కొన్ని చిన్ని చిన్ని ఆటంకాల్ని అధిగమించి...ఎట్లాగయితేనేం కంపెనీ అధికారిని కలుసుకొని తను వచ్చిన విషయం తెలియజేశాడు.

'ఓహో! మీరా టైపిస్టుగారూ! టైపింగ్ చార్జి తివ్వాలిగదూ? వచ్చే సోమవారం కన్పించండి, మీకు తెలిసే వుంటుంది-మా యజమాని ఊటీలో వున్నారు! బహుశా ఇంకోవారం నాటికి ఎండలు తగ్గిపోవచ్చనుకుంటాను! ఏమంటారు?...ఎండలు చాలా తీక్షణంగా వున్నాయిగదూ?' అని మాధవరావు సమాధానం చెప్పక మునుపే మళ్ళీ 'సోమవారం కన్పించండి!' అని కుర్చీలో



'గదబ' జాతి యువతి

—ఫొటో: నక్కల మునుస్వామి

నుంచి లేచాడు! మాధవరావు ఏదో చాలా చెప్పాలనుకున్నాడు! కాని నోటి వెంట మాటే రాలేదు. ఈ లోపల ఆ ఉద్యోగి కుర్చీలోనుంచి లేచి నిలబడుతూ వస్తా మరి! కొంచెం పనుంది లోపల!' అని చెప్పి లోనికెళ్ళిపోయాడు. ఆఖరుసారిగా మాధవరావు పెదాలు వణికాయి! అంతే!!

మాధవరావు తడారిన పెదాలు నాలుకతో తడిచేసుకుంటూ దిగులుపడిన మొహంతో బయటికి నడిచాడు! సిగరెట్టు తాగాలనీ, వేడివేడి కాఫీ రుచిచూడాలనీ మాధవరావు మనస్సు మహా గుంజాటన పడింది! ఆ పరిసర ప్రాంతాల్లో పరిచితులెవరైనా ఉన్నారేమోనని మాధవరావు గుర్తుకు తెచ్చుకున్నాడు! కాని ఎవరూ లేరు! రైలుస్టేషన్ దాకా వెళ్తే...అక్కడ పున్నారావనే మిత్రుడున్నాడు! ఈ మైలున్నర దూరం 'పాదయాత్ర' చేయాల్సిందే, ఆ పున్నారావును తలుచుకుంటూ!

మాధవరావు రోడ్డు వెంట బయలుదేరాడు! కాఫీహోటళ్ళూ, సిగరెట్ షాపులూ కన్పించాయి! అటువేపు వెళ్లేబస్ కూడా ఖాళీగా వెళ్తోంది! మనస్సులో రగిలే కోరికల్ని చంపుకున్నాడు! తన దృష్టిని రోడ్డుమీద లగ్నంచేసి నడక ప్రారంభించాడు!

నడిచి నడిచి...మాధవరావు పున్నారావు గదిని దగ్గరించాడు! ఒక్కొక్క అడుగు ముందుకు వేస్తున్నకొద్దీ అతనిలో ఏదో చేయరాని పని చేసేప్పుడు కలిగే భయం వేస్తోంది! 'ఇప్పుడు తను పున్నారావును కలుసుకోవడం దేనికి? అతనితో ఏం పని తనకు? ఏం వెళ్లకపోతే?' అని తర్కించు

కున్నాడు! 'వెళ్తే ఏం?' అన్నదిఅతనిమనస్సు. "ఊరికే ఓ పర్యాయం వెళ్ళి మిత్రుణ్ణి చూచి రావటంలో తప్పే ముంది? తప్పేముంది? ఏమీ లేదు!"

వెనుకంజ వేస్తున్న మాధవరావును అతని మనస్సు ఈ విధంగా ఆదేశించటంతో వేగం కొంచెం పెంచాడు! ఐదునిమిషాల్లో పున్నారావుగది సమీపించాడు!

లోపల అడుగు పెట్టడంతోటే—పరుపు చుట్టుచానుకుని కూర్చున్న పున్నారావు-'ఓహో! నువ్వటోయ్! — డాక్టర్, మాష్టర్, మెపిస్టూ! ఏమిటి విశేషాలు? ఇలా వచ్చావేంటి? ఇంతదూరం,' అన్నాడు!

ఏం రాగూడదా?...అవును గాని ఇంకా ఎన్ని సంవత్సరాలని చదువుతావు! ముసలివాడివయి పోతున్నావు! నీ చదువు చట్టుబండలుగాను — చదువు చాలించి పెళ్లిచేసుకొని హాయిగా ఉండు! నీలాంటి వాడికి ఉద్యోగం రేపిపాటికి రాదూ? పోతే, ఆడపిల్లలకు మనదేశంలో కొదవే లేదు!...ఏమంటావు?...సరే గాని కాఫీ తాగించవోయ్ పున్నారావూ! మర్యాదా—మట్టూ తెలీదేమయ్యా నీకూ?' అన్నాడు మాధవరావు చాపమీద కూర్చుంటూ!

'వచ్చీ రావటంతోటే ఉపన్యాసం మొదలెటితివి! వ్యవధానం ఏదీ?...కాఫీ రెడీగా నేవుంది! నీ అదృష్టం!', పున్నారావు దగ్గర్లోనే వున్న ఫ్లాస్కు మూతతీసి ఒక గ్లాసులో కాఫీ పోసి మాధవరావు ముందుంచాడు.

మాధవరావు తాగేశాడు! ఏదో పిచ్చాపాటీ మాటాడుకున్నారు!

మాధవరావుకు సిగరెట్టు తాగాలనిపించింది.! 'ఏం బ్రదర్! నువ్వు సిగరెట్ బీడి తాగకపోతే తాగే వాళ్ళనైనా ఆదరించవా ఏమిటి?...కాఫీ ఇచ్చిన వాడివి సిగరెట్ ఇవ్వకపోతే ఎలాగు?' అన్నాడు మాధవరావు!

అదెంత భాగ్యం! నేనెళ్ళి తీసుకొస్తా! నువిక్కడే కూర్చుని ఈ పాత పత్రికలు తిరిగేస్తూ ఉండు?" అన్నాడు పున్నారావు చొక్కా తొడుక్కుంటూ!

'అక్కర్లేదులే! ఆ డబ్బులిలాతే! నేనే వెళ్ళి తెచ్చుకుంటాను! నువ్వేదో పాపం చదువుకుంటున్నట్లున్నావు! నీ చదువు భంగం చేయడం నా కిష్టం లేదు.!'

అన్నాడు మాధవరావు లేచి నిల్చుంటూ!

పున్నారావు సరేనని పావలా బిళ్ళ అతని చేతిలో పెట్టాడు.! మాధవరావు మెట్లు దిగి బజార్లో కొచ్చాడు! ఫర్లాంగు దూరంలో వున్న సిగరెట్ దుకాణం దగ్గిరకెళ్ళి...'ఒక సార్ ప్యాకెట్' అని పావలా బిళ్ళ అందివ్వబోతుండగా— అప్పుడే తనకు కావలసిన బస్ వచ్చి పక్కనే నిలబడింది. షాక్ తగిలిన వాడికి మల్లే చెయ్యి వెనక్కు లాక్కుని ఒక్క పరుగున అటువేపుకెళ్ళి బస్‌లో కూర్చున్నాడు!

సిగరెట్ దుకాణమతను వింతగా చూస్తున్నాడు. అంతకంటే వింతగా మాధవరావు తన చేతిలోవున్న పావలాబిళ్ళ వేపు చూశాడు అప్పుడే బస్ కదిలింది. ఆ మరో క్షణంలోనే అతని మనఃఫలకంమీద భార్యా ఎనిమిదేళ్ల కూతురూ కన్పించారు!

బస్ టికెట్ తీసుకొని మాధవరావు మళ్ళీ ఆలోచించసాగాడు — 'తన భార్య ఎంత శాంత స్వభావురాలు! మిన్ను విరిగి మీద పడుతున్నా తొణకదు! ఉన్న దాంతోనే సరిపెడుతుంది! కూతురుకూడా అచ్చంగా తల్లిలాంటిదే! ఇక తనో? చిటికిమాటికి వాళ్లను కోప్పడుతూంటాడు! చేతిలో కానీ లేక పోవటానికి కారణం భార్యా బిడ్డలేనని భావిస్తాడు!...

తను శ్రమిస్తున్న దానికి ప్రతిఫలం లభిస్తే ఎంత బావుండును? అని అనుకున్నాడు, తన స్థితికి కారకులు తనూ, తన భార్యా పిల్లలు కాక, మరెవ్వరో వున్నారని భావించుకొని!

బస్సు పున్నారావుండే పరిసరప్రాంతాన్ని దాటి చాలాదూరం వచ్చేసింది! ఆ తరువాత రెండో స్టాప్‌లోనే మాధవరావు బస్ దిగాడు!

బస్ దిగి ఇంటివేపుకు వెళ్లాల్సిన మాధవరావు మరో బజారు వేపుకు తిరిగి ట్యూషన్ చెప్పాల్సిన బారిష్టరు గారింటికి వెళ్లాడు!

మాధవరావు బారిష్టరు గారి అందమైన బంగళా పోర్టికోలో అడుగు పెట్టినప్పుడే డ్రాయింగ్ రూంలోవున్న గడియారం ఐదు గంటలు కొట్టింది! మొహంమీద కారుతూన్న చెమట తుడుచుకుంటూ వాకిలిదగ్గర నిల్చొని—'సులోచనా!' అని కేకేశాడు! కేక వేసిన మరో క్షణాన సులోచన పరుగెత్తుకుంటూ బయటి కొచ్చింది! ఆ అమ్మాయిది సరీగ్గా మాధవరావు కూతురి వయస్సే! అందుకనే ఆ అమ్మాయంటే మాధవరావుకు ఎంతో ప్రేమ!

"మాష్టరు గారూ! ఇవ్వాళింత తొందరగా వచ్చారేం?...అయినా నా కివ్వాళి పాఠం వద్దూ మాష్టరుగారూ! వైజయంతీమాల డాన్సు ప్రోగ్రాముంది! మీకు తెలీదూ? మీరూ వస్తున్నారా?' అని ఆ పిల్ల అడిగింది అమాయకంగా!

మాధవరావు నవ్వాడు! అది బయటికి నవ్వుగా కన్పిస్తున్నా, నిజానికి అది నవ్వుకాదు, ఏడుపు! ఏడవ లేక నవ్వాడు, అంతే!

"మంచిది వెళ్లిరా అమ్మా! పాఠం ఇవ్వాళ కాకపోతే రేపు చదువుకోవచ్చు! ఇట్లాంటి ప్రోగ్రాములు రోజూ వస్తాయా?...సరే గాని అమ్మాయీ...ఇవ్వాళ్లి ఎన్నో తారీకు!" అడిగాడు మాధవరావు!

"ఏం! అట్లా అడుగుతున్నారు? ఇవ్వాళ్ళ పన్నెండో తారీఖు గాదూ?" అన్నది. ఆ అమ్మాయి నవ్వుతూ!

"అయితే మరి కిందటి నెలజీతం తీసుకున్నావా నాన్నగారి నడిగి?"

"తీసుకున్నానండీ! మా అమ్మ తీసుకొని ఖర్చు చేసింది! అమ్మను రెండు సార్లడిగాను! రెండుసార్లూ—'ఆ పంతులుతో మనం ఊరి విడిచి పారిపోవడం లేదని చెప్పు' అన్నదండి!"

"నిజమే తల్లీ! మీరు వూరువిడిచి వెళ్ళరు! అలా వెళ్ళాల్సింది మేము!...సరే జీతానిదేముందిలే! ఇచ్చినప్పుడే తీసుకుంటాను! రేపొస్తా మరి! వెళ్ళనా?"

వెళ్లిరమ్మంది ఆ అమ్మాయి.

మాధవరావు బారిష్టరు గారి దివ్యమైన బంగళా దాటి బజారున పడ్డాడు! అడుగు తీసి అడుగు వేయటం భారంగా వుంది! ఎట్లాగో నడిచి నాలుగు బజార్లూ కలిసిన ఒక కూడలికి చేరుకున్నాడు. అక్కడ అంతా జనం! అంతటా వెలుతురు! వచ్చే పొయ్యే వాళ్ళను తప్పుకుంటూ వెళ్ళి ఒక పక్కన నిలబడ్డాడు!

అక్కడ ఉడిపి హోటల్ వుంది! లోపల్నుంచి రకరకాల సువాసనలొస్తున్నాయి! అద్దం దగ్గర చాల రకాల స్వీట్స్ పెట్టారు! మాధవరావుకు ఆ స్వీట్సు చూడగానే ఏదో ప్రాణం లేచివచ్చినట్లయింది! డబ్బున్నప్పుడల్లా ఇంటికి స్వీట్సు తీసుకెళ్ళడం అలవాటు! ఈసారి డబ్బొస్తే కనీసం పది రూపాయల స్వీట్లయినా కొనాలి అని నిర్ణయించుకున్నాడు!

ఆ వీధి చివరిదాకా నడిచి వెళ్ళాడు! అక్కడ జనసంచారం తక్కువగా వుంది! గోడ పక్కన కూర్చొని ఒక గుడ్డివాడు—మనుషుల అలికిడి విన్నప్పుడల్లా గొంతెత్తి అడుగుతున్నాడు—"బాబూ ఒక్క కానీ ధర్మం చేయండి!" మాధవరావు అతన్ని సమీపించి చూచాడు. గుడ్డివాడి ముందరున్న గుడ్డమీద ఒక చిల్లికానీ కన్పించలేదు!

అతన్ని దాటి వెళ్ళిపోతూ మాధవరావు "అంతే! ఎర్రని ఏగానీ దొరకదు నీకు! అట్లాగే గొంతు చించుకో! నీ బ్రతుకింతే!" అనుకున్నాడు

మాధవం వు సందుగొందులగుండా ఇంటి వేపుకు బయలుదేరాడు. అప్పుడే పొద్దు కూకుతోంది. అన్ని ఇళ్ళల్లో లైటు వెలుగుతున్నాయి బజారు దీపాలుకూడా అప్పుడే వెలిగాయి మాధవరావు బట్టలు చెమటకు తడిసి ముద్ది ముద్దయ్యాయి. లోపల ఎవరో చేతులు బెటి పేగులు దెవుతున్నట్లుగా వుంది! ఒళ్ళంతా వణుకు వణుకుగా కూడా వుంది! కళ్ళముందర ఏదో చీకటి తెరలుగా లేస్తున్నది

వీధి మలుపుమీద ఒక్క నిమిషం పాటు నిల్చున్నాడు. పక్కనే కార్పొరేషన్‌వాళ్ళ పంపు వుంది! ఆ పంపు పక్కన అంతా తడితడిగా వుంది. అక్కడే ఇద్దరు బయాలజీసు డెంట్సు గాబోలు-నిల్చొని కప్పల్ని గురించి మాట్లాడుకుంటున్నారు! వాళ్ళలో ఒకతను బూటుకాలితో ఒక కప్పను తన్నాడు అది ఎగురుకుంటూ వెళ్ళి పక్కనే వున్న బురదలో తల దాచుకుంది!

ఆ రెండో అతను అంటున్నాడు—"ఈ కప్పల శరీరాల్లో ఆరుమాసాలకు సరిపడనిట్లా కొవ్వు పదార్థమూ తయారవుతాయి, వరాకాలంలో! వేసవికాలం వాటకి చీకూ చింతా లేదు! వీటిమీదనే ఆధారపడి అవి బతుకుతాయి."

"నిజం! నిజం!" అన్నాడు మొదటివాడు.

మాధవరావు వాళ్ళమాటల్ని అతి శ్రద్ధగా విన్నాడు! ఆతరువాత ఇంటవేపుకు బయలుదేరాడు. దారి పొడుగునా మాధవరావు-"నిజంగా మానవుడు కూడా మండూక సంతతికి చెందినవాడైతే ఎంత బావుండేది!" అని మాటిమాటికీ అనుకున్నాడు. ★

నాటిక:

ఆఖరుఘడియల్లో ఆప్తులు

[తెర లేచేసరికి స్టేజి ఖాళీగా వుంటుంది. స్టేజి వెనుక రోగి మూలుగుతూ వున్నట్టుగా శబ్దం వినిపిస్తుంది. బ్రహ్మం ముందు, అతని వెనక శారద స్టేజి పైకి హడావిడిగా వస్తారు.]

బ్రహ్మం: (స్టేజి మధ్య దగ్గర ఆగి భార్యవేపు తిరిగి) ఏవిటలా సంజ్ఞలు చేస్తున్నావు శారదా!

శారద: నా మొహం! ఏవిటని అలా అడక్కపోతే, అసలు మీకు యింగితజ్ఞానం లేదనరాదూ!

బ్రహ్మం: ఆ జ్ఞానమేదో నీకు మహా ఏడ్చిందని — ఇంతకీ అసలు విషయం చెప్పరాదూ?

శారద: నాన్నగారు అలా బాధపడుతూ మూలుగుతూ వుంటే, ఊఁ అనక, ఆఁ అనక, అలా బెల్లంకొట్టిన రాయిలా నిల్చుంటారేం?

బ్రహ్మం: ఆ! అంటున్న మీ అందరికీ మహా యింత జవాబు చెప్తున్నాడని — నేనంటే మాత్రం పలుకుతాడనా? ప్చ్! ఘడియలు దగ్గరపడుతున్నయ్.

శారద: (కోపంగా) బుద్ధిలేకపోతే సరి — ఏమిటా మాటలు? ఈ సమయంలో అనవల్సిన మాటలేనా యివి?

బ్రహ్మం: బాగానే వుంది... నేనన్నది యేం తప్పుమాటని?

శారద: 'తప్పు' అన్న పదం మీ నిఘంటువులోనే లేదు. మీ కెలా తెలుస్తుంది మీ తప్పు? అనాడు అమ్మా నాన్నా నన్ను ఓ పదిరోజులపాటు పంపించమని ఉత్తరం రాసినప్పుడు, ససేమిరా పంపనన్నారు... అప్పుడే అది మీకు తప్పుగా తట్టలేదు.

బ్రహ్మం: పంపక పోవటమేవిటి ఖర్మ!

శారద: ఆ! పంపారు. ఎప్పుడు! మా నాన్నగారు ఉత్తరాల వర్షం కురిపించారు. కాని మీరు వినిపించుకునేవారు కారు. వాళ్ళయినా యింకేం చెయ్యగలరు? నేనంటే అమ్మ, నాన్నకి అపరిమితమైన ముద్దు. చివరికి నాన్నగారే స్వయంగా వచ్చి మిమ్మల్ని వప్పజెప్పి నన్ను తీసుకెళ్ళారు...

బ్రహ్మం: (చిన్నగా నవ్వి) చివరికలా అవుతే నేం పంపించానుగా!

శారద: పంపకేం? ఖర్మ... ఎన్నాళ్ళుంచారు? వారంరోజులు నిండనేలేదు, దక్షా వచ్చి తీసుకుపోయారు యేవో సాకులు చెప్పి.

బ్రహ్మం: సాకులేవిటి? నా భోజన విషయంలో యెన్ని చిక్కులుపడ్డానో నీకేం తెలుసు? అవన్నీ నీ కవసరం లేదులే. ఎంతసేపూ తల్లిదండ్రీ దగ్గర వుంటానంటావంతే. అల్లాంటిదానవు పెళ్ళి మానుకోవల్సింది. మీవాళ్ళ ముద్దూ ముచ్చట కూడా తీరేది (నవ్వుతాడు).

శారద: ఇల్లాంటి మొండివాదనలు మాత్రం చేస్తారు... పోనీ మా యింటికి వచ్చినప్పుడన్నా నాతో సరదాగా వుండేవారూ! అబ్బే... చీటికిమాటికీ తగవే. నాన్న యిదంతా చూసి, మనం అదేవిధంగా యింటిదగ్గరా తగూలు పడతామని వూహించి మరీ బాధపడేవాడు.

బ్రహ్మం: ఏం? నీకెలా తెలుసు? తన వూహాలు చెప్పాడా నీతో?

శారద: ఓమారు నన్ను నిలదీసి అడిగారండి...'ఏవమ్మాయ్-మీ ఆయనా నువ్వూ మీ యింట్లోనయినా సరిగా మాట్లాడుకుంటుంటారా? లేక తగువులు పడుతోంటారా'...అని.

బ్రహ్మం: మరి, నువ్వేం చెప్పావవుతే?

శారద: ఏం చెప్తాను...బాగానే మాట్లాడుకుంటామని చెప్పాను. అయినా మా నాన్న నమ్మాడని నమ్మకం లేదు. మనలా పెద్దవాళ్ళు మనసులో పొంచివున్న వాటి విషయమై బాహాటంగా అనేయరుగాని, లోలోన బాధపడుతుంటారు.

బ్రహ్మం: (విసుగుతో) ఏవిటో నీసోద నాకేం తలకెక్కకుండా వుంది.

శారద: ఔనుమరి- నా సోద మీకిప్పుడేలా తలకెక్కుతుంది?

బ్రహ్మం: అన్నట్టు, మర్చిపోయాను. మీ నాన్న వీలునామా రాశారా లేదా?

శారద: ఏమో తెలదూ?

బ్రహ్మం: బావుంది నీ వరస. ఏమో నంటావేవిటి శారదా! చాల తేలిగ్గా అనేశావే...మరి, నీవంతు నీకు రావద్దూ?

శారద: నావంతు యేముందండీ! అంతా మా అన్నయ్యకే దక్కుతుంది గాని...

బ్రహ్మం: అవి పూర్వపు రోజులు శారదా? ఇప్పుడు మీ నాన్నగారి ఆస్తిపై నీకూ కొంత హక్కుంది. అయినా నువ్వంటే మీ నాన్నగారికి యెంతో అభిమానం అంటావుగదా, ఆ అభిమానం యీ విషయంలో వుండొద్దా, యేవిటి? కనీసం నీకో రెండు యెకరాల మాగాణీ అయినా యిమ్మను.

శారద: ఈ సమయంలో మనం యేమని చెప్తామండీ?

బ్రహ్మం: ఇప్పుడు చెప్పకపోతే, మీ నాన్న ఆ రెండుకళ్ళూ గుటుక్కున మూసేస్తే యింక చెప్పగలమా? (నాలుక కరుచుకుంటాడు).

శారద: (కోపంతో) ఏవిటండీ ఆ అపసవ్యపు మాటలు? మా నాన్నగారు పోవటమే మీకు బాగులావుంది చూస్తుంటే.

బ్రహ్మం: అబ్బే? అదేనన్న మాట — మీ నాన్న పోయినందువల్ల ఒరిగేలాభం నాకేం లేదుగా, అలా కోరుకునేందుకు... ఆ లాభం నీకూ, మీ అన్నయ్యకే. ఆయన బ్రతికుంటేనే నాకు నయం. ప్రతిపండక్కీ — యాభైకి తక్కువకాకుండా కట్నం పుచ్చుకునేవాణ్ణి

శారద: ఇలాంటి వాటికి మాత్రం తయారు. ఒక్కనాడయినా యాభైకి తక్కువ పుచ్చుకున్నారా? ముక్కుపిండి మరీ తీసుకునేవారు. మా నాన్న గాబట్టి, నా మీదుండే అభిమానంవల్ల మీ మనసుకి కష్టం కలక్కుండా మీ తృప్తికోసం యిచ్చేసేవారు. మరింకెవరైనా అవుతే...

బ్రహ్మం: (దగ్గర అందుకుని) అనంతా యిప్పుడెందుకు శారదా? నేనేమిటంటున్నాను నువ్వు చెప్తున్నదేవిటి? వీలునామా విషయం మీ అమ్మ నెరిగేవయినా వుంటారు. అంతా మీ అన్నయ్య నేతిలో పండించంటే. మనకి...అబ్బే కాదు- నీకు ఒక్క చిల్లిగవ్వయినా దక్కదు.

శారద: నాకు దక్కదనే బదులు మీకు దక్కదనండి నా పేరుపెట్టి మీరు ఆర్జించా

ముద్దంశెట్టి హనుమంతరావు

లను కుంటున్నారు. అయినా, యీ పరిస్థితిలో వీలునామా విషయం యెత్తటం యెవరన్నా విన్నారంటే నవ్వి పోతారండీ! మనల్నే నాలుగు ఆడిపోస్తారు.

బ్రహ్మం: పోనిద్దూ! ఆడిపోస్తే యేంపోయింది? దూషణ భూషణములు శరీరానివేగాని, ఆత్మవి కావన్నారు పెద్దలు. ఎవరేమనుకొన్నా మనకి నష్టం లేదు. కావల్సింది డబ్బు...మీ అమ్మతో చెప్తా...కావాలంటే యిప్పుడే నిమిషాలమీద ప్లీడర్ని తీసుకొస్తాను. [కుడి వేపు నుండి రఘురామ్ ప్రవేశిస్తాడు. అతని చేతిలో చిన్న లెదర్ సూటుకేసు వుంటుంది మనిషి మంచి దుస్తులు వేసుకుని నాజూగ్గా వుంటాడు.]

రఘు: (వస్తూ) ఏమిటి బావా! ప్లీడర్ని తీసుకొస్తానంటున్నావు...ఎందు కేమిటి?

బ్రహ్మం: (నిర్ఘాంతపోయి-తడబడుతూ) అబ్బే! అబ్బే! ఏమీ లేదు. ప్లీడర్ని అన్నానా! మాట తడబడిందంటే! డాక్టర్ని అనబోయి ప్లీడర్ని అన్నాను...మరింకేమీ లేదులే...ఆఁ...యిదే రావటమా?

రఘు: ఔను బావా! యిదే రావటం..., అవుతే మీ రెప్పుడొచ్చారు?

శారద: మేమూ యీవాళే వచ్చామన్నయ్యా! నువ్వు ఒంటరిగా వచ్చావేం? వదినేదీ?

రఘు: ఇద్దరం కలిసే వచ్చాం చెల్లీ! తనూ నే వాళ్ళింటికి వెళ్ళింది, ఇక్కడికి రావడానికి ధైర్యం చాలక. ఆఁ...నాన్నకి యెలా వుందిప్పుడు.

[స్టేజి వెనకనుండి మూలుగు విన్పిస్తుంది]

శారద: అదిగో, మూలుగు వినిపించడం లేదూ! ఎంత బాధపడిపోతున్నాడో! ఏమిటో అన్నయ్యా! నాన్నకి ముఖ్యంగా నీ గురించే ఆలోచనలు పట్టుకుని అలాక్రుంగదీశాయి.

రఘు: నా గురించా! యెందుకు?

శారద: కాదూ మరి-నాన్న యెంత వద్దంటున్నా, వినిపించుకోక సుజాతని రిజిష్టరు పెళ్లి చేసుకున్నావు. అంతటితో సరిపోయిందా? నాన్నతో సంబంధం తెంచుకుని, పరాయివూర్లో వుద్యోగం వెలగబెడుతూ పెళ్ళాంతో కొత్త కాపురం పెట్టావు ఏ తండ్రికయినా యెలా వుంటుంది చెప్పు? ఎప్పుడూ అదే ఆలోచన...అదే బాధ! నువ్వు తనమాట ఖాతరు చేశావు కాదనే విచారం...ఆ విచారంతోనే దిగజారిపోయాడు.

[బ్రహ్మం భార్య వేపు అదోలా చూస్తాడు]

రఘు: ఏదో యిదొక సాకు దొరికింది గాని, అసలు నాన్న ఆరోగ్యం యేమంత మంచిది కాదులే చెల్లీ. అయినా, నా పెళ్లి విషయంలో నాన్న కల్పించుకోవటం నాకేం నచ్చలేదు. ఎవరికి నచ్చినవాళ్లని వాళ్లు పెళ్ళి చేసుకుంటారు. మధ్య యీ పెద్దవాళ్ల ప్రమేయ మేమిటో నాకు అర్థం కాకుండా వుంది. సుజాత నాకు నచ్చింది. నే నామెకి నచ్చాను మా యిద్దరి మనసులు కలిశాయి ఒకరితో మాకు పనిలేదన్నట్టుగా పెళ్ళి జరుపుకున్నాం. ఎలాగైనా నాన్నది మంకుపట్టు లెద్దూ! అన్నట్టు డాక్టరు వచ్చాడా?

శారద: ఇప్పుడే వచ్చివెళ్లాడు. ఏదో యింజక్షను తెస్తాడుట...ఇప్పుడే వస్తానన్నాడు.

రఘు: సరే! నేను లోపలికి వెళ్తానండి [యెడమవేపు నుండి నిష్క్రమిస్తాడు]

బ్రహ్మం: ఇంతవరకూ మీ నాన్నగారు మంచం పట్టడానికి నేనే కారణమన్నావు, మరిప్పుడు మీ అన్నయ్యే కారణమని అంటున్నా వేమిటి శారదా?

శారద: మీలో యే ఒక్కరూ ప్రత్యేకించి కారకులు కారండీ! మీ యిద్దరి విషయాల పర్యవసానమే నాన్నగారి అనారోగ్యం...ఔనుగానీ, నా దగ్గర అన్ని కబుర్లు చెప్పారు వీలునామా గురించి-మరి మా అన్నయ్య వచ్చి అడిగితే యెందు కలా తడబడ్డారు?

బ్రహ్మం: (చిన్న బుచ్చుకొని) ఏమో, యేమనుకుంటాడోనని!

శారద: ఆ భయం నాకూ వుందని మీరు యెందుకనుకోరు?

బ్రహ్మం: బావుంది-నువ్వు అనడానికీ, నేను అనడానికీ వ్యత్యాసం లేదూ! నాకేం! నేను చెప్పిన సలహా పాటించావా, బాగుపడతావు. లేదూ, చేతులారా, వస్తున్న లక్ష్మిని పోగొట్టుకుంటావన్నమాట

(బూట్ల చప్పుడు వినిపిస్తుంది)

బ్రహ్మం: ఎవరో వస్తున్నట్టుంది.

శారద: డాక్టరు వస్తున్నాడేమో!

బ్రహ్మం: అదిగో! డాక్టరే....(గట్టిగా) నమస్తే డాక్టరుగారూ! రండి, రండి.

[కుడివేపునుండి డాక్టరు ప్రవేశిస్తాడు శారద పక్కకి తప్పుకుంటుంది బ్రహ్మం డాక్టర్ని లోపలికి తీసుకుపోతాడు కొంత నిమిషాలు శారద ఒంటరిగా యిటూ అటూ పచారుచేస్తుంది. యెడమవేపునుండి శారద తల్లి సుందరమ్మ వస్తుంది.]

శారద: (తల్లి వేపు ఆపేక్షతో చూచి) నాన్న యేమన్నా మాట్లాడారా అమ్మా?

సుంద: (గద్గదకంఠంతో) లేదమ్మా! కళ్లు తెరిచి అలా చూస్తమే తిప్పించి, అసలు, నోరు కదపటం లేదు. అంతా నా దురదృష్టం తల్లీ!

శారద: అలా బాధపడి, నిరుత్సాహ పడిపోతే యేం లాభం లేదమ్మా. అన్నయ్య వచ్చాడు చూశావా?

సుంద: (కటువుగా) ఆ! చూశాను. వాడి మూలంగానే మీ నాన్నకి యింతగా ముంచుకొచ్చింది. ఒక దిక్కుమాలిన దాన్ని వూరూ పేరూ లేని దాన్ని పెళ్లి చేసుకున్నా నేడగా మీ నాన్న బాగ! వద్దని చెప్తే, విన్నాడా? ఆ దిగులుతోనే మంచం పట్టారు. (ఏడుస్తుంది.)

శారద: ఈ వయస్సులో నాన్నకి యిన్ని సమస్యలు పట్టుకోటం యేమీ బాగుండటం లేదు.


సుంద: నీపాటి జ్ఞానం వాడికుంటే బావుణ్ణు శారదా! వాడికేంతోస్తే అదిగాని పెద్దవాళ్లు, ముసలివాళ్లు వాడి మంచికోసమే చెప్తున్నారుగదా అన్న విచక్షణ లేదు.

శారద: ఒకందుకు, నాన్న చాల సహనం గల మనిషమ్మా!


సుంద: మెల్లిగా అంటున్నావు...(కళ్లు తుడుచుకుంటూ) పాపిష్టిదాన్ని-నేను యెప్పుడన్నా చిరాగ్గా వుంటే యేమేమో అనేసేదాన్ని అలా విని వూరుకునేవారే గాని, పల్లెత్తుమాట అనేవారు కాదు. ఎంత మంచి మనిషి! ఎంత నిర్మలమైన హృదయం! నేనంటే యెంతో అభిమానం...ఆ భగవంతు డిప్పుడేమన్నా వంకరగా చూశాడా నా బ్రతుకు అర్ధాన్నమైపోతుంది. (వెక్కి వెక్కి యేడుస్తుంది).


శారద: (విచారంగా) అధైర్యపడకమ్మా!

(44 వ పేజీ తరువాయి)




భారతరాజధాని దృశ్యాలు: పార్లమెం





ంభవనం; రాష్ట్రపతి భవనం వెలుపలి దృశ్యం, లోపలి దృశ్యం.





సాహిణీవారి "పెంకిపెళ్లాం" చిత్రంలో కీ. శే. జోగారావు, రమణారెడ్డి.

ఈడేరిన తుది కోరిక

నెల్లాళ్ళ క్రితం ఒకరోజు సాయంకాలం కీ॥ శే॥ జోగారావుభార్య, 'విజయ' అధిపతి శ్రీ నాగిరెడ్డిగారి ఇంటికి వెళ్ళింది.

"ఏమమ్మా ఇలా వచ్చావు? జోగారావు కులాసాగా వున్నాడా?" అన్నారు నాగిరెడ్డిగారు వాత్సల్యంతో.

"కులాసాగానే ఉన్నారండి" అందామె.

ఆమె వెంట తోడు వచ్చిన నటుడు శ్రీ వల్లూరి విశ్వనాథం, జోగారావు తుది కోరిక వివరించాడు...

కొద్దిరోజుల క్రితంనుండీ జోగారావుకు వంట్లో బాగుండటంలేదు. క్షయ ప్రకోపించి నట్లు కూడా తెలిసింది. గ్లాండ్స్ వాస్తున్నాయని ఎక్స్‌రే థెరపీ చికిత్స చేయించుకుంటున్నాడు.

దానాదీనా జోగారావుకు ఆరోగ్యంతో పాటు, స్వతస్సిద్ధమైన ధైర్యం కూడా క్రమంగా సడలి సన్నగిలజొచ్చింది.

"ఇంక ఆట్టే రోజులు వుండనేమో..." అంటూండే వాడట ఆప్తమిత్రులతో.

ఈ తరహా ఆలోచనలు ఆర్నెల్లనాటే కలగడం ప్రారంభించాయి కాబోలు, క్రితంసారి స్వగ్రామం వెళ్ళినపుడు ఉన్న కొద్దిపాటి ఆస్తిపాస్తుల వ్యవహారాలూ చూచుకొని, విలు రాసి రిజిస్టరు చేయించుకున్నాడు అని జోగారావు సన్నిహితులు చెప్పారు. జోగారావుకు పిల్లలు లేరు. ఒక కుర్రవాణ్ణి పెంచుకుంటూ వచ్చాడు.

నానాటికీ తీసికట్టుగా ఉన్న ఆరోగ్యం వల్ల జోగారావు కొత్త చిత్రాలలో వేషాలు తీసుకోవడానికి వెనుకాడుతూవచ్చాడట. రెండుమూడు చిత్రాలలో ఈమధ్య మంచి భూమికలు ఇస్తామంటూ ఆయా నిర్మాతలు అడిగినపుడు జోగారావు, "మన్నించండి ఇప్పుడు తీసుకోలేను" అన్నాడు.

అక్టోబరు తరవాత రోజులు బాగుంటాయని, ఆ నెల దాటితే, అపుడు తానే వచ్చి అడుగుతాడనీ చెప్పాడట.



శంకర్ ముఖర్జి చిత్రం "బారిష్"లో నూతనే.



ప్రభా ప్రొడక్షన్సు వారి "ఆడపెత్తనం"లో అమ్మాజీ, బాలకృష్ణ.

★ ఈడేరిన తుదికోరిక ★

నాడూ....

ఉత్సాహంతో ఆశతో, నమ్మకంతో వచ్చే వారికి 'చిరాకులు' స్వాగతం చెప్పటం, కష్టాలు ఎదురై వేధించడం అనుకోని సినిమా పరిశ్రమలోకి జోగారావు ధైర్యంగా ప్రవేశించి, వాటిని ఎదుర్కొని, తట్టుకుని, నిగ్రహించుకొచ్చాడు. విజయవారి "షావుకారు" అతని తొలిచిత్రం. ఆ తరువాత, నాగిరెడ్డిగారు, జోగారావు ప్రతిభను గుర్తించి, అతణ్ణి పెర్మనెంట్ ఆర్టిస్ట్‌గా బుక్ చేశారు.

పరిమిలా జోగారావు పాతాళభైరవి, చంద్రహారం చిత్రాలలో నటించి మంచి పేరు గడించుకొన్నాడు.

ఆ పైన 'ప్రతిభా' కృష్ణమూర్తి జోగారావుకు "రేచుక్క"లో ఒక భూమిక ఇచ్చారు. 'ప్రతిభా' వారు ఈ మధ్య నిర్మించిన "ఏది నిజం?" చిత్రంలో 'తిరుపతి' పాత్ర జోగారావుకు మంచి పేరు తెచ్చిపెట్టింది.

..నేడూ

మరణకాలం నాటికి జోగరావు నాలుగు చిత్రాలలో పని చేస్తున్నాడు. మరో రెండు మూడు అవకాశాలు వచ్చినా వదులుకోవటం కూడా జరిగింది.

'ఉన్న నాలుగు పూర్తి చేయలేనేమో' అని జోగారావు ఆందోళన వెలిబుచ్చుతూ ఉండటం మిత్రులూ, ఆప్తులు అనేకసార్లు గమనించారు.

"నీకేం మతిపోయిందా?" అని మందలించారు.

"నిక్షేపంలా బతుకుతావు నువ్వేం పరవా లేదు పిచ్చిపిచ్చి ఊహాలు పెట్టుకోకు" అని ధైర్యం చెప్పారు.

"మీకు తెలీదులెండి" అంటూ వచ్చాడట జోగారావు

వాహినీవారి "పెంకి పెళ్ళాం" చిత్రంలో అతనికి మంచి భూమిక ఉంది. అందులో అతడు పాల్గొనే భాగాలు చాలవరకు పూర్తి అయిపోయాయి.

మిగతా కాస్తా త్వరగా పూర్తిచేసేస్తే బాగుంటుందని మథనపడినాడు.

వాహినీలో రద్దీవల్ల, వాహినీవారు సెట్ వేసుకోవడానికి అప్పటికింకా వీలు కలగలేదు.

"ఆ కాస్తా పూర్తి అయిపోతే, నేను పాల్గొన్న చిత్రం అంటూ మరొకటయినా ఉంటుం"దని సాగాడట జోగారావు.

చివరకు ఒక రోజున, జోగారావు భార్య

నాగిరెడ్డిగారి ఇంటికి బయల్దేరివెళ్లి పరిస్థితి చెప్పారుకుంది.

అంతిమ నిశ్వాసం

నాగిరెడ్డిగారికి జోగారావుఅంటే చాలా అభిమానం. కథఅంతా వినగానే, "సరే రేపు సెట్ వేసుకోడానికి ఒక ఫ్లోర్ ఖాళీ చేయిస్తాను" అని మాట ఇచ్చారు.

మర్నాటి రాత్రికల్లా సాహిణీ పిక్చర్స్ నిర్మాత శ్రీ డి. బి. నారాయణ సెట్ వేయించి, యూనిట్‌ను సిదం చేయించారు.

జోగారావు ఎంతో ఉత్సాహంతో, వచ్చాడు. చకచక పని సాగిపోయింది.

ఆ రోజు కాల్‌షీట్ పూర్తికాగానే అమ్మయ్యా అని గుండెలమీద రాయి తొలగినట్లు, సంతృప్తిగా నిశ్వసించాడు. సెట్‌మీద అది అతడి ఆఖరు నిశ్వాసం. పది రోజుల తరువాత జనరల్ ఆస్పత్రిలో ఉదయం 9-30 గంటలకు ఆఖరు సారిగా నిశ్వసించాడు.

సెట్‌మీద పని అయిపోగానే, "ఇప్పుడు నన్ను ఆస్పత్రిలో చేర్పండి" అని అతనే అడిగాడట నిర్మాత శ్రీ డి. బి. నారాయణ, డాక్టరు సలహాపై వెంటనే జనరల్ ఆస్పత్రికి తీసుకువెళ్ళారు. వారం రోజులుకన్న బతికితే 'ఘనమే' అన్నారు వైద్యులు.

ఆరోగ్యంతో, పాటు పట్టుదల సడలిన సన్నగిలిన జోగారావు 'ఆ ఘనత' సాధించ లేక పోయాడు. ★


★ సినిమా వార్తలు ★

ఆర్. ఆర్. పిక్చర్స్‌వారి "కార్తవరాయని కథ" తెలుగు తమిళ భాషలలో తయారవుతోంది. ఈ చిత్రానికి శ్రీ రామన్న దర్శకుడు శ్రీ టి. ఎన్. మూర్తి సహ దర్శకుడు. తెలుగు చిత్రంలో ఎన్. టి. రామారావు, బి. ఎస్. సరోజ కన్నాంబ, గిరిజ, సురభి బాలసరస్వతి, ముక్కాముల, రమణారెడ్డి, బాలకృష్ణ, పద్మనాభం, కె. వి. ఎస్. శర్మ, ఆర్. వి. కృష్ణారావు, మొదలగువారు నటిస్తున్నారు. శ్రీ ముద్దిపట్ల సూరి సంభాషణలూ శ్రీ దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి పాటలూ వ్రాశారు. సంగీతం శ్రీ జి. రామనాథన్. స్టుడియో వాహిని.

* * *

వాహినీలో తయారవుతున్న మరో చిత్రం అన్నపూర్ణా పిక్చర్స్‌వారి "తోడికోడళ్లు" గతమాసం వీరి యూనిట్ నెలముప్ఫైరోజులూ హుటాహుటిగా పని చేసింది. ముఖ్యంగా "కాంబినేషన్ ప్రోగ్రాం" వేసుకున్న రోజున ఈ చిత్రం సెట్ సరంభం నిండిపోతుంది. తెలుగు చిత్రం ప్రధాన వేషధారులూ, తమిళ వర్షన్‌లో వారికి ఉజ్జీలూ, ఒక్కసారి కలసుకొంటూరు. కులాసాగా కబుర్లు చెబుతూనే టైమూ, ముడిఫిలిం గుబారా కాకుండా పని తెమిల్చేటట్లు చేసే చాతుర్యం దర్శకుడు శ్రీ ఆదుర్తి సుబ్బారావుకు ఉంది.

శరత్ నవల నిష్కృతి ఈ చిత్రానికి ఆధారం. తెలుగు చిత్రానికి ఆత్రేయమాటలూ కొసరాజు పాటలు వ్రాశారు. తోడికోడ



'ఫన్‌టూష్'లో దేవానంద్ శీలారామాని.

సినిమా వార్తలు

[illegible]లో పెద్దామె కన్నాంబ, రెండో ఆవిడ సూర్యకాంతం. చిన్నకోడలు సావిత్రి. రంగారావు, రేలంగి, నాగేశ్వరరావు తోడల్లుళ్లు. జగ్గయ్య ఇందులో మంచి హుషారైన భూమిక నిర్వహిస్తున్నాడు.

"రూడీ" డెబ్యూ

"తోడికోడళ్లు" చిత్రంలో "రూడీ" అనే కుక్క తొలిసారిగా కనబడబోతోంది. మంచి శిక్షణ పొందిన "రూడీ" మదనపల్లె నుంచి వచ్చింది. "రూడీ"కి చాలా విద్యలు వచ్చును. షేక్ హాండ్ ఇవ్వడంవంటి సామాన్యపు తమాషాల దగ్గిర్నుంచి సందాకి మనుషుల్ని డబాయించి పరాచి కొలాహడం వరకూ రకరకాల 'ట్రిక్కు'లు తెలుసు. ఈమధ్య రూడీ ఉన్న సన్నివేశాలు కొన్ని చిత్రించారు.

వేసుకున్న కార్యక్రమం అనుకున్న ప్రకారం జరిగిపోతే, నవంబరులో తెలుగు తమిళ చిత్రాలు రెండింటినీ విడుదల చేయాలనుకుంటున్నామని ఈ చిత్రనిర్మాత శ్రీ మధుసూదనరావు చెప్పారు.

'స్వయంప్రభ'

శిల్పకోటి పిక్చర్స్ వారి "స్వయంప్రభ" శ్రీ శోభనాద్రి దర్శకత్వాన రేవతీ స్టూడియోలో తయారవుతోంది. రచన సముద్రాల. శ్రీ రమేష్ నాయుడు ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. ఈయన లోగడ కిశోర్ సాహు నిర్మించిన "హామ్లెట్"కు సంగీతం కూర్చారు. దరిమిలా ఒకరిద్దరు నిర్మాతల పిలుపు పురస్కరించుకొని మద్రాసు రావడం జరిగింది. ఈ చిత్రనిర్మాణానికి శ్రీ యోగానంద్ పర్యవేక్షణ చేస్తున్నారు.

నందివారి కొత్త చిత్రం

[illegible], [illegible] వంటి తెలుగు చిత్రాలు, విశ్వామిత్ర, వైరమాలై ప్రభృతి తమిళ చిత్రాలూ తీసిన దర్శకుడు శ్రీ జగన్నాథ్, నంది పిక్చర్స్ వారి తరువాతి చిత్రం "కృష్ణగారడీ" దర్శకత్వం స్వీకరించారు. ఇతఃపూర్వం ఈ సంస్థ "లవకుశ" నిర్మించాలనుకున్నారు గాని, ప్రస్తుతానికి అది వాయిదా వేసి, సుందర ఈ చిత్ర నిర్మాణానికి పూనుకొన్నారు. రచన శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి.

శ్రీ జగన్నాథ్ ప్రస్తుతం "[illegible]" అనే తమిళ చిత్రాన్ని తెలుగులోకి డబ్ చేయిస్తున్నారు.

* * *

శ్రీ కమలాకర కొత్త చిత్రం

"చంద్రహారం" దర్శకుడు శ్రీ కమలాకర కామేశ్వరరావు గారిని 'విజయా' సంస్థ తిరిగి ఆహ్వానించారని తెలుస్తోంది. కామేశ్వరరావు గారు ప్రస్తుతం సాహిణీ వారి "పెంకి పెళ్లాం" చిత్రానికి ఇవతలే సెలవు తీసుకొన్న సారథీ ప్రొడక్షన్స్ వారి "సతీ తులసి"కి దర్శకత్వం నిర్వహిస్తున్నారు. ఇప్పుడు, విజయావారు నేషనల్ ఆర్టు థియేటర్స్ కలిసి నిర్మించబోయే చిత్రానికి దర్శకత్వం వహించవలసిందిగా ఈయనను కోరడం జరిగినట్లు తెలిసింది.

* * *

నటుడు ముక్కామల కృష్ణమూర్తి ఇప్పుడు ఆరు చిత్రాలలో ప్రముఖ భూమికలు నిర్వహిస్తున్నారు. వాటిలో ఎ.వి.ఎం. వారి "శ్రీ గౌరీ మహాత్మ్యం" పూర్తిఅయింది. మిగతావి ఆర్. ఆర్. పిక్చర్స్ వారి "కాత్రవరాయని కథ", శిల్పకోటి పిక్చర్స్ వారి "స్వయంప్రభ", మినర్వావారి "సారంగధర", విజయావారి "మాయాబజార్", 'నీతిపతి' అనే తమిళ చిత్రం ఆధారంగా తయారవుతున్న "అన్నతమ్ములు".

"మాయాబజార్"లో ముక్కామల, దుర్యోధనుడి భూమిక నిర్వహిస్తున్నారు.

* * *

ఎ. వి. ఎం వారు నిర్మించనున్న హిందీ చిత్రం "మిస్ మేరీ" (మిస్సమ్మ)లో మీనాకుమారినీ, జెమినీ గణేశన్‌ను బుక్ చేశారు. ఈ చిత్రానికి శ్రీ ఎల్.వి. ప్రసాద్ గారే దర్శకత్వం నిర్వహిస్తారు.

* * *

ఘనసాయి ఫిలింస్ వారి "బలే బావ" శ్రీ రజనీకాంత్ దర్శకత్వాన నిర్మించబడుతోంది. ఈ చిత్రంలో జానకి, గిరిజ, రేలంగి, సి. ఎస్. ఆర్., గుమ్మడి పాల్గొంటున్నారు. ఈ చిత్ర నిర్మాత శ్రీ టి. రంగయ్య. ★

****

వన్ సెంట్

****

రాజ్ కపూర్ నిర్మించిన "బూట్ పాలిష్" చిత్రం లాస్ ఏంజెల్స్‌లోని వేగబాండ్ థియేటర్‌లో "వన్ సెంట్" అనే పేరుతో విడుదల అయింది.

అక్కడి పత్రికలన్నీ కూడా ఈ చిత్రాన్ని సాంకేతికంగా అది అందుకొన్న ప్రమాణాలనూ, నటీనటుల కృషినీ ప్రశంసించాయి. ముఖ్యంగా బేబీ నాజ్ సర్వత్రా అభినందన పాత్రురాలైంది. ప్రకాశ్ అరోరా ఈ చిత్రానికి దర్శకుడు.

17 వేల అడుగుల పైచిలుకు పొడుగున్న ఈ హిందీ చిత్రాన్ని ఎనిమిది వేల అడుగులకు కుదించి, ఇంగ్లీషు సబ్ టైటిల్స్ అమర్చి విడుదల చేశారు. ★

తలత్ పాడిన తెలుగు పాటలు

ప్రముఖ హిందీ ప్లేబాక్ గాయకుడు తలత్ మహమూద్ మొదటిసారిగా ఒక తెలుగు చిత్రంలో తెలుగు పాటలు పాడుతున్నాడు. ఈ నెల 5వ తేదీన ఆయన మద్రాసులో పాటకచేరీ చేశారు. ఆయన్ని భాస్కర్ ప్రొడక్షన్స్ వారు తాము తీయబోయే నాలుగవ చిత్రంలో పాటలు పాడడానికి బుక్ చేశారు. తెలుగుభాష బొత్తిగా రాకపోయినా ఆయన అత్యుత్సాహంతో సాధన చేసి, ఒక్క రోజులోనే తెలుగు ఉచ్చారణ చక్కగా నేర్చుకున్నారు. మొన్న 10, 11, 12 తేదీలలో వీరి పాటలు వాహినీ స్టూడియోలో రికార్డు చేయబడినవి. సంగీత దర్శకుడు శ్రీ రమేష్ నాయుడు. తలత్ పాడిన తెలుగు పాటల్లో ఉచ్చారణ తెలుగువాడే పాడుతున్నాడని భ్రమకలిగించేటంత స్పష్టంగా, చక్కగా ఉన్నది. ఆ చిత్రంలో పాటలు, సంభాషణలు సముద్రాల జూనియర్ వ్రాశారు. తలత్ పాడిన పాటలు (1) అనురాగము లేనే లేదులే (2) గతిలేనివాణ్ణి గుడ్డివాణ్ణి బాబయా (3) మరచిపోయేవేమో, మాయని బాసలు మనకివే ఓ సఖి (సుశీల తలత్ డ్యూయెట్) (4) అందాల సీమా సుధా నిలయం, ఈ లోకమే దివ్యప్రేమమయం, అనేవి.

కొత్తగా తెలుగు సంగీత దర్శకుల శ్రేణిలో చేరిన శ్రీ రమేశ్ నాయుడు యువకులు; ఇదివరలో బొంబాయి సినిమారంగంలో పనిచేసినవారు. ఈయన భాస్కర్ వారి నాలుగో చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. వీరి సంగీత పద్ధతిలో బొంబాయి

ప్రభావం బాగా కనిపిస్తుంది. అది తెలుగు శ్రోతల చెవులకు కొత్తచవులు చేకూర్చగలదు. సులభంగా ప్రజారంజనం చేయగల వీరి బాణీలు, చక్కని ఆర్కెస్ట్రా సంగీతం వీరికి అచిర కాలంలో తెలుగు సినిమా రంగంలో ఖ్యాతిఆర్జిస్తాయనిఆశించవచ్చును. వీరు సెల్వకోట పిక్చర్స్‌వారి "స్వయంప్రభ"కు కూడా సంగీతదర్శకత్వం వహిస్తున్నారు.

'ఐ విల్ క్రై టుమారో'

ఏమైనా ఎంతగా పొర్లుకొచ్చినా, అప్పటికి ఎలాగో తమాయించుకొని, మర్నాటికి వాయిదా వెయ్యడం చాలా మంచిది. మనుషుల మనుగడకు చాలా అవసరం. అలా వాయిదా వేస్తే, మర్నాడు అసలు ఏడవవలసిన అగత్యమే తప్పిపోవచ్చు.

కొండంత కష్టాలు, (వాటంతటవి వచ్చిపడేవీ, చేతులారా తెచ్చిపెట్టుకున్నవీ కూడా) వచ్చినా, గుండె నిబ్బరంతో ఎదుర్కొని, 'రేపు' బావుంటుందన్న నమ్మకంతో ఆశతో మానవ ప్రయత్నం చేయమనే ఈ ప్రబోధాన్ని ఎం. జి. ఎం. వారి చిత్రం "ఐ విల్ క్రై టుమారో"లో మనసుకు హత్తుకుపోయేలా చిత్రించారు. లిలియన్ రాత్ అనే గాయని జీవితం ఈ చిత్రానికి ఇతివృత్తం. జరిగిన కథ కాబట్టి, ఈ ప్రబోధానికి మరింత విలువ. లిలియన్ రాత్ మంచి పేరు గడించుకున్న రోజుల్లోనే, మానసిక వ్యథలవల్ల మద్యపానానికి బానిస అయిపోయింది. మానుకోవడం ఆమెవల్ల కాలేదు. బ్రతుకు దుర్భరమైపోతుంది. అయితే, మద్యపానం మానుకోవడం మానవసాధ్యమే కాబట్టి, మొత్తానికి అలవాటు తప్పించుకు బయటపడగలుగుతుంది.

"మనిషికి అసాధ్యం అని ఖరారుగా తేలని ఏ కార్యాన్నీ దేవుడికి వదలకూడదు మనిషే సాధించాలి, సాధించగలడు." ఇది శ్రోత్రిగా పుస్తకాలలో చదువుకునే పాతనీతిలా కనబడ్డా, ఈ చిత్రంలోమాత్రం, ఈ నీతిని నిజమేనన్న విషయాన్ని గట్టిగా నిరూపించారు.

లిలియన్ రాత్ గా సూజన్ హేవర్డ్, ఆమెను అతి కట్టుదిట్టంగా పెంచి పైకి తీసుకువచ్చిన తల్లిగా జో వాన్ ఫ్లీట్ నటించారు ★



ఇటీవల విడుదల అయిన పౌరాణిక చిత్రం "మహాసతి సావిత్రి"లో నిరూపరాయ్.

బొంబాయి సినిమా

భారత పాకిస్తాన్ల ఫిలిం ఒప్పందం మేరకు పాకిస్తాన్ భారతీయచిత్రాలను తీసుకోనకపోయినా, మనవాళ్ళుమాత్రం, ఒప్పందాన్ని అక్షరాలా గౌరవించి పాటిస్తూనే ఉన్నారు. నిజానికి, ఈ ఒప్పందం కోసమనే, ఈమధ్య 'అనోఖీ' అనే పాక్ చిత్రాన్ని తెప్పించారు. ఇది అమెరికన్ చిత్రం, 'ఫాబ్యులస్ సెనోరిటా' అనుకరణ. బొంబాయిలో తయారైన 'అల్బేలీ' కి దాదాపు ప్రతి. దీనివల లాభం లేకపోయినా డిస్ట్రిబ్యూటర్లు ఇక్కడ విడుదలచేశారు. అలాగే 'హమూదా,' 'నౌకర్' అనే పాకిస్తానీ చిత్రాలు, మనదేశంలో తయారైన 'శబన్' 'జౌలాద్'లకు ప్రతిరూపాలు. తెలిసికూడా మన డిస్ట్రిబ్యూటరు వాటిని తెప్పించి ప్రదర్శించినా, పాకిస్తాన్ మాత్రం, ఈ ఒప్పందం అమలుకువచ్చినప్పటినుండి ఒక భారతచిత్రాన్నికూడా తీసుకోలేదు. తత్ఫలితంగా, వ్యవహారం మళ్ళీ అడ్డంతిరగడం తప్పనిసరిగా కనబడుతోంది. ఇదే జరిగితే భారతీయ చిత్రాలకు ఒకలక్షరూపాయల రాబడినిచ్చే వసతి లేకుండాపోతుందన్నమాట. అయితే ఈ విధంగా ఈ వసతి పోయినా, మధ్య ఆసియా దేశాలలోను, ఆగ్నేయాసియా దేశాలలోను ఇంతకన్న మంచి 'మార్కెట్' సంపాదించడానికి భారతీయ నిర్మాతలు కృషిచేస్తున్నారు. పాకిస్తాన్కు మాత్రం భారతదేశంలో మార్కెట్ కోల్పోవడం పెద్ద దెబ్బ.

* * *

"ఝనక్ ఝనక్ పాయల్ బాజే" దర్శక నిర్మాత శ్రీ శాంతారాం తరువాతి టెక్నికలర్ చిత్రానికి సన్నాహాలు పూర్తి చేసుకున్నారు. ఈ చిత్రానికి "దో ఆంఖే, బారా హాత్" (రెండు కళ్ళు పన్నెండు చేతులు) అని పేరు పెట్టారు. దర్శకత్వంతో పాటు ఇందులో ముఖ్య భూమికను కూడా ఆయనే నిర్వహిస్తారు. ఈ కథలో ఏనుగలు వస్తాయట. అందుకై పెద్దదంతాలున్న ఒక ఏనుగ కోసం ఒక చిన్న ఏనుగకోసం ఆయన అన్వేషణ జరుపుతున్నారు. ఇప్పటికి వేసుకొన్న కార్యక్రమం ప్రకారం ఈ కొత్త చిత్రం అక్టోబరునాటికి సెట్స్ను వెళ్ళగలదనుకొంటున్నారు.

* * *

కొంతకాలంగా కనబడకుండా ఉన్న కామినీకౌశల్ ఇపుడు ఫిలింస్తాన్ వారి "బారా మహీనా"లో ముఖ్య భూమిక స్వీకరించింది.

"చాలీస్ బాబా", "బిరాజ్ బహూ" చిత్రాల తరువాత, ఆమె నటించబోయే చిత్రం ఇదే. ఈ రెండేళ్ళుగా, తనకు 'తగిన' భూమికకై ఆమె ఎదురుచూస్తూ వచ్చింది.

"ఆ అవకాశం ఇప్పటికి వచ్చింది" అన్నదామె ఈ సంగతి చెబుతూ "బారామహీనా" చిత్రానికి కిశోర్ సాహు దర్శకత్వం నిర్వహిస్తారు.

* * *

బి. ఆర్. చోప్రా చిత్రం "ఏక్ హీ రాస్తా" బొంబాయిలో గత వారం రజతోత్సవం జరుపుకొన్నది. కొత్తదనం కోసం ప్రయత్నం చేసిన ఈ చిత్రం సర్వత్రా బహుళ జనాదరణ పొందుతోంది. అశోక్ కుమార్, మీనాకుమారి, డెయిసీ ఇరానీ ఇందులో ముఖ్య భూమికలు నిర్వహించారు. కథ పండిట్ ముఖ్ రాం శర్మ వ్రాశారు.

(ఆంధ్ర వారపత్రిక బొంబాయి విలేఖరి)

డిటెక్టివ్ సీరియల్

మూలం: ఎడ్గార్ వాలెస్

అరుణ వలయం

అనువాదం: "ప్రద్యుమ్న"

36 అరుణ వలయం
సర్వసభ్య సమావేశం

మంత్రి రాఫేల్ విలింగ్స్ ఇటీవలే యాభైయవ పడిలో పడిన మనిషైనా, కేవలం శక్తిసామర్థ్యాలవల్లనే మంత్రివర్గంలో స్థానం సంపాదించ గలిగాడు. అతడు అందరికీ ఇష్టుడని అనడానికి వీలేదు. తన తోడి మంత్రులలోగాని, దేశంలోగాని అతనికి పెద్దపలుకుబడిలేదు. సమర్థుడనీ, గొప్ప వక్త అనీ అతనికి పేరు ప్రతిష్ఠలున్నా అతనిమీద సంపూర్ణ విశ్వాసం ఎవరికీ లేదు. నిలకడలేని మనిషని, ఏ యెండకా గొడుగు పట్టేరకమని అనేక పర్యాయాలు ఋజువైంది. అలాంటి వ్యక్తిఅయినా, అతనికి మంత్రి పదవి లభించిందంటే విశేషమే మరి!

దీనికి ముఖ్యకారణ మేమంటే అతనికి పలువురు అనుయాయులున్నారు. వారికి మాత్రం అతనిమీద పూర్తిగా గురివున్నది. అతడు కనుసైగచేస్తే చాలు అతని తరఫున ఓటు చేయడానికి వారు సిద్ధం. పార్లమెంటులో ప్రభుత్వ పక్షానికి ఉన్న మెజారిటీ కూడా అంతంత మాత్రం గనుక, అతని అనుయాయుల బలాన్ని కాదనగలిగినదమ్ములు ప్రభుత్వానికి లేవు.

మిస్టర్ విలింగ్స్ కొద్దిగా లావుగా, దృఢంగా ఉంటాడు. కొంచెం బట్టతల. అయినా మనిషి ఆకర్షవంతంగానే ఉంటాడు. థాలియా డ్రమండ్‌తో తన పరిచయం తాను స్వయంగా ఏర్పరచుకున్నదేనని అతని నమ్మకం. ఈ పరిచయం కలిగించింది ఒకానొక కులీనవనితే. ఆ వనితకు అలా పరిచయం కలిగించాల్సిందని అరుణవలయం నాయకుడు ఆజ్ఞఇచ్చాడని విలింగ్స్‌కు తెలిస్తే అతడు నిర్ఘాంతపోయి ఉండును. అరుణవలయానికి అనేక అంతస్తులలో, అనేక తరగతులలో సభ్యులున్నారు. కొందరు బ్యాంకి గుమాస్తాలు, కనీసం ఒక రైల్వే డైరెక్టరు, ఒక డాక్టరు, ముగ్గురు హోటళ్ల యజమానులు ఇలా సుమారొక నూరుగురు సభ్యులున్నారు. వీరందరికీ ప్రతిఫలం పుష్కలంగా ముట్టడమేకాక, వారు చేయవలసిన పనులు కూడా అంత కష్టమైనవి కావు. ఇద్దరు వ్యక్తులకు పరిచయం కలిగించడం లాంటి చిన్నచిన్న పనులే ఎక్కువమంది సభ్యులకు ఇవ్వబడేవి.

వలయ నిర్మాణం బహు విచిత్రమైనగాథ. నాయకునికి ఎలా తెలిసేదో ఏమోగాని, డబ్బులేక బాధపడేవారిని, ఏదో అపాయంలో చిక్కుకున్న వారిని పసిగట్టి, వెంటనే తన వలయంలో ఇరికించేవాడు. ఈ విధంగా అనేకులు ఆ ముఠాలో సభ్యులుగా చేరారు. ఏ ఒక్కడికీ ఇతర సభ్యులు తెలియకుండానూ, తాను తెలియకుండానూ అజ్ఞాతంగా ఉంచేవాడు నాయకుడు. ఎవరూ ఊహించని ప్రదేశాలలో, సమయాలలో అతడు తన సభ్యులను కలుసుకునేవాడు. ప్రతి సభ్యుడికీ ఒక నిర్ణీత కర్తవ్యం ఉండేది. చాలామందికి ఆ నిర్ణీత కర్తవ్యం అతి సులభమైనదిగా, అప్రధానమైనదిగా ఉండేది.

వలయసభ్యులో కొందరు భయపడి పోలీసులకు తమ సభ్యత్వాన్ని గూర్చి చెప్పేసేవారు కాని ఎక్కువమంది నాయకుడు ప్రతీకారం చేస్తాడనే భయంకొద్దీ తమ సభ్యత్వాన్ని గుప్తంగానే ఉంచేవారు.

కమీషనరుతో డెరిక్ యేల్ విందారగించినరోజునే అరుణవలయం నాయకుడు తన సభ్యులందరికీ ఒక సందేశం పంపిస్తూ, సర్వసభ్య సమావేశం జరుగుతుందని తెలియజేశాడు. ఏ సభ్యుడు ఏ దుస్తులలో హాజరు కావలసిందీ, ఇతర సభ్యులు గుర్తుపట్టడానికి వీలేకుండా ఏ జాగ్రత్తలు తీసుకోవలసిందీ వివరంగా తెలిపాడు. అయితే ఈ సందేశాన్ని తనకు అంతే నమ్మకంలేని సభ్యులకు మాత్రం పంపలేదు.

థాలియా డ్రమండ్‌కు కూడా ఆహ్వానం వచ్చింది. ఆ సమావేశం ఆమె ఎన్నడూ మరిచిపోలేదు.

లండన్ నగరంలో పురాతనమైన చర్చి మందిరాలనేకం ఉన్నాయి. కాని సెంట్ ఆగ్నిస్ చర్చి అన్నిటిలోకీ బహుపురాతనమైనది. అక్కడికి హాజరయ్యే జనులను వేళ్లమీద లెక్కపెట్టవచ్చును. చర్చి అధికారి ఒకడున్నాడు కాని, అతడు వారం వారం జరిపే ప్రార్థన సభలకు డబ్బిస్తేగాని ఆ వచ్చే కొద్దిమంది కూడా వచ్చేవారు కారు. చర్చి వెనక శ్మశానవాటిక ఉండేది కాని, నగరం మధ్యలో అంత ఖాళీ ప్రదేశం ఊరికే ఉండడం సహించలేక అధికారులు దాన్ని ఆక్రమించుకుని శ్మశానాన్ని వేరచోటికి బదిలీచేసి అక్కడ కొన్ని కార్యాలయాలు కట్టారు.

చర్చిలోపల చాలా చీకటిగా ఉంటుంది. ఇరుకుదోవగుండా లోపలికి వెళ్ళాలి. ఆ చర్చిలోనే అరుణవలయం సభ్యుల మొదటి సమావేశం, ఆఖరి సమావేశం కూడా జరిగింది.

ఈ సమావేశ నిర్వహణలో నాయకుడు కనబరచిన చాకచక్యం నిరుపమానం. ప్రతి సభ్యుడూ సరిగ్గా ఏ నిమిషానికి హాజరుకావాలో తెలియజేశాడు. దాని ప్రకారం ఏ ఇద్దరు సభ్యులూ కలిసి హాజరుకావడానికి అవకాశం లేదు. చర్చి తాళం చెవులతనిచేతి కెలా చిక్కాయో, ఆ సమయంలో సమావేశం నిరభ్యంతరంగా సాగిపోగలదని అతడెలా ఊహించాడో, ఆ సమయంలో ఆసందులో పోలీసు గస్తీ ఉండదని అతనికెలా తెలిసిందో ఇదంతా దురూహ్యం. ఆ ఏర్పాట్లుచూసి థాలియా డ్రమండ్ విస్మితురాలైంది.

నిర్ణీత నిమిషానికి ఆమె చర్చి మెట్లుఎక్కి తలుపు సమీపించింది. వెంటనే నిశ్శబ్దంగా తలుపులు తెరుచుకున్నాయి. ఆమె లోపల అడుగు పెట్టగానే మూసుకున్నాయి. అంతా గాఢాంధకారం.

"సరాసరి ముందుకు వెళ్లి, కుడివైపు రెండో వరుసలో కూర్చో" అని ఒక కంఠం ఆజ్ఞాపించింది.

ఆ చీకటిలోనే థాలియా మరికొందరు హాజరై వరసలుగా కూర్చున్నట్లు కనిపెట్టింది. అంతా మౌనంగా కూర్చున్నారు. కొంతసేపటికి తలుపుదగ్గిరున్న వ్యక్తి వచ్చి

★ అరుణవలయం ★

నౌకపై నిలబడ్డాడు. అతడే యజమాని అని ఆమె గ్రహించింది.

అతని కంఠం తగ్గు స్థాయిలో నూతిలోంచి వస్తున్నట్లు వినబడింది. తాను మొదటి రోజున కారులో అతన్ని కలుసుకున్నప్పుడు ధరించిన ముసుగునే ఇప్పుడుకూడా తలమీద ధరించి ఉన్నాడని థాలియా ఊహించింది.

"స్నేహితులారా!" అని నాయకుడు ప్రసంగం మొదలు పెట్టాడు: "మన సంఘాన్ని రద్దు చేసివేయవలసిన కాలం ఆసన్నమైంది. పత్రికలలో నా షరతుల ప్రకటన మీరు చదివే ఉంటారు. ప్రభుత్వం విధిగా నేనడిగిన ధనం నాకిస్తుంది. అందులో మీ కందరికీ అయిదో వంతు ధనం పంచిపెడతానని చెప్పడానికి సంతోషిస్తున్నాను. మన సభకు అంతరాయం కలగవచ్చని సందేహించే పిరికివాళ్ళెవరైనా ఇక్కడుంటే వారికొక హామీ ఇస్తున్నాను. ఇంకొక పావుగంటదాకా పోలీసుగస్తీ ఇక్కడికి రాదు. నా గొంతుక చప్పి బయటికి వినిపించడం కూడా అసంభవం."

కంఠస్థాయి మరికొంత హెచ్చించి, కఠిన స్వరంతో అతడిలా చెప్పుకుపోతున్నాడు:

"మన సభ సంగతి పోలీసులకు ఎలాగో తెలిసిపోయి ఉంటుందని అనుమానించే వారికి నేను చెప్పేదేమిటంటే, ఈ రాత్రి నన్ను పట్టుకోవడం మానవులకు అసాధ్యం. మనం కొంత అపాయంలో ఉన్నమాట నేను కాదనను. నన్ను డిటెక్టివ్ డెరిక్ యేల్, ఇన్‌స్పెక్టర్ పార్ వెంటాడుతున్నారు. ఈ క్లిష్టతరుణంలో మీరందరూ శక్తివంచన లేకుండా సహాయం చేయవలసిందిగా కోరుతున్నాను. రేపు మీకందరికీ కొత్త ఆజ్ఞలు అందుతాయి. మీమీ కర్తవ్యాలను మీకు అర్థం కాకపోవడానికి వీలులేకుండా వివరంగా వ్రాసిపంపుతున్నాను. నేనెంత అపాయంలో ఉన్నానో, మీరూ అంతే అపాయంలో ఉన్నారు. అందుచేత మీకు ప్రతిఫలం కూడా హెచ్చుగా ముట్టచెప్పగలను. ఇక మీరు వెళ్ళిపోవచ్చును. ఒక్కొక్కరే ముప్పయ్ సెకండ్ల వ్యవధానంలో కదిలిపోవాలి. ముందు కుడివైపున ఉన్న ఇద్దరూ వెళ్ళండి. తరవాత ఎడమవైపున్న ఇద్దరూ కదలండి... పోండి!"

అతడు ఇచ్చిన వ్యవధిలో ఆ నల్లని ఆకృతులన్నీ లేచి వెళ్ళిపోవడం, కొద్దిసేపట్లో హాలంతా ఖాళీకావడం జరిగిపోయింది.

తరవాత నాయకుడు కూడా బయటకు వచ్చాడు. తలుపు తాళంవేసి జేబులో వేసుకున్నాడు. సందుమొగలోకి వచ్చి ఒక టాక్సీని పిలిచి ఎక్కి, పడమటిదిశగా వెళ్ళిపోయాడు.

అంతకు పావుగంట ముందే థాలియా డ్రమండ్ ఒక టాక్సీలో అదేవైపు వెళ్ళింది. కారులో కూర్చునే తన దుస్తులను మార్చివేసుకుంది. అంతకుముందు ధరించిన నల్లని పొడుగాటి ఓవర్‌కోటు, ముసుగు కప్పిన నల్లని టోపీ తీసివేసింది. లోపల పల్చని సిల్కు టెన్నిస్ దుస్తులు ఉన్నాయి. ఆ రాత్రి ఆమె మెరాస్ క్లబ్బుముందు కారు దిగేసరికి ఆమె అందం వర్ణనాతీతంగా ఉన్నది.

జాక్ బియర్డ్‌మోర్ కూడా అదే అనుకున్నాడు. అతడొకచోట స్నేహితులతో కూర్చుని విందారగిస్తున్నాడు. అతడు తల ఎత్తి, థాలియా మరొక పురుషునితో కలిసి లోపలికి రావడంచూసి ఈర్ష్యతో కుమిలిపోయాడు.

"అతడెవరు?" అని జాక్ అడిగాడు. అతని స్నేహితుడు అటు చూసి "ఆమె ఎవరో తెలియదుగాని అతడు రాఫేల్ విలింగ్స్. మంత్రి" అని చెప్పాడు.

జాక్ తనను చూడకముందే థాలియా అతన్ని చూసింది. ఆ సమయంలో అతడక్కడే తటస్థపడడం బాధ కలిగించింది. మిస్టర్ విలింగ్స్ చెప్పుకుపోతున్న మాటల్లో సగం ఆమె చెవిని పడనేలేదు. ఆమె మనస్సు పరిపరి విధాలుగా ఆలోచిస్తున్నది. మంత్రి చెబుతున్న మాటల్లో చటుక్కున ఒక మాట ఆమె చెవినిపడి ఆమె తలెత్తిచూసింది.

"పాతకాలపు కత్తులా?" అని ఆమె ఉలికిపడింది. "అన్నట్లు మిస్టర్ విలింగ్స్! మీ దగ్గిర చాలా ఉన్నాయటగా?"

"చూడాలని ఉందా?" అని అతడు నవ్వాడు.

"ఊ".

"అయితే ఒక రోజున వచ్చి మా యిల్లు పావనం చేయకూడదూ? ఆడవాళ్ళకి కత్తుల మీద ఆసక్తి ఉండడం వింతే. రేపు వస్తావా?"

"ఊహు, రేపు కాదు. ఎల్లుండి." థాలియా చెప్పిన తేదీ మరిచిపోకుండా అతడు చొక్కా చేతిమీద వ్రాసుకున్నాడు.

జాక్ ఆమెకేసి చూడనైనా చూడకుండా క్లబ్బులోంచి వెళ్ళిపోయాడు. ఆమె చాలా విచారపడింది. అతనితో మాట్లాడాలనిపించింది. అతడు తన బల్లదగ్గిరికి వస్తే బాగుండునని అనుకుంది.

మిస్టర్ విలింగ్స్ ఆమెను తన కారులోనే తీసుకెళ్ళి ఆమె బసవద్ద దింపాడు. అతడు వెళ్ళిపోవడం ఆమె కెంతో ఉపశాంతిగా ఉంది.

ఆమె బస ఉన్న ఇంటికి ముందు ఒక ఆవరణ ఉన్నది. గుమ్మం చేరబోయేముందే ఆమె తనకోసం ఎవరో నీడలో కాచుకొని ఉన్నారని గ్రహించింది. విలింగ్స్ కారు వెళ్ళిపోయేదాకా ఆగి, తనకోసం ఎదురుచూసే వ్యక్తిని సమీపించింది. ఆ వ్యక్తి ఒక నిమిషంసేపు ఏవో గుసగుసలాడి గబగబ వెళ్ళిపోయాడు. ఆమె తన గదిలోకి వెళ్ళిపోయింది.

అలా వెళ్ళిపోయిన వ్యక్తి తనను మరొకడెవడో అనుసరిస్తున్నట్లు గ్రహించాడు. వాడు థాలియా ఇంటి కెదురుగా ఉన్న ఒక షాపువద్ద నిలబడి ఉండడం అతడిదివరకే చూశాడు. కాని ఏమీ ఎరుగనట్లు ముందు సాగిపోతున్నాడు. వెనకాల వచ్చే మనిషి కొద్ది క్షణాల్లో తన నధిగమించి ముందుకు పోయి వెనక్కి తిరిగి తన ముఖంలోకి చూస్తాడని తెలుసు. అందుకని అట్టే దీపకాంతిలేని పక్క సందులోకి తిరిగి వేగం తగ్గించాడు. ఇంతలో వెనకాల వాడు గబగబ నడిచివచ్చి, దీపకాంతి బాగా ఉన్నచోట ముందుకు వెళ్ళడానికి ఆలోచిస్తున్నాడు. వాడు తన ముఖంలోకి సరిగా చూడకముందే ముందరి వ్యక్తి హఠాత్తుగా వెనుదిరిగి వాడిమీదికి లంఘించాడు. వాడు తెల్లబోయాడు. అరవడానికి ప్రయత్నిస్తుండగా, వాడి గొంతును ఇనుములాంటి చేతులతో నొక్కిపట్టి నేల మీద పడవేశాడు. ఇంతలో నేల ఈనినట్లు ఎక్కణ్ణించి వచ్చారో ముగ్గురు వ్యక్తులు వచ్చి నేలమీద పడి ఉన్నవాణ్ణి లేవనెత్తి బలంగా అటూ ఇటూ ఊపారు. వాడికి స్పృహ వచ్చింది. అటూ ఇటూ చూసి గాబరా పడ్డాడు. తాను ఇందాకణ్ణించి అనుసరించిన మొదటి వ్యక్తిని చూసి,

"అరె. నువ్వా నాకు తెలుసు!" అన్నాడు.

మొదటి వ్యక్తి నవ్వాడు.

"కాని, నీకు తెలిసినదాన్ని ఉపయోగించుకునేందుకు వీలు మాత్రం లేదు," అన్నాడాతడు.

37 "బ్రతికి ఉంటే కలుసుకుంటా"

జాక్ బియర్డ్‌మోర్ ఇంటికి వెళ్ళిన్న మాటేగాని, హృదయం ఈర్ష్యాగ్నితో దహించుకుపోతోంది. ఆ ప్రమాదం థాలియా డ్రమండ్ ప్రవర్తనే అతన్ని బాధింపసాగింది ఆమె దుశ్శీల అని అనుమానించడానికి కావలసిన బలమైన ఆధారాలన్నీ ఉన్నాయి. తన పుస్తకాగారంలో అటూ ఇటూ వెర్రిగా పచారు చేస్తూ తనంత తెలివితక్కువవాడు జగత్తులో లేడని ఊరికే నిందించుకోసాగాడు ఆమె తన ఎదుట కనిపిస్తే, ఆమె తన్ను బాధించినట్లే తానూ ఆమెను బాధించాలన్నంతకోపం వచ్చింది అలా ఎంతసేపో ఆమెను మనస్సులోనే దూషిస్తూ గడిపాడు.

కుర్చీలోంచి లేచి ఒక ఇనపపెట్టె తెరచి అందులోంచి కాగితాలకట్ట ఒకటితీసి బల్లమీద పడేశాడు ఆ కాగితాలు తన తండ్రి దస్త్రాల్లో కనిపించినవే. వాటిలో సీలు వేసిన కవరు కూడా ఉన్నది. దానిని ఏ కారణంచేతో ఎవరూ తెరవలేదు థాలియా మీద కసి తీర్చుకోడానికైనా ఆ కవరును తెరిచి చూడాలని అతని కనిపించింది.

ఆ కవరులో ఉన్న ఫోటో చూడవద్దని ఆమె అతన్ని ఎందుకు కోరింది? ఆమెకు మార్గ్ మీద అంత శ్రద్ధ ఎందుకు? అతడు అకస్మాత్తుగా చనిపోయిన నాటి రాత్రి ఆమె అతనితోనే కొంతసేపు ఉండిన్న సంగతి జ్ఞాపకంవచ్చింది. ఆ కాగితాలకట్ట తీసుకుని తన పడక గదిలోకి వెళ్ళాడు. అప్పటికతడు చాలా నీరసంగా, అలిసి పోయి ఉన్నాడు. కవరులో ఉన్న 'ఉరి' ఫోటో తీసి చూద్దామనుకున్నాడు గాని మళ్ళీ అంత ఓపిక లేక దాన్ని అలాగే ఉంచివేశాడు. అంత రాత్రివేళ ఆ భయంకర దృశ్యం చూడాలనే ఆలోచనే అతనికి బొత్తిగా రుచించలేదు. దాన్ని బల్లమీద నిర్లక్ష్యంగా పడేశాడు.

ఆ రాత్రి తనకు నిద్ర పట్టుతుందనే నమ్మకం అతనికేకోశానా లేదు. అతని మానసిక స్థితి అంత ఆందోళితమై ఉంది. కాని అతడు పక్కమీద పడుకుండి కళ్ళు మూశాడో లేదో వెంటనే తెలియకుండానే నిద్ర అవహించింది. కల వచ్చింది. కలలో కూడా థాలియా డ్రమండ్ ముఖం అతడు తప్పించుకోలేక పోయాడు. ఇన్‌స్పెక్టర్ పార్ పోలికలున్న ఒక పెద్ద భూతం చేతుల్లో ఆమె చిక్కుకున్నట్లు అతనికి కనిపించింది. పార్ "తల" పోలికలున్న మార్గ్ వికృత ముఖం మరొకటి కనిపించింది. గభాలున లేచి కూర్చున్నాడు.

అతడు పడుకోబోయే టప్పుడు దీపం ఆర్పి పడుకున్నాడు. కాని మెలకువ వచ్చిన క్షణంలో బల్ల దగ్గరగా దీపం వెలిగి మాయమైనట్టు తోచింది.

"ఎవరది?" అని అతడరిచాడు.

ఎవరో తలుపు దగ్గిర కదులుతున్నట్లు చూశాడు. ఒక్క అంగలో అక్కడికి దూకి ఆ వ్యక్తిని పట్టుకున్నాడు. ఎవరో అతని చేతుల్లో చిక్కి తప్పించుకు పోవాలని పెనగులాడుతున్నారు. ఆచీకట్లోనే అతడు గ్రహించాడు ఆ వ్యక్తి థాలియా అని.

ఆమెను వదిలి అతడు చీకటిలో తడిమి స్విచ్ వేశాడు. గది అంతా కాంతితో నిండింది.

పాలిపోయి వున్న ముఖంతో, వణికి పోతూ థాలియా కనిపించింది. ఆమె చేతులలో ఏదో దాచుకుని వెనక్కి పెట్టుకుంది. నిర్లక్ష్యంగా అతని వంక చూడడానికి ప్రయత్నించింది

"థాలియా!" అని అతడు మూలిగి, కుర్చీలో కూలబడ్డాడు.

థాలియా తన గదిలో కెందుకు వచ్చింది!

"ఎందుకిలా వచ్చావు? చేతులో ఏమిటది?" అని అడిగాడు.

"ఈ కాగితాలు నీ గదిలో కెందుకు తీసుకొచ్చావు? ఆ ఇనప్పెట్టెలోనే ఎందుకు ఉంచలేదు?" అని కోపంతో ఊగిపోతూ అడిగింది

ఆమె చేతిలో దాచుకున్నది ఫోటో ఉన్న కవరని అతడు గ్రహించాడు.

"కాని—కాని, నాకేమీ అర్థం కావడం లేదు. నాకెందుకు చెప్పలేదు—"

"నేను నీతో చెప్పలేదూ? ఆ ఫోటో చూడవద్దని చెప్పలేదూ? ఇక్కడి కెందుకు తీసుకొచ్చావ్? వాళ్ళివాళ దీనికోసం వచ్చి మా ఇల్లంతా గాలించారు."

"ఇక్కడికొచ్చారా? ఎవరు?"

"అరుణవలయం వాళ్ళు. నీదగ్గిర ఈ ఫోటో ఉందని వాళ్ళకి తెలుసు నీ లైబ్రరీ గదిలో ప్రవేశించి వెదికారు. నేనప్పుడు ఇక్కడే ఉన్నాను వాళ్ళకి ఫోటో కంటపడాలని నేను దేవుణ్ణి ఎంతప్రార్థించానో తెలుసా? ఇప్పుడు నువ్వీ ఫోటో చూసివుంటావనుకుంటారు. అయ్యయ్యో, దీన్ని నీ దగ్గిరెందుకు పెట్టుకున్నావు?"

"నాకు నువ్వు చెప్పేదేమీ బోధపడడం లేదు ఇంట్లో దొంగలు పడ్డారన్నదొకటే తెలుస్తోంది. నాతో రా, ఎక్కడో చూపించు."

ఇద్దరూ క్రిందికి దిగి వెళ్లారు. పుస్తకాగారంలోకి పోయి చూశారు. థాలియా చెప్పినట్టే జరిగింది ఇనపపెట్టె తలుపు తెరిచి ఉంది పెట్టెలో వస్తువులు, కాగితాలు చెల్లాచెదరుగా కింద విసరివేయబడి నాయి. అతని డ్రాయరు సొరుగులు బలాత్కారంగా తెరవబడ్డాయి బల్లమీది కాగితాలన్నీ వెదికి పారవేసినట్లు కింద పడి ఉన్నాయి చిత్తు కాగితాల బుట్టకూడా గాలించబడింది.

"ఇదంతా ఏమిటి? ఎందుకిలా," అంటూ జాక్ కిటికీ తెరలు తొలగించాడు.

"నీకు నెమ్మది నెమ్మదిగా తెలుస్తుందిలే. ఒక కాగితం తీసుకుని నేను చెప్పినట్లు వ్రాయి" అన్నది థాలియా.

"ఎవరికి?"

"ఇన్‌స్పెక్టర్ పార్‌కి. "మిత్రమా! నా తండ్రిగారు చనిపోక ముందు రోజున ఆయనకి వచ్చిన ఒక ఫోటో పంపిస్తున్నాను. దాన్ని నేను తెరిచి చూడలేదు. మీ కిది ఎందుకైనా ఉపయోగపడవచ్చు"

బుద్ధిమంతుడయిన పిల్లవాడిలాగ జాక్ ఆమె చెప్పినట్టే వ్రాశాడు. ఆ ఉత్తరాన్ని ఫోటో కవరును ఆమె మరొక పెద్ద సైజు కవరులో పెట్టి అతికించి వేసింది.

"ఇప్పుడు దీనిమీద ఇన్‌స్పెక్టర్ పార్ చిరునామా వ్రాసి, జాక్ బియర్డ్‌మోర్ నుండి అని కూడా వ్రాయి," అని చెప్పింది.

ఆ కవరు చేతిలో పట్టుకుని ఆమె గది ఇవతలికి వచ్చింది మళ్ళీ వెనక్కి తిరిగి

"మిస్టర్ బియర్డ్ మోర్! రేపటిదాకా నువ్వు బ్రతికి వుంటే మళ్ళీ కనిపిస్తాను," అన్నది.

అతడు ఇది వేళాకోళంగా భావించి నవ్వబోయాడు. కాని ఆమె గంభీరమైన వదనం, ఆమె పెదవుల కంపనంలో, ఏదో అవ్యక్త సందేశం చూసి అతడు నిరుత్తరుడై నవ్వకుండా అలా చూస్తూ నుంచుండి పోయాడు (ఇంకా వుంది)

గ్రుడ్డి హృదయాలు

"తారక"

రైలు వేగంగా పోతోంది. చల్లగాలి తెరచి వున్న కిటికీలోంచి శరీరాన్ని తాకుతుంటే ఆకలికూడా మరచిపోయి కునుకుపాట్లు పడుతున్నాను. కాని బండి కుదుపు వల్లా, మధ్య స్టేషన్లలో ఆగినప్పుడు ఎక్కే ప్రయాణికుల సందడివల్లా చేతికి తగిలించిన ఇనపగొలుసుల బాధవల్లా సరైన నిద్ర పట్టలేదు. కడుపులో ఆకలి విపరీతంగా వుంది. కళ్ళు మూసుకుని అలాగే కాసేపు కూర్చున్నాను. మళ్లీ కళ్లు తెరచి చూచేసరికి ఎక్కడ ఎక్కాడో ఒక లావాటి పెద్దమనిషి చుట్ట కాల్చుకుంటూ, నావేపు ఎగాదిగా చూస్తున్నాడు. మనిషి బాగా డబ్బున్నవాడిలా కనిపిస్తున్నాడు. చేతులకు బంగారు మురుగులూ, రవ్వ వుంగరాలూ, కళ్ళకు బంగారు ఫ్రేముజోడూ వున్నాయి. రైలు నడుస్తూనే వుంది. స్టేషను యింకా చాలా దూరమున్నట్లుంది. రైల్లో చాలామంది నిద్రపోతున్నారు. సరిగా స్థలం దొరకనివాళ్లు కొందరు అలాగే బల్లల్ని ఆనుకొని కునుకుపాట్లు పడుతున్నారు. వున్నట్టుండి ఆ పెద్దమనిషి నా ప్రక్కనకూర్చున్న కానిస్టేబుల్ని "ఎక్కడికి కళ్తున్నారు?" అని అడిగాడు. ముక్తసరిగా జవాబు చెప్పాడు కానిస్టేబులు. "ఏం చేశాడు?" అని మళ్ళీ ప్రశ్న వేశాడా పెద్దమనిషి.

"జేబు కొట్టాడండి' అని వినయంగా చెప్పి ఈసారి ఒక పొగాకుకాడ అడిగి పుచ్చుకున్నాడు కానిస్టేబులు.

"జేబు కొట్టాడా...!" అని ఆశ్చర్యంగా అడిగి ఒకసారి తన జేబుచూసుకున్నాడు. జేబు చాలా ఎత్తుగా వుంది. కాసేపాగి మళ్లీ అన్నాడు.

"ఎంత కొట్టేశాడు?"

"అయిదువందలు."

"అబ్బా! ఎలా దొరికాడు?"

"జేబు కత్తిరించేశాడండి. పర్సులో కొంత చిల్లర కూడా వుంది. అది కొంచం గలగలమనేసరికి పట్టుకుని నలుగురు తన్నారండి."

ఆ పెద్దమనిషి అంతా విని జాలిగా పెదవి చప్పరించి "కొట్టడమూ కొట్టారు- జైల్లోనూ పెడుతున్నారు" అని నా వంక జూసి "నీకు తల్లీతండ్రీ వున్నారుట్రా?" అని అడిగాడు.

"లేరు" అన్నాను.

"అందువల్లనే యింతగా చెడిపోయావు" అన్నాడు. మళ్లీ కాసేపాగి "పట్టుమని పదిహేనుఏళ్లు లేవు. నీకీ జేబులు కొట్టటం ఎవరు నేర్పారురా? "దొంగతనంచేసి సంపాదించినదాంతో ఎన్నాళ్ళు కడుపు నిండుతుందిరా?" అని అడిగాడు.

నేనేం మాట్లాడలేదు. ఒక నిమిషం ఆగి మళ్లీ "అందరూ జేబులు కొట్టే బ్రతుకుతున్నారా? కాయకష్టం చేసుకుని ఎందరు బ్రతకటములేదు?" అన్నాడు.

"ఎవరిస్తారుబాబూ, మాకుపని? 'జేబులు కొట్టేవాడికి నీకెందుకురా పని' అంటారండి!

"నిజమే బాబు, ఎవరిస్తారు పనివాళ్లకి?" అన్నాడు కానిస్టేబులుకూడా.

"ఎవరూ ఎందుకివ్వరూ? నీతిగా బ్రతుకుతానంటే నేనిస్తాను. నాదగరకురమ్మను" అన్నాడు ఆ పెద్దమనిషి. నేను నమ్మలేకపోయాను ఆయన అలా అంటాడని తరువాత ఎక్కువగా సంభాషణ జరగలేదు పెట్టెలోకి మిలిటరీవాళ్ళు ఎక్కారు. పడుకున్నవాళ్లిద్దర్ని లేపుతున్నారు. గలభా ఎక్కువయింది. ఇంతలోకే ఏదో స్టేషన్ దగ్గరకొస్తున్నట్లుండి, రైలువేగం తగ్గింది. పెద్దమనిషి కింద చెప్పులు తడుముకుంటున్నాడు కాళ్లతో. కానిస్టేబులు "బాబూ దిగుతున్నారా?" అని అడిగాడు.

"అవును, ఇదే మావూరు, కొండపల్లి" అని ఆయన లేచి నిలబడ్డాడు. స్టేషను వచ్చింది. ఆయన దిగి వెళ్లిపోయాడు. ఆయన అన్నముక్కలే నా చెవుల్లో గింగురుమంటున్నాయి "నిజాయతీగా బ్రతుకుతానంటే నీనిస్తాను నాదగరకు రమ్మను" నేనసలు యింతవరకూ ఆసంగతే ఆలోచించలేదు. నిజమే ఎవరిదగ్గరనా యింతచాకిరి చేసుకుంటే పొటగడవదూ! దొంగతనం చేసి పట్టుబడి చావుదెబ్బలు తినటంకన్నా అది బాగాలేదూ...? ఆ పెద్దమనిషి అడిగినప్పుడు "ఎవ్వరూ పనివ్వలేదని" అబద్ధం ఆడేశాను. కాని నిజంగా నేనసలెక్కడా అడగలేదు. ఇప్పుడాయన మాట అన్నాక నాకు ఏడుపొచ్చింది. యిన్నాళ్ళూ దొంగతనం ఎందుకు చేశానా అని. కష్టపడితే నా ఒక్క పొట్ట నిండకపోయిందా? అనుకున్నాను.

అయిదునెల్లు శిక్ష పడింది ఆ అయిదు నెలూ అయిదేళ్లుగా గడిచాయి జైల్లో వుండగానే మేము జేబులు కొత్త కొత్త రకాలుగా కత్తిరించడం నేర్చుకుంటాం. కాని నేనీసారి సోమరిగా కాలం అంత వృథాగా గడపాను.

శిక్ష అయిపోగానే సరాసరి కొండపల్లి వెళ్ళాను జైల్లోకూడా ఆ వూరు పేరు మర్చిపోకుండా ఒక రాయి తీసుకుని జైలు గోడ మీద గీసుకున్నాను రెండురోజులు తిరిగాక నాకా పెద్దమనిషి ఒక కాఫీహోటల్లో కనిపించాడు. ఆయన బైటకు వచ్చేదాకా గోడ్డుమీద నిలుచున్నాను. బైటకురాగానే "అయ్యా నమస్కారం!" అన్నాను. ఆయన నావంక ఎగాదిగా చూసి "ఓ నువ్వా!" అన్నాడు. "చిత్తం, తమరు పని చూపిస్తామన్నారు. వచ్చాను" అన్నాను.

"ఏం పని?" అన్నాడు.

"నిజాయితీగా బతికితే తమరు పని ఇస్తామన్నారు. గంపెడాశతో వచ్చాను. మళ్లీ దొంగతనం చెయదల్చుకోలేదు." అన్నాను. ఆయన నవ్వి "ఎంతకాలం యీ వైరాగ్యం?.. కుక్క దాలిగుంటలో వున్నంతసేపే" అన్నాడు

"కాదండీ కష్టంచేసుకు బ్రతుకుతాను" అన్నాను.

"ఎవరిస్తారు నీకు పని? దొంగతనం చేసేవాడ్ని ఎవరన్నా పనిలో పెట్టుకుంటారా?" అన్నాడు.

"తమరు పెట్టుకుంటామన్నారు"

"ఏమో అప్పుడన్నానేమో, ఇప్పుడైతే ఏం ఖాళీలేవు నా దగర. బి. ఏ. లు చదువుకున్నవాళ్లేవుద్యోగాల్లేక చస్తూంటే, నీకు పనెక్కడ దొరుకుతుందిరా" అన్నాడు.

"అయితే, నన్నేం చేయమంటారు" అని అడిగాను. "ఛా...మళ్లీ దొంగతనం చేసుకు బ్రతుకు...అంతే!" అన్నాడు

నాకు ఆయన్నేమనాలో తోచలేదు.

ఆయనమాటలు నమ్మి జైల్లో వృథాగా గడిపాను కదాఅని విచారించాను. అక్కణ్ణించి సరాసరి మళ్లీ యీ బస్తీ వచ్చేశాను, మామూలుగా పోలీసువాళ్లపాగా నామీద తిప్పలేదు.

"జైల్లోనుంచి విడుదలయాక ఎక్కడికి పోయావురా?" అని అడిగారు.

"నిజాయితీగా బ్రతుకుదామని నౌఖరీ కోసం వెతుకున్నాను బాబూ!" అన్నాను, వాళ్లు నవ్వి ఊరుకున్నారు.

మళ్ళీ ఒక రోజున జేబుకొట్టాను పార్కర్ పెన్ను, కాని తేలికగా పట్టుబడిపోయాను. చాలా రోజుల్నుంచి అభ్యాసం లేకపోవటం మూలాన నావేళ్లు బండబారిపోయి వున్నాయి. చావు దెబ్బలు కొట్టి విడిచి పెట్టారు. కాని యీ సారి నన్ను జైలుకు పంపలేదు. ఆ పెన్నుగలాయన నన్ను కొట్టిన దెబ్బలకు జాలిపడి అయిదు రూపాయలు నాకిచ్చి, "ఇంకెప్పుడు దొంగతనం చేయకు" అన్నాడు. దొంగతనం చేసినందుకు నాకిదే మొదటి బహుమానం. తరువాత కొన్నాళ్లవరకూ దొంగతనం చేయలేదు. అలా పట్టుబడ్డాక నా మీద నాకే విశ్వాసం పోయింది. చివరకు ఒక నిశ్చయానికి వచ్చాను. ఒక్కసారిగా మాత్రం ఏదో పెద్ద దొంగతనం చేయాలి. దాంతో జీవనం కొన్నాళ్ళవరకూ గడపాలి. తరువాత సంగతి ఆలోచిద్దాం అనుకున్నాను. ఈ నిశ్చయానికి వచ్చాక నా ఆఖరుసారి దొంగతనంకోసం నాతోటి జేబుదొంగలదగ్గర కెళ్ళి అభ్యాసం మొదలు పెట్టాను. మూడు నెలల సాధనతో మళ్ళీ మామూలువాణ్ణయాను. జేబులు కొట్టే పద్ధతులు ఎప్పటి కప్పుడు మారుతుంటాయి! అన్నీ నేర్చుకున్నాను. పగలంతా బస్సు స్టాండు దగ్గరా, మీటింగులు జరిగేచోటా రైలు స్టేషన్లలో తిరిగేవాణ్ణి. రాత్రి ఏ పార్కులోనో పడుకునేవాణ్ణి.

నేను వేచి వున్న సమయం వచ్చింది. ఆ రోజు ఆదివారం, సాయంత్రం చీకటి పడుతోంది. బస్సు స్టాండు దగ్గరనుంచున్నాను. ఒక వృద్ధుడు బస్సు కోసం నిలబడి వున్నాడు. నేనూ ఆయన వెనుక చేరాను. జనం చాలా మంది వున్నారు. ఆయన జేబులో పొడుగాటి పర్సు బైటికి తొంగిచూస్తోంది. కనీసం రెండు, మూడు వందలన్నా వుండక పోతుందా అనుకున్నాను. బస్సు వచ్చింది. ఒకర్నొకరు తోసుకుంటున్నారు. ఆవృద్ధుని పర్సు కొట్టేశాను. ఆయన్ని తోసుకొని బస్సులో ఎక్కాను. ఆ రద్దీలో ఆవృద్ధుడు ఎక్కలేకపోయాడు. ఆయన జేబు ఎక్కడ వెతుక్కుంటాడోనని నా కళ్ళన్నీ ఆయన మీదే వున్నాయి. బస్సు మలుపు తిరుగుతుండగా ఆయన జేబు చూసుకుంటున్నాడు. ఇంక నా పని అయిపోయిందనుకున్నాను. బస్సు స్టాండు కెదురుగా పోలీసుస్టేషనుంది. ట్రాఫిక్ పోలీసు నన్నక్కడే చూచాడు కూడాను. వెంటనే టెలిఫోన్ వెళ్తుంది. ఇంక ఆలోచించేందుకు సమయం దొరకలేదు. బండి అడ్డంవస్తే బస్సు వేగం తగ్గింది. వెనక ఈలలు వినపడుతున్నాయి...దూకేశాను...సందుల గొందుల్లోంచి పోతున్నాను. నేను దిగిన బస్సుకదిలినశబ్దం మళ్ళీ నాకు వినిపించలేదు. పోలీసులు బస్సు ఆపినట్లు గ్రహించాను. ఇంక కొద్దిసేపట్లో నన్ను పట్టుకుంటారు. నాకేమీ తోచలేదు. నా ఆశలన్నీ భగ్నమయ్యేటట్లున్నాయి. నాకు మళ్లీ జైలుతప్పదు. అంత కష్టపడి సంపాదించిన డబ్బు మళ్లీ పోలీసుల చేతిలో పెట్టదల్చుకోలేదు. మలుపు తిరుగుతుండగా గుడ్డిపిల్లవు నువ్వు కనిపించావు. నువ్వా మలుపులో కూర్చుని అడుక్కోటం చాలా సార్లు చూశాను. అప్పుడు అక్కడ ఎక్కువ జనసంచారం కూడా లేదు. తళుక్కున నాకో ఆలోచన తట్టింది. వెంటనే పర్సుతీసి వంగినట్టువంగి, నీచంకనున్న సంచిలో వేశాను. సందుమూల ఒకబీడీ దుకాణముంటే దానిదగ్గర బీడీ కాల్చుకుంటున్నట్లుగా ఆగి చూస్తున్నాను. పోలీసులు వెళ్ళిపోగానే నీ దగ్గర్నుంచి ఆపర్సుని తీసుకెళ్ళి పోవచ్చు కదా అని ఆ సందులోంచి నేను కదల్లేదు. అదే పొరపాటయింది.

పోలీసులు నన్ను పట్టుకున్నారు. ఎన్ని కొట్టినా తియ్యలేదన్నాను. కొట్టి అప్పుడు విడిచి పెడతారనుకున్నాను. కాని అలా జరగలేదు. తన పర్సులో మూడు వేల రూపాయలున్నాయని ముసలాయన చెప్పాట్ట. నేను నమ్మలేక పోయాను. మూడు వేల రూపాయలతో నాజీవితమంతా గడిచిపోతుంది. అంతడబ్బుని నేనెవరో తెలియని ఒక గుడ్డిపిల్ల సంచిలో వేసినందుకు నన్ను నేను నిందించుకున్నాను. కనీసం ఆ పిల్లకు చెప్పనన్నా చెప్పపోతినే అని విచారించాను. ఇంకా ఆ డబ్బు నాకు దక్కదని నిర్ధారించుకున్నాను.

నాకీసారి, నేరం రుజువుకానందుకు అనుమానంమీద ఆరునెలలు కఠినశిక్ష వేశారు. ప్రభుత్వం ఒక చిన్న దొంగతనానికి మాకు యింత పెద్ద శిక్షలు ఎందుకు వేస్తారో తెలియదు. బ్లాకు మార్కెట్టులో ఒక్కసారి లక్షలు సంపాందించే పెద్దలకే శిక్షా లేదు...

ఈ సారి జైలుజీవితము మరీ దుర్భరమై పోయింది. ఎన్ని రోజులు శిక్ష గడిచిందో యింకా ఎన్నాళ్ళుందో కూడా నేను ఎంచుకోటం లేదు. నాతోటి జేబుదొంగలు మళ్ళీ కొత్త మెలకువలు నేర్పుకుందామని నన్ను ప్రోత్సాహపరచేవారు. కాని

★ గుడ్డి హృదయాలు ★

నాలో వుత్సాహం నశించింది. నా జీవితం ఎలాగడపాలో నాకే తెలియదు.

చివరకు నన్ను విడుదల చేశారు. ఈ జైల్లోంచి విడుదలైనాక నాకో గమ్యస్థానమంటూ లేకుండా పోయింది. కాని కాళ్లు మళ్ళీ యిక్కడికే యీడ్చుకొచ్చాయి.

జైల్లో నా ఆరోగ్యం చాలా చెడిపోయింది. దగ్గు వస్తోంది. అప్పుడప్పుడు చలి జ్వరం వచ్చేది. నువ్వు మళ్ళీ నాకు కనిపిస్తావన్న ఆశ వదులుకున్నాను. ఆ డబ్బు అందగానే నువ్వూ, నీతోటి వారు ఎక్కడికో పరారయివుంటారనుకున్నాను. అందువల్ల నిన్ను గురించి వెతకదల్చుకోలేదు.

ఈఊరు వచ్చాక మళ్ళీ జ్వరపడ్డాను. పదిహేను రోజులు. జైల్లో సంపాయించుకున్న డబ్బుల్తో మందుతీసుకున్నాను. ఇవ్వాళే కాస్త జ్వరం నెమ్మదించింది. మనస్సులో ఏదో ఆందోళన బయలుదేరింది. ఇంకా నువ్వు సందు మొదల్లోనే వున్నావేమోనని. నువ్వు సందు మొదట్లోనే వున్నావు. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. కుదిరింది. నువ్వు గుడ్డిపిల్లవు నీకు. కళ్ళు కనిపించవు. కళ్ళు లేకపోయినా, నీకు హృదయం వుంది. అయితే ఆపర్సు నీదగ్గరే వుందా?

"నాదగ్గరే వుంది?"

"నిజంగానా!"

"అవును నాగుండెల్లో దాచుకున్నాను. ఇక్కడ తీస్తే నలుగురూ చూస్తారు. అవతలకు పోయాక యిస్తాను. నాకివాళ చాలా సంతోషంగా వుంది."

"ఎందుకు?"

"ఇన్నాళ్ళకు నాగొమ్ములమీద బరువు దింపుకుంటున్నాను. ఆరోజు ఎవరో ఏదో వస్తువు నాసంచిలో పడవేశారు. ఏమిటా అని తడిమి చూసుకున్నాను. పర్సులోపల ఏముందో విప్పి చూడలేదు. ఈ డబ్బుసంచి ఎవరు వేశారో మళ్ళీ వారేవచ్చి తీసుకుపోతారనుకున్నాను. ఎవరికీ తెలియకుండా కాపాడుతూ వచ్చాను. ఇన్నాళ్ళకు నీవు వచ్చావు."

"నువ్వు దాంట్లో ఏమీ ఖర్చు పెట్టుకోలా?"

"లేదు; చాలాసార్లు ఆబుద్ధి పుట్టింది. కాని అపని చేయలేదు. ఒకరి సొమ్ముకు నేనాశపడలేదు. ఈ మధ్య నా అన్నకు పెద్దజబ్బు సింది. అతనొక్కడే నాకాధారం. చచ్చిపోతాడనుకున్నాను. అప్పుడుకూడా నేను తియ్యలేదు. ఆ డబ్బసలు నావద్దరలేదనే అనుకున్నాను. నా అన్న బ్రతికాడు."

"నిజంగా ఆ పర్సు నీదగ్గరేవుందా?"

"ఆ! ఏం నామాటమీద నీకు నమ్మకం కలగలేదా...యిదిగో చూడు!"

"ఆ! యిదే!...అవును...... నీదగ్గరే వుంచు. అప్పుడే యివ్వకు......పోలీసులు నన్ను మళ్ళీ పట్టుకుంటారు......తిరువాత తీసుకుంటా." "వద్దు. నేనీ బరువును మోయలేను. నీవస్తువు నీవు తీసుకెళ్ళు."

"బరువా యిది నీకు?"

"బరువుకాదూ...! ఇంకొకరి వస్తువు బరువుకాదా?"

"ఈ డబ్బుతీసుకుని మనిద్దరం యింకో ఊరుపోదాం వస్తావా? నాకూ నా అన్న వారెవ్వరూ లేరు."

"రాను."

"నాకొకందుకు ఆశ్చర్యంవేస్తోంది. గుడ్డిపిల్లవు, యింకొకరి ఆధారంలేకుండా బతికలేవు. అలాంటిదానివి నీదగ్గర యింత డబ్బుండికూడా దాంట్లో ఒక దమ్మిడీఅన్నా వాడుకోకుండా ఎలావుండగలిగావు? చివరకు నీ జీవితానికి ఆధారమైన నీ అన్నకు జబ్బుచేసినప్పుడు కూడా నీకందులోంచితీసి ఖర్చుపెట్టుకోవాలని అనిపించలేదా?"

"అనిపించింది. కాని ఆ కోరికను అణచుకున్నాను. ఇతరులెవరికో చెందిన యీడబ్బు పెట్టి మా అన్నకు మందిప్పిస్తే మా అన్న బ్రతకడేమోనని భయమేసింది. అదీగాక యీ ధనం యెవరిదో నాకీనాటికి కూడ అంతు తెలియలేదు. భగవంతుడే నన్ను పరీక్షచేయటానికని యీ విధంగా నాకు డబ్బుపంపి, మా అన్నకు వ్యాధిని సంక్రమింపచేశాడనుకున్నాను. నేను పరీక్షలో నెగ్గాను. చచ్చిపోతాడనుకున్న మా అన్న బ్రతికాడు. ఈ డబ్బు ఎవరికిచెందిందో వారికి తిరిగి యివ్వగలిగినందుకు నా మనస్సెంతో సంతోషంగా వుంది. 'లక్ష్మి' అనేది చంచలమైనది. ఇవాళ యిక్కడుంటుంది. రేపు ఎక్కడికో వెళ్ళిపోతుంది. కాని సంతృప్తనేది బ్రతికినన్నాళ్ళు నిలిచిపోతుంది."

"నిజమే! డబ్బు స్థిరమైనది కాదు. సంతృప్తే శాశ్వతం. ఈ నిజం నాకీనాడు తెలిసింది. ఇప్పుడే వస్తాను. ...యిక్కడే వుండు...ఏదీ...ఆ పర్సు యిటు తే..."

"ఏంచేస్తావు?"

"ఇది ఎవరిసొమ్మో వారికి అప్పచెప్పి వస్తాను. ఇంతకన్నా జీవితంలో చేయతగ్గ మహత్కార్యంలేదు. దీనివల్ల మంచిపని ఒకటైనా చేయగలుగుతున్నాను గదాయని సంతృప్తి, నూతనోత్సాహం నాకు కలుగుతున్నాయి. నేనిప్పుడే తిరిగివస్తాను. మనిద్దరం కలిసి ఎక్కడికైనా వెళ్ళిపోదాం. కొత్త జీవితం ప్రారంభిద్దాం. జీవితంమీద ఆశ, బతకగలనునే ధైర్యం నాకీనాడు చేకూరింది. నా గుడ్డిహృదయానికి నీవు జ్ఞాననేత్రాలిచ్చావు." ★

వనితాలోకం

★ మహిళా సమస్యలు ★

స్త్రీల వారసత్వం విషయమైన వ్యాజ్యంలో 1956 సంవత్సరం స్త్రీల వారసత్వ చట్టం ప్రకారము స్త్రీలకు సంపూర్ణహక్కులు సంక్రమించినట్లు తీర్పునిచ్చే అవకాశం ప్రప్రథమంగా మద్రాసు రాష్ట్రానికి దక్కింది. పూర్వం నిస్సంతుగాను, అవిభాజ్యంగాను, విల్లు వ్రాయకుండాను భర్త గతించినట్లయితే ఎక్కడెక్కడి తరతరాల నాటి వారసులు ఆ స్త్రీ ఆస్తిని కబళించడానికి నోళ్లు తెరుచుకొని బిలబిల లాడుతూ వచ్చి పడేవాళ్లు. ఆ వ్యాజ్యాలు ఏండ్లూ పూండ్లూ జరిగేవి. ఆ వ్యాజ్యాలు ఫైసలయ్యేటప్పటికి ఆ ఆస్తి లేకపోగా ఈ స్త్రీ ఒంటిమీద ఉన్న నగా నట్రా గూడ వ్యాజ్యపు ఖర్చుల క్రింద నాశమయ్యేది. ఒక్కొక్కప్పుడు ఈ స్త్రీకి తోడ్పడవచ్చిన పుట్టింటివారి ఆస్తి గూడా దీనిలో ఆహుతి అయ్యేది. పర్యవసానం ఈమెకు భరణము, ఆస్తి దాయాదులకు, ఇక నేమున్నది? మనోవృత్తితో మనుగడ వెళ్లిపోతుందా? వంటలు చేసుకోడమో, మంచినీళ్లు మోసుకోడమో, లేదా పుట్టింట పడిఉండి వదినె మరదళ్ల దగర చీవాట్లు తింటూ చాకిరీ చేయడమో జరుగుతూ ఉండేది. ఆస్తిలేనివాళ్లకు లేనేలేదు, ఉన్నవాళ్లయినా తినకుండా దాయాదులిట్లా ముప్పతిప్పలు పెట్టేవాళ్లు. ఈ నాటితో యుగయుగాలుగా హిందూ స్త్రీలను పీడిస్తున్న ఈ శని విరగడైపోయింది. ఇప్పుడు ఈ 1956 సం॥ చట్టంవల్ల భర్త ఆస్తికి స్త్రీకే హక్కు. భర్త గతించిన స్త్రీ సంతానము కలదైతే వారితో సమాన భాగస్తురాలు. సంతానము లేకపోతే దానాదమన విక్రయాది సర్వహక్కులు ఆమెవే. మద్రాసురాష్ట్రంలో కమలమ్మాళ్ అచ్చి అనేఆమెకు భర్త పోయినాడు. ఆమె భర్త సోముచెట్టియార్‌కు వెంకటాచలం చెట్టియారు అన్నకొమారుడు. పినతండ్రిపోగానే వెంకటాచలం చెట్టియార్ తన పినతండ్రి భార్యఅయిన కమలాఅచ్చికి భర్త ఆస్తి పూర్తిగా చెందరాదనీ అందులో తనకు భాగం రావలెననీ మయూరం సబార్డినేట్ జడ్జీ కోరులో దరఖాస్తు పెట్టాడు. జడ్జీ ఆ దరఖాస్తు త్రోసివేశాడు. దానిపై వెంకటాచలంచెట్టియారు మద్రాసు హైకోర్టులో అప్పీలుచేశాడు. 1956 హిందూ వారసత్వ చట్టం అమలులోకి వచ్చిఉన్నందువల్ల ఇక ఇట్టి అప్పీళ్లకు అవకాశంలేదంటూ న్యాయమూర్తులాఅప్పీలు త్రోసివేశారు. న్యాయమూర్తులాఅపీలును త్రోసివేస్తూ తీర్పులో పేర్కొన్న విషయాలు ప్రస్తుత చట్టము యొక్క స్వరూపాన్ని చక్కగా విశదం చేస్తున్నాయి. ఆ అంశములు ఆంధ్రదినపత్రికలో ఇట్లా ప్రకటింపబడినాయి.

"1956 హిందూ వారసత్వచట్టం ప్రస్తుతము అమలులో ఉన్నది. ఇందువల్ల యిటువంటి అప్పీళ్లకు అవకాశంలేదు. ఈచట్టం అమలులోకి రాకపూర్వమైనా వచ్చిన తరువాతనైనా సంక్రమించే ఆస్తిపై హిందూ స్త్రీ పూర్తిహక్కులను కలిగిఉంటుందే కాని ఆమె ఆస్తిలో వాటాదారుమాత్రం కాదు. వారసత్వం, పంపకం, భరణం, బహుమానం వీటిలో ఏ రూపంగా ఆస్తి ఆమెకు వచ్చినా, వివాహం కాకపూర్వం కాని, అయినతరువాత కాని ఏ రీతిగా వచ్చినా ఆమె పూర్తి హక్కు భుక్తాలు కలిగిఉంటుంది. స్థిరచరాస్తులు రెంటికీ ఈ నిబంధన వర్తిస్తుంది. ఈచట్టం అమలులోకి వచ్చేముందు ఉన్న స్త్రీధనాలకు గూడా యీచట్టం వర్తిస్తుందని న్యాయమూర్తులు స్పష్టంగా పేర్కొన్నారు. న్యాయస్థా

"ఉత్తర"

★ మహిళా సమస్యలు ★

వాళ్లో పని తప్పక చేయడానికి అవకాశంగా తెచ్చే వివాదాలకు స్థానంలేకుండా చేయడానికే ఈనిబంధన చేసినట్లు చట్టంలో వివరించారు. ఇక ఇలాంటి అభియోగాలు జరగడానికి అవకాశంలేదు. ఈచట్టం అములులోనికి వచ్చేముందు హిందూ న్యాయశాస్త్రానికి సంబంధించి అమల్లో ఉన్న చట్టాలు, సంప్రదాయాలు అన్నీ రద్దు అవుతాయనీ ఈచట్ట నిబంధనలతో భేదించి యింకా అమలులో ఉన్న చట్టాలు హిందువులకు వర్తించవనిగూడా హిందూ వారసత్వచట్టం నాల్గవభాగంలో స్పష్టంగా వివరించారు. ఇందువల్ల భర్తఆస్తిపై శ్రీమతి కమలాఅచ్చికి పూర్తిహక్కులు సంక్రమిస్తున్నాయి. ఇలాంటి ఆస్తులలో వారసులకు ఏలాంటి హక్కులున్నా ఈచట్టము అమలులోనికి వచ్చినతరువాత అవి యెంతమాత్రము చెల్లవు. అని న్యాయమూర్తులు చెప్పారు. అందువల్ల కమలాఅచ్చి భావగారి కుమారుడైన వెంకటాచలం చెట్టియారు అప్పీలు త్రోసివేయబడింది."

ఈ చట్టం హిందూస్త్రీలకు వరప్రసాదమని చెప్పాలె. అనేక సంవత్సరాలుగా దాయాదులవల్ల హిందూ వితంతువులు అనుభవిస్తున్న పలువిధకష్టాలు నేటితో తొలగిపోయినవి. స్వతంత్ర భారతవర్షం స్త్రీలకిట్టి మహోపకృతి చేసినందుకు స్త్రీలు కృతజ్ఞతాపూర్వక వందనాలు హృదయపూర్వకంగా సమర్పిస్తారు.

* * *

అన్నవస్త్రాల ధరలు అంతకంతకు మిన్నంటిపోతున్నాయి అతివృష్టి అనావృష్టి దోషములు, యుద్ధాది ఉపద్రవములు లేకుండానే యీ ధరలిట్లా ఎందుకు పెరిగిపోతున్నవో తెలియడంలేదు. ధరలెంత హెచ్చిపోతున్నా భాగ్యవంతులకూ యిబ్బందిలేదు, పేదవాళ్లకూ యిబ్బందిలేదు. మధ్యతరగతి కుటుంబాలవాళ్లే అన్నివిధాల నలిగి మూర్ఛపోతున్నారు. ఇంట్లో సంపాదించేవాడు ఒక్కడైతే తినేవాళ్లు పదిమంది ఎనిమిదిమంది ఉంటారు. వృద్ధులైన తలిదండ్రులు, నిరుద్యోగియైన తమ్ముడు, అధీనం తప్పిన తోబుట్టువు, పెండ్లి కావలసిన కూతురు, పైచదువులు చదవవలసిన కొడుకు, పోతపాలు త్రాగే పసిబిడ్డ, సామాన్యంగా సాధారణ కుటుంబాలు ఇట్లా ఉంటాయి. ఈ గంపంత సంసారం యీదవలసిన వాడు ఒక గుమాస్తాయో, బడిపంతులో అయిన సామాన్య సంపాదనాపరుడు. 'గోచీకి గొప్పది తలపాగాకు చిన్నది', అన్నట్టున్న యీ సంపాదనలో ఈ మధ్యతరగతి కుటుంబీకుడు తనకుటుంబమును ఎట్లా పోషించగలుగుతాడు? కనుకనే మధ్యతరగతి కుటుంబ స్త్రీలు తమ కాయకష్టంచేత కుటుంబాదాయమును పెంచి మగవానికి చేయూతనివ్వవలెనని నినాదం సర్వత్రా బయలుదేరింది. కాని ఈ నినాదం వినిపించుకుంటున్నవాళ్లు కనిపించడంలేదు. ఏమిచేస్తే తమ గౌరవానికి హానికలుగుతుందో, తమరిని సాటివారు న్యూనతగా చూస్తారో అని ఈ గృహిణులకు మాచెడ్డభయం. అందువల్ల మానసానికి క్రుంగిపోతుంటారు. ఈ సంసారపు లేమివల్ల యీ మధ్యతరగతి కుటుంబ స్త్రీలు పడుతున్న మూగబాధ వర్ణనాతీతం. కాని యీ బాధానివారణకు వారేమీ చేయలేకుండా ఉన్నారు. వీరి కష్టాలు పోవాలంటే కాయకష్టానికి సాహసించాలె. ఈ విషయంలో ఈ మధ్యతరగతి స్త్రీలకు సంపన్న కుటుంబినులు చేయవలసిన సహాయమెక్కువ ఉన్నది. అదేమంటే వారు ముందుగా కాయకష్టానికి పూనుకొని సామాన్య కుటుంబినులకు మార్గదర్శినులు కావాలె. అట్లాచేసినట్లయితే అంత డబ్బుగల ఆమే ఈపని చేస్తుంటే మనం చేస్తే తప్పేమున్నదని సామాన్య కుటుంబినులు భావించి తాము గూడా చేయడానికి ఒడబడుతారు.

స్త్రీలు యింటియందుండి చేయతగిన పనులెన్నో ఉన్నవి. తిలకము; కాటుక, కుంకుమ, పండ్లపొడి, నలుగుబిండ్లు, అప్పడములు, వడియములు, సేమియాలు, తలనూనెలు, లేసుపనులు, ఎంబ్రాయిడరీపనులు విస్తళ్లు, పసిబిడ్డల మందులు, చేతిగుడ్డలు, పిల్లల గౌను చొక్కాలు, పచ్చళ్లు మొదలైనవి ఎన్నో ఉన్నవి ఇవి స్త్రీ సంఘాల్లో గృహపరిశ్రమలశాఖ నెలకొల్పి వారిచేత పనులుచేయించి విక్రయబాధ్యత తాము తీసుకొన్నట్లయితే సులభంగా విడుదలచేయవచ్చును. అనేకమంది చేతిపనులు చేయగగ్గి ఇవి అమ్ముడుపోయే సౌకర్యంలేక నిరుత్సాహపడుతున్నారు. స్త్రీ సమాజములు ఈపని చేస్తే వీనిని సులభంగా విడుదలచేయవచ్చును. ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో ప్రభుత్వము ఈ గృహపరిశ్రముల శాఖకు చేయూత నివ్వనున్నారని తెలుస్తున్నది. ఇది చాలా సంతోషకరమైన విషయము. ఆంధ్ర సోదరీమణులు ఈ అవకాశమును వినియోగించుకొని కుటుంబాదాయమును పెంపుచేసికొన్నట్లయితే తమ సంసారములను సుఖవంతములుగా చేసికొనకలుగుతారు. ★

★ ఆఖరు ఘడియల్లో ఆప్తులు ★

(27 వ-పేజీ తరువాయి)

జరగవల్సింది యెలాగూ జరుగుతుంది.

సుంద: (దుఃఖంతో) ముందుగా వీలునామాఅయినా రాసిపుంచారు కాదు. యిప్పుడేం ప్రమాదం జరిగినా, యింత ఆస్తీ మీ అన్నయ్యకే దక్కుతుంది...అసలు, వాడిప్పుడు ఆ ఆశమీదే వచ్చాడు. లేకపోతే తండ్రిమీద అంత అభిమానం యెక్కడుంది?

శారద: ఇప్పుడు వీలునామా రాయడానికి వీల్లేదా అమ్మా?

సుంద: మనిషి పెదాలు కదపకపోతే యింకా రాయించటం యేమిటి? అంతా నా దురదృష్టం తల్లీ! 'నాది' అంటూ యేపాటి ఆస్తి వున్నా, నాకేం మహారాజులా బ్రతికేదాన్ని.

శారద: ఆ విషయంలో నువ్వు బాధపడకమ్మా! అన్నయ్య యెవడికోసం నిన్ను ఆదరిస్తాడు? అక్కడే తిష వేద్దువుగాన్లే. ఏమంటాడో నేనూ చూస్తాను.

[ఎడమ వేపునుండి ఆత్రుతతో బ్రహ్మం వస్తాడు.]

బ్రహ్మ: (గాభరాగా) అత్తయ్యా!... శారదా!...మావయ్య అదోలా ఆయాసం పడుతున్నారు...అదేమిటో భయంగా వుంది...డాక్టరు తెల్లమొహం వేశాడు... రండి...రండి! (వచ్చినవేపే వెళ్తాడు).

[సుందరమ్మ, శారద ఆతురతగా, కళ్లు ఒత్తుకుంటూనే యెడమవేపు పోతారు. స్టేజి ఖాళీగా వుంటుంది ఓ నిమిషం...వెనకనుండి ఒక్కసారి పెద్ద స్థాయిలో యేడుపులు వినిపిస్తాయి కొద్దిసేపటికి డాక్టరు భారంగా అడుగులు వేసుకుంటూ సేజిమీదినుండా కుడివేపు పోతాడు.]

(తెర)

బాల సాహిత్య

స్వార్థపరులు

వజ్రపాణి

ఒక సాయంత్రపు వేళను
ఒక యూరి స్మశానములో
ఒక బాలుని శవము చుట్టి
సకల బంధువులు నేడ్వగ—

వచ్చె నచటి కొక్క గ్రద్ద.
అచ్చట చీకటిపడుచో
తనకు కనులు కనిపించవు
కనుక ఇట్లు ప్రవచించెను :

"ఇది మీకు విచారకరము
కదః ఐనను త్వరగ పొండు!
చీకటిలో పిశాచములు
వ్యాకులతను కలిగించును!"

బంధువు లిక వెడలిపోవ
పాపముః సన్నాహపడిరి;
గ్రక్కున బాలుని తినుటకు
గ్రద్ద మిగుల సంతసించె!

అంతలో నెచటినుండియొ
అట కొక జంబుకము వచ్చె!
పగలు గ్రద్ద కనుకూలము!
రాత్రి నక్క కనుకూలము!

చీకటిపడువఱకు బంధు
వులను నిలపదలచె నక్క!

"ఇంత ముద్దులొలుకు బిడ్డ
నెటుల విడిచిపోవగలరు?
చాల ప్రొద్దు కల దింకను!
సావధానముగ నేడ్వుడు!"

అని చెప్పిన నక్క నుడువు
లాలించిన గ్రద్ద పలికె:


"నక్క జిత్తు లెఱుగరొకో!
చిక్కులలో పడద్రోయును!
మరణించినవా రెందును
మరల బ్రతుకు టెఱుగుదురా?"

నక్క ఇటుల చెప్పసాగె:
"టక్కరి దీ ముసలి గ్రద్ద!
భగవంతుని ప్రార్థింపుడు -
బాలుడు బ్రతుకనువచ్చును!"

"పొం"డని వాదించు గ్రద్ద!
"పోవల"దని పలుకు నక్క!
మృతబాలుని బంధుకోటి
స్తుతియించిరి మహాశివుని!

స్తుతికి శివుడు కరుణించెను!
మృత బాలుని బ్రతికించెను!
జంబుక గృధ్రములు కడు ర
యంబున పారిపోసాగె!

★





జరిగిన కథ :—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకలకది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడాని- నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సిల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ ఆమహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగు కనిపించింది. ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్ళవర్షం కురిపించారు. అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా, కాన్సెల్ నెడ్‌లాండులతో కలిసి ఒక జలాంతర్గామిలో ప్రవేశిస్తాడు. కొంతసేపటికి ఓడనావికులు వారికి సుష్టుగా భోజనం పెడతారు. తిరిగీ తమ కన్నపావాలు రాలేదని అంతా మథన పడుతూంటే వారికి హఠాత్తుగా జలాంతర్గామి అధికారి హెచ్చరిక వినిపిస్తుంది. కెప్టెన్ నీమో ఇక ఆ ఓడలోనించి ఎవరు బయటపడలేరనిచెప్పి ప్రొఫెసరు అరోనాకు జలాంతర్గామి యంత్రాల రహస్యాలు తెలియజేస్తాడు. కెప్టన్ నీమో జలాంతర్గామి నడిపించేపద్ధతి అంతా ప్రొఫెసర్ అరోనాకు తెలియజేస్తాడు. పిమ్మట జలాంతర్గామి కిరువైపులా తెరుచుకున్న అద్దాలలోనించి అద్భుతమైన సాగరగర్భ జలచరాలు కనిపిస్తాయి. ఆ తరవాత జలాంతర్గామి సాగరగర్భంలోని క్రెస్పో ద్వీపానికి బయలుదేరుతుంది. తరవాత సాగరగర్భంలో క్రెస్పోద్వీపంలో వేట జరుగుతుంది. జలాంతర్గామి వానికారో ద్వీపంమీదుగావెళ్లి గిలోప్బవాద్వీపానికి సమీపంలో నిలబడుతుంది. అరోనా అనుచరులతో కలిసి ఆ ద్వీపంలో ప్రవేశిస్తాడు. ముగ్గురు గిలోప్బవాద్వీపంలో వేట ముగించుకొనివస్తూండగా హఠాత్తుగా ఒకరాయి వారిదగ్గర పడుతుంది.

20. కెప్టెన్ నీమో వజ్రాయుధం

నేనా రాయి అక్కడ ఎలాగ పడిందా అని ఆశ్చర్యపోతూ నాలుగు వైపులా చూశాను.

"ఇంత రాయి ఆకాశంనించి ఎలాగ పడుతుంది?" అన్నాడు కౌన్సెల్.


అనువాదం: "వినాయక"

అంతలో ఇంకొక రాయి కౌన్సెలుకు బాగా దగ్గిరిగా వచ్చిపడింది.

ఇక లాభం లేదని మేంముగ్గురం తుపాకులు చేతులతో పట్టుకుని నిలబడ్డాము.

"ఒకవేళ కోతులా బెడ్డలు విసిరాయేమో!" అన్నాడు నెడ్.

"కోతుల్లాంటి అడివి మనుషులెవళ్లో అయిఉంటారు." అన్నాడు కౌన్సెల్.



అడవి మనుష్యులు జలాంతర్గామిమీద తిరుగుతూ బాగా సందడి చేస్తున్నారు.
“ట్వెంటీ థౌజండ్ లీగ్స్ అండర్ ది సీ”లో జలాంతర్గామి దృశ్యం.

“అంతా గబగబా నావకేసి పరిగెత్తండి!” అన్నాను. మేము వెంటనే కాలికి బుద్ధి చెప్పవలసిన అవశ్యకత ఏర్పడింది.

హఠాత్తుగా మా కొక నూరడుగుల దూరంలో విల్లమ్ములు చేత్తో పట్టుకొన్న ఆటవికులు ప్రత్యక్షమైనారు.

నావ ఇంకా మా కొక 60 అడుగుల దూరంలో ఉంది.

ఆ అడవిమనుష్యులు మామీద రాళ్ల వర్షం కురిపించారు.

ఎలాంటి ఆపత్తులో ఉన్నా నెడ్ లాండ్ తన చేతులో ఉన్న ఆహార పదార్థాలు విడిచిపెట్టదలుచుకోలేదు.

ఒక చేత్తో ఒక జంతువునూ, ఇంకొక చేత్తో కాంగరూలను పట్టుకొని గబగబా పరిగెత్తడం మొదలు పెట్టాడు.

రెండు నిముషాల్లో సముద్ర తీరం దగ్గిరికి చేరుకొన్నాము. గబగబా మా ఆయుధాలు, సంపాదించిన ఆహారపదార్థాలు నావలో పడవేసి మేమంతా నావలో ప్రవేశించాము. వెంటనే తెడ్లు వెయ్యడం మొదలుపెట్టాము.

అంతలో ఒక వందమంది ఆటవికులు పెద్దగా కేకలు పెడుతూ సముద్రంలో ప్రవేశించారు. అలాగ కేకలు పెడుతూ గుండెలోతు నీళ్ళలో ప్రవేశించారు. కాని అప్పుడైనా జలాంతర్గామిలో ఉన్న జనం వాళ్ళరాక గుర్తిస్తారేమోనని అనుకున్నాను.

కాని అలాంటి ఆశ ఏమీ కనిపించలేదు. మేము తొందరగా మా నావ దిగి జలాంతర్గామిలో ప్రవేశించాము.

నేను లోపలికి వెళ్లేసరికి కెప్టెన్ నీమో హాయిగా పిడేలు వాయిస్తూ కూర్చున్నాడు.

“కెప్టెన్!” అని పలకరించాను.

అతడు నా మాట వినిపించుకోలేదు.

తరవాత నే నతని చెయ్యి పట్టుకొని గట్టిగా పలకరించాను.

“ఓహో! మీరా! కులాసాగా తిరిగివచ్చారా?” అన్నాడు కెప్టెన్.

“కులాసాగానే తిరిగి వచ్చాము గాని దురదృష్టవశాత్తు కొంతమంది

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

అడివి మనుష్యులను కూడా వెంట బెట్టుకొని వచ్చాను."

"అడివి మనుష్యులా?"

"అవును!"

"ఇక్కడే అన్నమాటేమిటి? ప్రపంచంలో ప్రతిదేశంలోను, ప్రతిచోట అడివిమనుషులుండనే ఉన్నారు."

"బాగానే ఉందిగాని వాళ్ళంతా లోపల ప్రవేశించకుండా మీరు గట్టి జాగ్రత్త తీసుకోవాలి."

"వాళ్ళంతా ఏమాత్రం మంది ఉంటారు?"

"ఇంచుమించుగా ఒకవందమంది దాకా ఉంటారు."

కెప్టెన్ నీమో మళ్ళీ తన ఫిడేలు తీగలమీద వేళ్లు నడిపించుకుంటూ నెమ్మదిగా ఇలాగన్నాడు:

"ఎంతమంది వచ్చినా సరే! మన జలాంతర్గామి కేమీ భయంలేదు."

కెప్టెన్ అలాగన్నతరవాత మరి భయం ఏమీ ఉండదన్న భరవాసాతో నేను మాట్లాడకుండా నా గదిలోకి వెళ్లి పడుకొన్నాను.

ఆ రాత్రి అంత పెద్ద ప్రమాదమేమీ జరగలేదు. ఆటవికులంతా జలాంతర్గామి స్వరూపం చూచి బెదిరిపోయారేమో!

అయితే మరునాటి ఉదయానికి ఆటవికుల సంఖ్య బాగా పెరిగిపోయింది.

ఆ ఆటవికులంతా పిడిరాళ్ళలాగున్నారు. వాళ్ళవి పెద్ద పెద్ద చప్పిడి ముక్కులు. చెవులలో ఎముకలతో చేసిన పెద్ద పెద్ద నగలు వేలాడుతున్నాయి. ఆ అడవి మనుషులంతా చాలావరకు నగ్నంగానే ఉన్నారు. వారిలో కొంతమంది స్త్రీలుకూడా ఉన్నారు. అడివి మనుష్యుల నాయకులు కొంతమంది చిత్రచిత్రమైన గాజుపూసలదండలు వేసుకొన్నారు. ఇంచుమించుగా అందరిచేతులలోను, బల్లాలో, విల్లమ్ములో ఉన్నాయి.

ఆ ఆటవికుల నాయకులలో ఒకళ్ళిద్దరు అతి జాగ్రత్తగా మా జలాంతర్గామి పరిశీలిస్తున్నారు.

నేను వాళ్లను గురిచూచి తుపాకి కాల్చాలని అనుకొన్నానుగాని ముందుగా తొందరపడడం మంచిది కాదని మాట్లాడ కూరుకున్నాను.

క్రమ క్రమంగా ఆ అడవి మనుషులంతా జలాంతర్గామి దగ్గరగా రావడం మొదలుపెట్టారు. కాని అంతవరకు వాళ్లు పెద్ద గొడవేమీ చెయ్యలేదు.

తరవాత 11 గంటలయ్యేసరికి ఆటవికులంతా సముద్రతీరానికి మరలిపోయారు.

ఇంతలో కౌన్సెలు సముద్రంలోనికి వలలు విసిరాడు. ఆ వలలో చిత్రచిత్రమైన శంఖాలెన్నో పడ్డాయి. అందులో ఒక శంఖం సుడి ఎడమపక్కనించి కుడిపక్కకి తిరిగింది. అది చూచి మేమెంతో ఆశ్చర్యపోతూంటే ఒక్క పెద్దరాయి దానికి తగిలి అది ముక్కలు ముక్కలైపోయింది.

అంతలో కౌన్సెలు తన తుపాకీ ఎక్కుపెట్టాడు గాని నేను వద్దన్నా వినలేదు. తుపాకీ గుండు దూరంలో నిలిచిన అడివిమనిషి చేతికి తగిలించుకున్న ఎముకల దండకడియాలన్నీ పిప్పిపిప్పి చేసివేసింది.

అంతలో ఆ ఆటవికుల నాయకులు జలాంతర్గామి దగ్గరగా వచ్చి దానిమీద రాళ్లవర్షం కురిపించారు.

నేను వెంటనే కెప్టెన్ నీమో దగ్గిరికి వెళ్ళిపోయాను. ఆ వృత్తాంతం అంతా కెప్టెన్ నీమోతో చెప్పివేశాను.

కాని కెప్టెన్ నీమో ఏమీ చెక్కు చెదరలేదు. వెంటనే గాలి లోపలకు తీసుకునే కిటికీలు మూయించి వెయ్యవలసిందని ఆజ్ఞాపించాడు.

"మీరు రేపుదయమే మళ్ళీ జలాంతర్గామిలోపలికి గాలి తీసుకోవాలిగదా!"

కెప్టెన్ ఆ మాటకు కూడా చలించలేదు:

"అల్లాగే తీసుకుంటాం దానికేమి?" అన్నాడు.

"రేపా అడవి మనుషులు జలాంతర్గామిమీదికి వచ్చినప్పుడు వాళ్లు లోపలికి రాకుండా మీ రెలాగ అడ్డుకోగలరు?"

"అయితే వాళ్ళు రేపు జలాంతర్గామి లోపలికి వస్తారంటారా?"

"తప్పకుండా వచ్చితీరతారు."

"రానీయండి! దాని కింత కంగారెందుకు? పాపం వాళ్ళకి నేనేమీ ప్రాణాపాయం కలగనివ్వను లెండి!"

ఆతరవాత నేనక్కడనించి వెళ్లిపోదామనే అనుకొన్నాను. గాని కెప్టెన్ నన్నక్కడినించి కదలనివ్వలేదు.

జలాంతర్గామి ఒడ్డెక్కిపోయిన తరుణంలోనే ఆ ఆటవికుల ఆపత్తొకటి వచ్చిపడిందనీ జలాంతర్గామి చాలా పెద్దఆపత్తులో చిక్కుకొన్నదనీ అన్నాను.

కెప్టెన్ నీమో ఆమాటకుకూడా జంకలేదు. గంభీరంగా ఇలాగన్నాడు:

"రేపు రెండూ నలభైనిమిషాలకు సముద్రానికి బాగా పోటు తగులుతుంది. వెంటనే ఎక్కడా చెక్కుచెదరకుండా నాటిలస్ బయలుదేరి వెళ్ళిపోతుంది."

తరవాత నేను నా గదిలోకి వెళ్ళి సుఖంగా నిద్రపోవాలని ప్రయత్నించాను గాని అంత బాగా నిద్రపట్టలేదు. అడివి మనుష్యులు జలాంతర్గామిమీద తిరుగుతూ బాగా సందడిచేస్తున్నారు. అయితే నావికులెవరూ కంగారుపడినట్లు కనబడలేదు. ఆటవికులంతా చేసే సందడి వారిని చీమలు పాకినట్లంతగానైనా కంగారుపెట్టలేదు.

మర్నాడు ఆరుగంటలయ్యేసరికి నేను నిద్ర మేల్కొన్నాను. మధ్యాహ్నందాకా నేను నా పనిలో మునిగిపోయాను. అంతవరకు మళ్ళీ కెప్టెన్ నీమోను చూడడం జరగలేదు. 2–35 నిమిషాలయేసరికి కెప్టెన్ నీమో మళ్ళీ ప్రత్యక్షమయాడు:

"మనం వెంటనే బయలుదేరిపోతున్నాము" అన్నాడు.

"నిజంగానే!" అన్నాను.

"గాలి కిటికీలు తెరవవలసిందని ఫర్మానా జారీచేశాను."

"మరి ఆ అడవిమనుషుల మాట?"

కెప్టెన్ బాగా వెటకారంగా భుజా లెగరవేశాడు.

"వాళ్ళంతా జలాంతర్గామి లోపలికి వచ్చివేస్తే?"

"ఎలా వస్తారు?"


"మీరు తెరిచి ఉంచిన కిటికీలగుండా."

"ప్రొఫెసర్! తెరిచి ఉంచినా సరే! ఆ కిటికీలగుండా లోపలికి రావడం మాటలతో పనిగాదు."

నేనా సమాధానంవిని నిర్ఘాంతపోయాను.

"అయితే నేను చెప్పిందు

(56-వ పేజీ చూడండి)



న్యాయం

ఇద్దరు అన్నదమ్ములు కలిసి ప్రయాణం సాగిస్తున్నారు; ఒకడు పేదవాడు—రెండోవాడు కలిగినవాడూను. ఇద్దరికీ గుఱ్ఱాలున్నాయి, పేదవాడికి ఆడదీ, భాగ్యవంతుడికి మగగుఱ్ఱమూ! దారిలో చీకటి పడగా నిద్రకోసం మజిలీ చేశారు.

ఆ రాత్రే పేదవాడి గుఱ్ఱం పిల్లనుపెట్టింది. గుఱ్ఱపుపిల్ల దొర్లుకుంటూ భాగ్యవంతుడి బండికిందికి చేరింది. మర్నాడు తెల్లారగానే భాగ్యవంతుడు పేదవాడిని నిద్ర లేపుతూ అన్నాడు. 'చూడరా భాయీ, నా బండి రాత్రి గుఱ్ఱం పిల్లను పెట్టింది.'

పేదవాడు లేచి కళ్ళు నులుముకుంటూ 'బండి గుఱ్ఱం పిల్లను పెట్టడమేమిటి? నా గుఱ్ఱం యీని వుంటుంది' అన్నాడు.

'నీ గుఱ్ఱమే యీనినట్లయితే, యీ పిల్ల దాని ప్రక్కనే వుండాలి కదా!'—ఈ ప్రకారం యిద్దరూ వాదులాడుకుని న్యాయస్థానానికి వెళ్లారు. భాగ్యవంతుడు జడ్జీలకు డబ్బు చూపాడు. పేదవాడికి నిజం తప్ప మరో వాంగు లేదు.

చిట్టచివరకు ఈ వాదు, ప్రభువు దాకా వెళ్ళింది. ప్రభువువారు అన్నదమ్ము లిద్దర్నీ పిలిచి వాళ్లకు నాలుగు సమస్యలిచ్చారు—"బాగా బలిష్ఠమయినదీ, వేగంకలదీ ఏమిటి? బాగా లావయిన దేమిటి? మాంచి మృదువయిన దేమిటి? ప్రపంచంలో కల్లా ప్రియమైన దేమిటి?"

వీటికి జవాబులు చెప్పడానికి మూడు రోజులు గడువిచ్చారు. నాలుగోనాడు వొచ్చి యిద్దర్నీ తమ తమ జవాబులు చెప్పమన్నారు.

'విరించి'

భాగ్యవంతుడు కాసేపు ఆలోచించి, తన భార్యదగ్గరికి వెళ్ళాడు. ఆమె యితన్ని కూర్చోమని 'యేమిటది, విచారంగా వున్నావు?' అని అడిగింది. ప్రభువువారు యిచ్చిన నాలుగు సమస్యలూ భార్యతో చెప్పాడు ధనికుడు.

'యివీ ఒక సమస్యలేనా, జవాబులు చెబుతాను చూడు, బలిష్ఠమయిందీ, వేగంకలదీనా—యింకేమిటి నీ గుఱ్ఱమే-దానికో కోలదెబ్బ యిస్తే ఒకటే దౌడుతీస్తుంది. ప్రపంచంలోకల్లా లావయినదా-మన దగ్గరున్న రెండేళ్ల పంది! అది చూడు ఎంత లావుందో, నించోలేదు కూడన్నూ-మెత్తనిది...పక్షియీకల పరుపు! అంతకన్నా యింకమెత్తగా వుంటుంది కనక? చూచావా-పోతే యిక నాలుగోది ప్రపంచంలోకల్లా ప్రియమైనది—మన మనమడే నయ్యా, మరేమీ కాదు...'

'మంచులా విడిపోయింది సమస్య' అని భాగ్యవంతుడు మహా సంతోషించాడు.

ఇక బీదవాడు విచారంగా యింటికి చేరుకున్నాడు. గుమ్మంలో ఎదురైంది ఏడేళ్ల కూతురు—అతని కుటుంబమల్లా యీ పిల్లే-అడిగింది. 'ఏమిటి నాన్నా, విచారం?'

బీదవాడు చెప్పాడు.

'ఆ సమస్యలేమిటో చెప్పు'

'బలిష్టమయినదీ వేగమయినదీ యేమిటి?'

'గాలి-గాలి అని చెప్పు నాన్నా!' అన్నది కూతురు.

'లావయిన దేమిటి?'

'మట్టి'

'మృదువయినది?'

'మానవుడి చెయ్యి-ఎంచేతంటే ఎక్కడ పడుకున్నా చెయ్యి తల కింద పెట్టుకుంటే హాయిగా వుంటుంది-',

'ప్రియమైనది?'

'నిద్ర-'

నాలుగోనాడు అన్నదమ్ములిద్దరూ ప్రభువారిదగ్గరికి వెళ్లారు. జవాబులు విన్నాక ప్రభువు బీదవాడి నిలా ప్రశ్నించారు-'ని అంతట నువ్వే జవాబులు తెల్సుకున్నావా లేక ఎవరయినా చెప్పారా?'

'అయ్యా, నాకొక యేడేళ్ళ కూతురున్నది. అదే యీ జవాబులు నాకు బోధపరిచింది-'

'ఆ! నీ కూతు రంత తెలివిగల

దయితే—యిదిగో యీ సిల్కు దారం తీసుకపోయి, నాకు తెల్లారే టప్పటికి చక్కటి జేబురుమాలు నేసి పట్టుమ్మను-' అన్నారు ప్రభువువారు.

బీదవాడు సిల్కుదారం తీసుకుని కుంగిపోయి యింటికి చేరుకొన్నాడు. కూతురుతో సంగతి చెప్పాడు.

'నువ్వేం విచారపడకు నాన్నా-' అంటూ ఆ పిల్ల చిప్పకుర్ర ముక్క ఒకటి తెంపి యిచ్చి-'దీంతో ప్రభువువారిని నేతమగ్గం ఒకటి చేయించి పంపమను' అంది. బీదవాడు ప్రభువుదగ్గరికి వెళ్ళి కూతురు మాట మనవిచేశాడు. ఆయన నూటయాభై కోడిగుడ్లు తెప్పించి, బీదవాడికిచ్చి-'యివి తీసుకెళ్లి తెల్లారేసరికి సి కూతుర్ని కోడిపిల్లల్ని పొదగమను' అన్నాడు.

బీదవాడికి మరింత విచారం కమ్మింది. ఇంటికి వచ్చి కూతురితో 'దీని కంతులేదు—ఒకటి తరవాత ఒకటి...' అన్నాడు. ఏడేళ్ల పిల్ల కోడిగుడ్లను బాగా వండి భోజనంలోకి అమర్చింది. తర్వాత తండ్రిని పిలిచి చెప్పింది. 'ప్రభువువారి దగ్గరికి వెళ్లి కోడిపిల్లలకు ఒకరోజుకు సరిపడ ఆహారం పంపమను. పొలం దున్నటం, గింజలు నాటటం, పంకి మొలవటం, కూర్చార పట్టటం, ధాన్యం తేవటం అంతా ఒక్క రోజులోనే అవాలని చెప్పు. లేకపోతే కోళ్ళు ఆ ఆహారాన్ని ముట్టనయినా ముట్టవు.'

ప్రభువువారు యిది విన్నారు. బీదవాడితో అన్నారు: 'నీ కూతురు అంత తెలివిగలదయితే, రేపుఉదయం యిక్కడికి రమ్మను.



వొంటిని బట్టవుండకూడదు-దిగంబరంగా రాకూడదు. నడిచి రాకూడదు, గుఱ్ఱం ఎక్కకూడదు - కానుక తేరాదు, బహుమానం తేకూడదు-'

బీదవాడు నిలువెల్లా కంపించిపోయాడు. 'ఈపని నా కూతురికి సాధ్యంకాదు-ఈ దెబ్బతో అంతా అయిపోయింది!' అనుకున్నాడు.

కాని అతని కూతురు 'నువేం దిగులుపడకు—వెంటనే వేటగాళ్ల దగ్గరికెళ్లి నాకో బతికున్న కుందేలునూ పక్షినీ కొనుక్కురా—'

తండ్రి వాటిని తెచ్చాడు. మర్నాడు ఆ సప్తవర్షిక తన దుస్తులన్నీ విప్పేసింది. చేపలవల వొంటికి చుట్టుకుంది. చేతిలో పక్షిని పట్టుకుంది. కుందేలు మీద కూర్చుంది. ప్రభువువారి దర్శనానికి వెళ్లింది. ప్రభువువారు ఆమెను

★ న్యాయం ★

ద్వారందగ్గరే కలునుకున్నారు. ఆ బాలిక ఆయనకు వొంగి నమస్కారం చేసి 'ప్రభూ, యిదిగో మీకు కానుక-' అంటూ చేతిని ముందుకు చాచింది. ప్రభువు పక్షిని అందుకోబోయాడు, కాని యింతలో అది ఎగిరిపోయింది.

'భేష్ - నే చెప్పినట్లల్లా చేశావు. యిప్పుడు యిది చెప్పు. నీ తండ్రి బీదవాడు కదా— మీ భోజనం ఎట్లా సంపాయిస్తారు-'

'మా నాన్న పొడినేలమీద చేపలవల పరుస్తాడు. అందరిలా నదుల్లో కాదు. నేను ఆ వలలో చిక్కుకున్న చేపల్ని తెచ్చి మా యిద్దరికీ భోజనం తయారు చేస్తాను-'

'పొడి నేలమీద చేపలు పడతాయా? చేపలు నీళ్ళలో కదా వుంటాయి-' అన్నారు ప్రభువు వారు.

'అయితే మహారాజా, బండి గుఱ్ఱంపిల్లను పెట్టినప్పుడు చేపలు పొడినేలమీద తిరగడంలో ఆశ్చర్యం యేమిటి?' అనడిగింది బాలిక.

ప్రభువు వారు గుఱ్ఱపుపిల్లను పేదవాడికి తిరిగి యిప్పించారు. ★

[రష్యా జానపద సాహిత్యంనించి.]

అవకాశవాదులు

ఒకనాడు నక్కబావ, పిల్లినత్తములూ, పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ మందగమనంతో బయలుదేరారు. చివరకు ఏ విషయం మీదా చర్చ కుదరక నీలి వేదాంత శాస్త్రాల్లోనికి దిగారు!

నక్కబావ యిలా అంది: "సృష్టిలో జీవరాసులన్నీ సమానమే! హెచ్చు తగ్గుల్లేవు! భేద భావాల్లేవు! ఒక జీవిని యింకొక జీవి హింసించడం సృష్టికర్త మెచ్చడు. బలవంతులు బలహీనుల్ని తమ ఎరగా చేసుకోవడం నీచాతినీచం! అసలు మనం మాంసాహారులమైనా, శాకాహారాలు తిని బ్రతగ్గలం! నీచం...మలినం... అయిన యీ కుళ్లు మాంసాహారం కన్నా కందమూలాదులెన్నో రెట్లు ఘనమైనవి. అందుచేతనే యీ రోజునుంచి, మాంసాహారం, విసర్జించదలచుకున్నాను. ఎప్పుడైతే మాంసం విసర్జించామో, జీవహింస చేసే అవసరం కలుగదు. అప్పుడే మనకు భగవంతుడు సన్నిహితుడౌతాడు!"

నక్కబావ చెప్పిన విషయాల్ని అర్థంచేసుకున్న దానిలా తల ఆడిస్తూ "అయితే బావగారూ! దేవుడంత భక్త సులభుడ! జీవహింస చేయనంత మాత్రాన మనకు ముక్తిని ప్రసాదిస్తాడ!" అన్నది పిల్లి.

"సందేహ మేముంది! జీవుల్ని హింసించకుండా, భగవధ్ధ్యానం గురిగా పెట్టుకొని, ప్రాణరక్షణకు, కందమూలాదులు తింటూవుంటే, నిజంగానే దేవుడు దర్శనమిస్తాడు!" అన్నది నక్కబావ!

"అలాగైతే నేనుకూడ యీనాటినుంచి మాంసంవర్జిస్తాను!" అన్నది పిల్లి.

"ఇది మన మిద్దరమే ఆచరిస్తే చాలదు. నలుగురకూ బోధించాలి. జీవహింస మహాపాపమన్న సంగతి,

శింగంపల్లి అప్పారావు

దేశం నలుమూలలా, వ్యాపింప చేయాలి! అప్పుడు మనకు ఎంతో కీర్తివస్తుంది!" అన్నది నక్క!

ఇద్దరూ అలా మాట్లాడుకుంటూ, చాలాదూరం నడిచి వచ్చేశారు. ఇంతలో ఎదురుగా వున్న చిట్టడవిలో నుంచి, తోడేలుగారు వూడిపడ్డారు!

"అడుగో తోడేలుబావ! ఎక్కడికో జోరుగా పోతున్నాడు!" అన్నది పిల్లి.

నక్క వెంటనే అటువైపు చూసి "ఏమండోయ్, బావగారూ! మాట మాట!" అని పిలిచింది.

కాని తోడేలు వినిపించుకోకుండా, నిర్లక్ష్యంగా గబగబా ముందుకు సాగిపోయింది!

ఆ ప్రాంతాల్లోనే ఒక చోట చిన్న గొర్రెల మంద వున్నది. గొర్రెల కాపరి చెట్టునీడన నిద్ర పోతున్నాడు. తోడేలు చడీ చప్పుడు లేకుండా వెళ్లి, ఒకగొర్రె పిల్ల కంఠం పుచ్చుకొని, చంపివేసింది! తరువాత దాన్ని నోట కరుచుకొని వెనక్కి వచ్చిన దారినే పరుగుతీసింది!

వస్తున్న తోడేలుకు నక్కబావ, పిల్లి నత్తములు, తారసపడ్డారు!

తోడేలు నోటిలోవున్న గొర్రె పిల్లను చూసి నక్కబావ ఎంతగానో విచారించింది.

"అయ్యో!......ఎంత దారుణ క్రూరకృత్యం!...జీవహింస, మహాపాపం కదోయ్! నీ ప్రాణరక్షణకోసం, దాన్ని బలిచేయడం ఏమి గొప్పతనం! -నీచమైన ఆ మాంసం లేకపోతే చచ్చిపోతావా! కందమూలాదులు తిని బ్రతకవచ్చునే!" అన్నది నక్క తోడేలుకు నీతి బోధిస్తూ!

నక్క అన్న మాటలకు, బిగ్గరగా నవ్వింది తోడేలు.

"నక్కబావగారు యీ ఉపన్యాసా లెప్పటినుంచి మొదలు పెట్టారు! భేష్!—బాగానే వుంది! మీ రీనాడు, ఏ జంతువు మాంసం భోంచేసి యిలా బయలుదేరారు! పాపం నక్కయ్యగారికి తిక్కెక్కినట్టుంది!" అన్నది తోడేలు హేళనగా.

"ఛాల్చాల్లే! నోర్ముయ్! నక్క



“పలుకరాదటే చిలుకా!”

—ఫోటో: జి. ఎస్. శర్మ.

★ అవకాశవాదులు ★

బావగారినంటే కళ్లు పోతాయ్! ఆయన కందమూలఫలాలు తప్పిస్తే మాంసాహారం భుజించరు! తెలుసా!” అన్నది మార్జాలం!

“అలాగా! ఓరి పిచ్చినాయనమ్మలూ, మీ వేదాంతాలు నీతిశాస్త్రాలూ, అలా కట్టిపెట్టండి! ఆకలిగా ఉన్నప్పుడు ఆహారం సంపాదించుకోవడంలో, తప్పేముంది? కందమూలాలు, కష్టపడి పనిచేయలేక, ముక్కు మూసుకొని, మూలకూర్చునే మునిరాయుళ్ళకుగాని, మనకెందుకూ? అసలు సంగతేమిటంటే,- సృష్టిలో కొన్ని జీవరాసుల్ని, విధాత, మన ఆహారంకోసమే సృష్టించాడు! అంతెందుకూ మాంసాహారం కన్పించినపుడు తినడం పుట్టుకు మానను! అది నావల్ల అయ్యే పని గాదు! మీరు మాంసాహారం మానేస్తే నాకేమీ అభ్యంతరం లేదు. ఎక్కడైనా మాజోటిగాళ్లకు శాస్త్ర ఆహారమైనా చిక్కుతుంది!” అంటూ తోడేలు చిట్టడవిలోనికి పారిపోయింది!

నక్క, పిల్లి, ఆశ్చర్యపోతూ, తోడేలు వెళ్ళినవైపే చూస్తూ, ఒక్క క్షణం స్తబ్ధంగా వుండిపోయాయి.

‘ఎంత భయానక దృశ్యం! నెత్తురు ఓడుతున్న ఆ గొర్రెపిల్లను చూడగానే, నిజంగా నాకేదు పొచ్చింది!” అన్నది పిల్లి కన్నీళ్లు కారుస్తూ!

నక్క ముఖంలో గాంభీర్యం

తెచ్చుకొని "మూర్ఖులు! - మంచిని గ్రహించలేరు! ఇలాంటి పరమ కిరాతులు, సద్గతిని ఎలా పొందుతారు! ఎవరి కర్మ వారిది!" అన్నది వేదాంతిలా!

"పోనిద్దురూ! మన విధి మనం నెరవేర్చాం! వినకపోతే నరకానికే పోతారు!" అన్నది పిల్లి.

మళ్లా యిద్దరూ నడకసాగించారు! చివరకు ఒక మిల్లువద్దకు చేరుకున్నారు. అక్కడ కొన్ని కోళ్ళు నేలమీద పడివున్న గింజ ఏరుకుతింటున్నాయ్!

వేదాంతం యింకా గంభీరంగా మాట్లాడుతూ వస్తున్న నక్కగారి కన్ను అమాంతం కోళ్ళమీద పడింది. వెంటనే చెబుతున్న వేదాంతం చటుక్కున ఆగిపోయింది!

"బావగారూ! క్షమించాలి! నాకీ ఋల్లుపక్క కాస్త పనుంది! తప్పకుండా రేపు కల్సుకుందాం! మీకు కనిపించినవారికల్లా, అహింస యొక్క గొప్పతనాన్ని వివరించి చెప్పండి! నేను చెప్పిన సంగతులు మరచిపోకండి!" అంటూ నక్క వెనక్కి దిగబడిపోయింది!

పిల్లికి అయోమయంగా వుంది! అనుమానం కూడ వేసింది! - కొంత దూరం వెళ్ళి, వెనక్కి తిరిగి చూసింది ఓరకంటితో!—

ఏముంది!!!—నక్కయ్యగారు తక్కుతూ, తారుతూ వెళ్ళి, అమాంతం చిన్న కోడిపెట్టమీదికురికి, నోట కరచుకొని, పొలాలకు అడ్డుగావడి పారిపోయింది!

ఇది చూస్తున్న పిల్లి విస్తుపోతూ "ఆఁ...ఇదా సంగతి! ఛీ—ఎంత మోసకారి! అందరికీ నీతులు బోధించి తను చేస్తున్న పనేమిటి! మాటలు చెప్పడం సులువే! కార్యరూపం వచ్చేసరికి జారిపోయింది! అంతా నక్కలాంటి తిక్క శంకరయ్యలే వుంటారా! నేను మట్టుకు అలా చేస్తానా! చస్తే చేయను! అందరికీ అహింసాతత్త్వాన్ని బోధిస్తాను" అనుకుంటూ కాలుముందుకు వేసింది.

ఇంతలో ఎలుక ఒకటి మిల్లులో నుంచి పరుగెత్తుకుంటూ బైటకు వచ్చింది. వెంటనే పిల్లి దృష్టి దాని మీద పడింది!

ఇక ఆలస్యంచేయకుండ, ఆలోచన్లనలా కట్టిపెట్టి అమాంతం దానిమీదికురికి నోట కరచుకొని మిల్లుప్రక్కనుంచి పరుగుతీసింది!

ఇదంతా చూస్తూ మిల్లుగోడ మీద, సాలెగూడులో కూర్చున్న సాలెపురుగు చిత్రంగా తనలో తనే నవ్వుకుంది!

"అయ్యయ్యో! ఎంతటి స్వార్థపరులమ్మా వీళ్లు!— వీళ్ళకు ఏకోశానా జాలి అన్నమాట వుండదు! చూస్తే వీళ్ళకన్నా నేనే ఎన్నోరెట్లు గొప్పగా కన్పిస్తున్నాను. జీవహింస చేయకూడదన్న సంగతి సరిగా అర్థం చేసుకోగలను!" అనుకున్నది.

ఇంతలో ఒక యీగ ఎగురుతూ వచ్చి సాలెగూడులో చిక్కడిపోయింది!

సాలెపురుగు దాన్ని చూసి మెల్లగా లేచి వొళ్ళు బద్ధకంగా విరుచుకొని, "కడుపు మాడినపుడు ఏదో ఒకటి భోంచేయడం తప్పెలా అవుతుంది! అసలు సృష్టికర్తఅయిన దేవుడే జీవహింస చేశాడు. మనమొక లెఖ్ఖా! వేదాంతాల కేమి లెద్దూ! ఎన్నైనా చెప్పవచ్చు! ముందు ఆకలిసంగతి చూసుకోవాలి!" అంటూ సాలెపురుగు యీగను నోట కరచుకొని గూడు చేరుకుంది!

★

సాగరగర్భంలో సాహసయాత్ర

(49-వ పేజీ తరువాయి)

మీకేమీ బోధపడలేదన్నమాట!" అన్నాడు కెప్టెన్.

"నాకేమీ బోధపడడంలేదు."

"సరే! ఇలా రండి! అన్నీ మీకే తెలుస్తాయి!"

అంతలో జలాంతర్గామి నావికులు నెమ్మదిగా కిటికీలు తెరిచారు. నెడ్‌లాండ్, కౌన్సెలు లిద్దరు ఏమి జరుగుతుందా అని ఎంతో ఆత్రంగా చూస్తున్నారు.

అంతలో 'కుయ్యో! మొర్రో' అని పెద్ద పెద్ద కేకలు వినిపించాయి. అక్కడే కమ్ములు పట్టుకుని నిలబడి ఉన్న ఒక్క ఆటవికుడు పెద్ద పెద్ద కేకలు పెడుతూ వెనక్కి పడిపోయాడు. ఏదో ఒక అజ్ఞాతశక్తి హఠాత్తుగా అతన్ని వెనక్కి నెట్టివేసింది. ఆ తరవాత మరో ఇద్దరికి కూడా అదే గతిపట్టింది. మిగిలిన వాళ్ళంతా కుయ్యో మొర్రోమని అరుస్తూ జలాంతర్గామి విడిచిపెట్టి సముద్రంలో పడ్డారు.

ఈ విధంగా ఆటవికులంతా హడలిపోయి పరుగు లంకించుకొనేసరికి కౌన్సెల్ ఎగిరి గంతేశాడు. ఇక అతని ఉత్సాహానికి పట్టపగ్గాలు లేవు. నెడ్‌లాండ్ ఏమి జరుగుతున్నదో చూడవలెననే ఉబలాటంతో వెంటనే అక్కడికి వెళ్ళి నిలుచున్నాడు. విద్యుదాఘాతం తగిలి హఠాత్తుగా వెనక్కి పడిపోయాడు:

"అబ్బా! నాకు పెద్ద షాక్ తగిలింది!" అని గట్టిగా అరిచాడు.

ఆ మాటతో నాకంతా బోధపడిపోయింది. జలాంతర్గామి పైభాగాని కంతటికీ లోపల ఏర్పాటు చేసిన తీగలద్వారా విద్యుచ్ఛక్తి ప్రవహింప జేశారన్నమాట! నిజంగా కెప్టెన్ నిమో ఇంకా ఎక్కువ విద్యుచ్ఛక్తి ప్రవహింపజేసి ఉన్నట్లయితే ఆ ఆటవికులందరు వెంటనే ప్రాణాలు విడిచి ఉండవలసిందే. దానినిబట్టి కెప్టెన్ నిమో జలాంతర్గామికంతటికీ పెద్ద విద్యుత్కవచం ఏర్పాటుచేశాడని అది అత్యంతదుర్భేద్యమనీ తెలుసుకొన్నాను.

ఆలోగా గిల్బోవా ద్వీపవాసులందరు మళ్ళీ వెనక్కైనా తిరిగి చూడకుండా గబగబా పరుగెత్తుకు పోయారు. పాపం నెడ్‌లాండ్ ఇందాకటినించీ బొబ్బలు పెడుతూనే ఉన్నాడు. మేము అతని దగ్గిరికి వెళ్ళి ఓదార్చాము.

అప్పటికి సముద్రానికి బాగా పోటుతగిలింది. సరీగా కెప్టెన్ నిర్ణయించిన సమయానికి నాటిలస్ మళ్ళీ నడక ప్రారంభించింది. క్రమక్రమంగా దాని గమనవేగం పెరిగింది. అది ఆ ప్రాంతం విడిచి తొందర తొందరగా మున్ముందుకు సాగిపోయింది.

ఆ సమయంలో దాని వేగం గంటకు ముప్పైఐదు మైళ్లుంటుంది.

విద్యుచ్ఛక్తి జలాంతర్గామికొక కవచంలా పనిచేస్తూంది. జలాంతర్గామికి కావలసిన సదుపాయాలన్నీ విద్యుచ్ఛక్తిమూలంగా జరిగిపోతున్నాయి. అవసరం వచ్చినప్పుడది శత్రువులమీద ఒక బ్రహ్మాండమైన వజ్రాయుధంలాకూడా పని చేస్తూంది.

ఒకవేళ శత్రువు లెవరైనా దాని మీద చెయ్యివేశారంటే వెంటనే వారంతా భస్మీపటలమై పోవలసిందే!

—ఇంకా ఉంది

న్యూఢిల్లీ లేఖ

(5-వ పేజీ తరువాయి)

సంఘం పేర్కొన్నదోషులను దండించడం తమవల్ల కాదన్న కారణంపై కేంద్ర ఆరోగ్యశాఖ ఆ నివేదికను అమలుజరుప నిరాకరించింది

ఈ నీటిసరఫరా సంఘానికి ఢిల్లీ చీఫ్‌కమిషనరే అధ్యక్షుడు. పురపాలక సంఘ సభ్యులు ఐదుగురు ఇందులో అనధికార సభ్యులు. స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న కార్పోలు ఈ సంఘంకూడా, ఆ ఉద్యోగుల మీద చర్య తీసుకోనంటుంది. ఆ ఫలానా ఉద్యోగుల నిర్లక్ష్యం, జరిగిన దారుణానికి కొంతకారణమని చెప్పినది నిష్పక్షపాతులైన ప్రవీణులసంఘం అయినా వీరికిలక్ష్యంలేదు.

ఆరోగ్య శాఖ "నా పని కాదు" అనడం ఈ స్వతంత్ర సంఘం" అది కుదరదు" అనడం, ఇవన్నీ కూడా, "వింటే విను, లేదా పో" అని చెప్పే తాహతు అధికారం గల దేశీయాంగ మంత్రి సమక్షాన జరిగాయి.

అయితే, ఇంతకుముందు ఆరోగ్యమంత్రిణి ఒకసారి విలేఖరులతో మాట్లాడుతున్నప్పుడు "ఇటువంటి సంఘటన బ్రిటిషు హయాంలో, జరిగితే, అప్పుడు 83 కాదుగదా, ముగ్గురంటే ముగ్గురే చనిపోయివున్నా, మీరేంచేసే వారు" అని ఒక విలేఖరి సూటిగా అడిగాడు.

"దోషులను తప్పకుండా దండించడం జరుగుతుంది" అని శ్రీమతి అమృతకౌర్ ఆ రోజున స్పష్టంగా చెప్పారు.


తరవాత జరిగిన కథని బట్టి చూస్తే, ఆమెకు, తన అధికారాల విషయంలో తెలియని గొప్ప అభిప్రాయాలు ఉండి ఉండాలి అనిపిస్తుంది. లేదా, ఢిల్లీ రాష్ట్రంలోని ఒకానొక మంత్రి శక్తి సామర్థ్యాల గురించి, అధికారాల గురించి, ఆమె కట్టుకున్న అంచనాలు తప్పు అనేనా అనుకోవలసి వస్తుంది. అన్నిటికన్న బాధాకరమైనది ఏమిటంటే, ప్రధాన మంత్రి కూడా, న్యాయాన్ని పనాలు చేసి చెలగాటం ఆడే వ్యక్తుల వైపునుండి దృష్టి మరల్చుకోవడం. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



నవ్వే పాప

—ఫొటో : కె. వి. శివరామశాస్త్రి.


JASMINE
మీరు
అందంగా
కనపడతారు
జస్మీన్
రేయాన్ సిల్కులో
జస్మిన్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, బొంబాయి - 2